అనుదినం... జనస్వరం

www.navatelangana.com

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 28-01-2025

సంపుటి : 10 | సంచిక : 339 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50


## రూ.9 లక్షల కోట్ల సంపద ఫట్

కుప్పకూలిన దలాల్ స్ట్రీట్

సెన్సెక్స్ 824 పాయింట్ల పతనం

వివరాలు 11లో




**డాలర్ దెబ్బ.. రూపాయి విలవిల**

11 పైసలు కోల్పోయి రూ.86.33 కనిష్టానికి

11లో..

# మెరుపులేని మిరప

## దిగుబడి వస్తున్న కొద్దీ ధరల పతనం



ఏటేటా...నెలనెలా తగ్గుతున్న రేట్లు

ఎకరాకు రూ.2.50 లక్షల పెట్టుబడి..

అదీ రావట్లే

గరిష్టం 25 క్వింటాళ్ల ఉత్పత్తి ధర రూ.12వేల లోపే

**నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి**

సరైన ధరలు లేక మిర్చి రైతులు అల్లాడుతున్నారు. ఏటేటా మిర్చి రేట్లు పడిపోతుండగా ఈ సీజన్‌లో నెలనెలా పతనం అవుతున్నాయి. రాష్ట్రంలోని పేరుమోసిన మిర్చి మార్కెట్లు వరంగల్, ఖమ్మంలో మూడేండ్ల క్రితం తేజా రకం మిర్చి ధరలు రికార్డుస్థాయిలో క్వింటాల్ రూ.25వేలకు పైగా ధర పలికాయి. 2022లో వరంగల్ మార్కెట్‌లో చపాట రకం మిర్చి ధర ఏకంగా రూ.96వేల రికార్డు స్థాయి ధర పలికింది. 2023 మార్చిలో తేజా రకం మిర్చి ధర ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.25,550 నమోదైంది. నాటి నుంచి క్రమేణా క్షీణిస్తున్నాయి. 2023 ఏప్రిల్‌లో రాష్ట్రంలోని పలు మార్కెట్లలో క్వింటాల్ రూ.23వేలకు పైగా పలికిన మిర్చి ధరలు, 2024లో మరింతగా తగ్గాయి. 2024 అక్టోబర్ 3వ తేదీన రూ.20వేలకు పైన ఉన్న మిర్చి ధరలు నెలనెలా తగ్గుతున్నాయి. పంట దిగుబడులు మార్కెట్‌కు వస్తున్న కొద్దీ ధరల్లో క్షీణత చోటుచేసుకుంటోంది.

**నెలనెలా తగ్గుతున్న ధరలు..**

ఈ సీజన్‌లో మిర్చి ధరలు నెలనెలా తగ్గుతున్నాయి. మార్కెట్‌కు సరుకు వస్తున్న కొద్దీ రేటులో మందగమనం నెలకొంటోంది. ఈ సీజన్‌లో 2024 అక్టోబర్ 3వ తేదీన క్వింటాల్ మిర్చి రూ.20వేలు పలకగా, నవంబర్ 3న రూ.18,300, అదే నెల 26వ తేదీ నాటికి రూ.16,500, డిసెంబర్ 18న రూ.16,200 ఉన్న ధర ఆ నెల 31న రూ.15,511కు పడిపోయింది. ఈ ఏడాది జనవరి 6న రూ.15,800 ఉన్న ధర 16వ తేదీ నాటికి రూ.14వేలకు క్షీణించింది. ఇక సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 37,306 బస్తాల మిర్చి రాగా గరిష్ట ధర కేవలం రూ.14,800 పలికింది. ఎక్కువ మొత్తం పంటను రూ.13వేల కన్నా తక్కువకే కొనుగోలు చేశారు. కొత్త మిర్చి వస్తుండటంతో నిల్వ చేసిన ఏసీ మిర్చి ధరలు మరింతగా తగ్గుతున్నాయి. ఏసీ తేజా రకం మిర్చికి 27వ తేదీన రూ.12వేల గరిష్ట ధర పలకటం గమనార్హం.

**అనుమతులు లేకనే..!**

రాష్ట్రవ్యాప్తంగా తేజా రకం మిర్చి ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో మాత్రమే ఎక్కువగా సాగు చేస్తారు. ఈ రకం ఘాటైనది కావడంతో 90శాతానికి పైగా పంట చైనా, థాయ్‌లాండ్, బ్యాంకాక్, సింగపూర్ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుంది. సాధారణ రకం పంటను ఇక్కడే ప్రాసెసింగ్ చేసి వినియోగంలోకి తెస్తారు. ఖమ్మం మార్కెట్‌కు జిల్లా రైతులతో పాటు పొరుగు జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి రైతులు సరుకు తీసుకొస్తారు. గతేడాది సీజన్‌లో క్వింటాకు రూ.22వేలు పలికిని మిర్చి ధర ఈ ఏడాది సీజన్ ప్రారంభం నాటికి గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో అధిక మొత్తం సరుకును కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసే దిశగా రైతులు యోచన చేస్తున్నారు.

**నలిపేస్తున్న తామరనల్లి**

మిర్చి పంట పెట్టుబడులు ఏటేటా ...11లో

## హలో ట్రంప్‌జీ..

అమెరికా అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్‌కాల్

వివరాలు 11లో

## సూర్యాపేటలో కులదురహంకార హత్య ?

ఆరు నెలల కిందట ప్రేమ వివాహం

యువతి సోదరునిపై అనుమానాలు


(ఫైల్)

**నవతెలంగాణ-సూర్యాపేట**

కులాంతర వివాహం చేసుకున్న యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా శివారులోని జనగామ రహదారి నుంచి పిల్లలమర్రికి వెళ్లే మూసీ కాల్వకట్టపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఈ హత్యకు పాత కక్షలు కారణమా ? లేక ప్రేమ వివాహమే కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యులు, భార్య భార్గవి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటలోని మామిళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి(32) సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన కోట్ల నవీన్ స్నేహితులు. కృష్ణ తరచూ ...11లో



## వేరుశనగ రైతుల ఆగ్రహం

అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత


వ్యాపారులు, ఏజెంట్లు దోచుకుంటున్నారని ఆగ్రహం

కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం

వివరాలు 11లో

# పార్టీ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాపునాది పెరుగుదలపై దృష్టి సారించండి




రాష్ట్ర రాజకీయాలను కులాలు నియంత్రిస్తున్నాయి

మోడీ ఇన్ ధోతి అంటూ కేరళ సీఎం పినరయ్‌ని కాంగ్రెస్ టార్గెట్ చేస్తున్నది : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్

**సంగారెడ్డి నుంచి బి.బసవపున్నయ్య**




పార్టీ సైద్దాంతిక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్ సూచించారు. ప్రజాసంఘాల కార్యక్రమాలు, సభ్యత్వం పెరుగుతున్నా ప్రజా పునాది ఎందుకు మెరుగు కావడం లేదనే విషయంపై దృష్టిసారించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో సొంత బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. పార్టీ శాఖలే ఉద్యమాల ద్వారా ప్రజలను, కార్మికులను, యువతను ప్రభావితం చేయాలని అన్నారు. ఆత్మవిమర్శ చేసుకోవడం ద్వారా పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. తెలంగాణ రాజకీయాలను డబ్బు, మద్యం, కులాలు ప్రభావితం చేస్తున్నాయన్నారు. అన్ని తరగతుల్లోనూ కుల రాజకీయాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ మత, విభజన రాజకీయాలను కొనసాగిస్తున్నదన్నారు. కేరళలో ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్‌ను మోడీ ఇన్ దోతి అంటూ కాంగ్రెస్ అవమానిస్తున్నదన్నారు. ఇండియా బ్లాక్‌లో ఉన్న కాంగ్రెస్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇబ్బందులు, కష్టాలు ఎన్ని వచ్చినా పార్టీని నిర్మిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బలహీనతలను సవరించుకోవాలన్నారు. పార్టీ విస్తరణకు మిలిటెంట్ పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ప్రజల్లోకి వెళ్లడానికి కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తున్నదనీ, అయినా, వెరవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

## ఐక్య పోరాటాలకు సిద్ధం



ప్రజా సమస్యలకే ప్రాధాన్యత

కనీస మద్దతు ధర చట్టం పట్టని బీజేపీ, కాంగ్రెస్

కోటిన్నర మంది కార్మికులకు కనీస వేతనాలు కరువు

2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పరిహారమివ్వాలి

ఈజీఎస్ పని దినాలు 200కు పెంచాలి

3లో..

## నేడు నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

పలు అంశాలపై చర్చలు, తీర్మానాలు

దిశా నిర్దేశం చేసిన జాతీయ నేతలు

ముగియనున్న సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభలు

3లో..

# ఆర్టీసీలో సమ్మె సైరన్

## యాజమాన్యానికి జేఏసీ నేతల నోటీస్

15 రోజుల్లో సమ్మె తేదీ ప్రకటన

నివారించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ బస్సుల్ని ప్రభుత్వమే కొని ఆర్టీసీకి ఇవ్వాలి : టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతల డిమాండ్



**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. సోమవారం ఆరు కార్మిక సంఘాల జేఏసీ నేతలు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. 15 రోజుల్లో సమ్మె తేదీ ప్రకటిస్తామని చెప్పారు. సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం జేఏసీ చైర్మెన్ ఈ వెంకన్న (ఎంప్లాయిస్ యూనియన్), వైస్ చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి (టీఎమ్‌యూ), కన్వీనర్ మహ్మద్ మౌలానా (ఎస్‌ఎమ్‌యూ), కో కన్వీనర్లు కే యాదయ్య (బీకేయూ), ఎస్ సురేష్ (బీడబ్ల్యూయూ), బీ యాదగిరి (కార్మిక పరిషత్) బస్‌భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నివారించాల్సిన బాధ్యత వారిదేనని స్పష్టంచేశారు. ఆర్టీసీలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలనీ, సంస్థలోకి విద్యుత్ అద్దె బస్సుల ప్రవేశాన్ని అనుమతించబోమని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ బస్సుల్ని కొనుగోలు చేసి, ఆర్టీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, 2021 జీతభత్యాల సవరణ, కండక్టర్, డ్రైవర్ల ఉద్యోగ భద్రత, ఖాళీల భర్తీ, ఆర్టీసీ పరిరక్షణ సహా 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును యాజమాన్యానికి ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తే, ఆర్టీసీ కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేయడం కోసం వచ్చే రెండువారాలు రాష్ట్రవ్యాప్తంగా డిపోలు, గ్యారేజీల్లో పర్యటిస్తామని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# 4.41 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా

## 563 గ్రామాల్లో 4 పథకాలు ప్రారంభం

రైతులు, కూలీల ఖాతాలకు రూ.579 కోట్లు విడుదల

పదేండ్ల తర్వాత కొత్త రేషన్ కార్డులకు మోక్షం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ప్రజా ప్రభుత్వం మరో రికార్డు నెలకొల్పింది. ఒకే రోజు నాలుగు సంక్షేమ పథకాలను విజయవంతంగా ప్రారంభించటంతో పాటు.. అక్కడికక్కడే 6,15,677 మంది అర్హులకు లబ్ది కల్పించింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థిక శాఖ రూ.579 కోట్లు విడుదల చేసింది. లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కూలీల కుటుంబాల్లో ఈ నిధులు జమ కావటంతో రాష్ట్రమంతటా ప్రజల్లో ఆనందం వెల్లివిరిసిందని ప్రభుత్వం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా ప్రకటించిన విధంగానే ప్రజాపాలనలో నాలుగు సంక్షేమ పథకాలు విజయవంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజునే లక్షలాది మంది ఈ సంక్షేమ పథకాలను అందుకున్నారని పేర్కొన్నది.




గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎంపిక చేసిన 563 గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఆర్థిక సాయాన్ని అప్పటికప్పుడే వారి ఖాతాల్లో జమ చేసింది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేసింది. గూడు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించింది. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు కొత్త కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా సభ్యుల నమోదు ప్రక్రియను పూర్తి చేసింది. మొదటి రోజునే రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లో 563 గ్రామాలలో 4,41,911 మంది రైతులకు ఎకరానికి తొలి విడతగా రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి రైతు భరోసాను చెల్లించింది. 26వ తేదీన బ్యాంకులకు సెలవు దినం కావటంతో సోమవారం ఉదయం నుంచి రైతుల ఖాతాల్లో నిధులు జమయ్యాయి. తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మొదటి విడతగా రూ.6 వేలు చెల్లించింది. పథకానికి తొలి రోజునే ఆర్థిక శాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది. గత పదేండ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూసిన రాష్ట్ర ప్రజల నిరీక్షణ ఫలించింది. అర్హులైన కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ ప్రారంభించింది. వీటితో పాటు పాత రేషన్ కార్డుల్లో అదనపు కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసింది. తొలి రోజున 531 గ్రామాల్లో 15,414 కొత్త కార్డులు ఇచ్చింది. వీటిలో 51,912 మంది కుటుంబ సభ్యులు లబ్ది పొందారు. వీటితో పాటు అదనపు సభ్యులను చేర్చాలంటూ 1.02 లక్షల మంది కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించింది. ఇప్పటికే ఉన్న కార్డుల్లో అదనంగా 1,03,674 మంది ...11లో



## వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాల సవరణలకు నో

ఎన్డీఏ ప్రతిపాదనలకు జేపీసీ ఆమోదం

అదో ప్రహసనం..కమిటీ చైర్మెన్ నియంతలా వ్యవహరించారు : విపక్షాల ఆగ్రహం

వివరాలు 3లో



## ఉపాధికి నిధుల కొరత

2024-25లో అదనపు కేటాయింపులు నిల్

పేరుకుపోతున్న వేతన బకాయిలు

మెటీరియల్ కొనుగోలు ఖర్చులోనూ వాటా చెల్లించని కేంద్రం

వివరాలు 11లో

# సరిహద్దుల వద్ద జనసంద్రం

## ఉత్తర గాజాలోని స్వస్థలాలకు వేలాదిమంది పాలస్తీనియన్లు



**గాజా, జెరూసలేం :** గతేడాదికి పైగా సాగిన దాడుల కారణంగా నిర్వాసితులైన వేలాదిమంది పాలస్తీనియన్లు తిరిగి ఉత్తర గాజాలోని తమవారిని కలుసుకునేందుకు అత్యుత్సాహంగా వస్తున్నారు. వీరందరూ గత 15మాసాలుగా తాత్కాలిక శిబిరాల్లో కాలం గడుపుతూ వచ్చారు. దాడులతో తీవ్రంగా ధ్వంసమైన ఉత్తర గాజాలోని తమ ఇల్లూ వాకిళ్లను, అసలక్కడ ఏమైనా మిగిలున్నాయా లేదా అనేది చూసుకునేందుకు వారు ఆతృతగా వస్తున్నారు. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా జన సముద్రం కనిపిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటి నుండి తాము స్వస్థలాలకు వెళ్ళేందుకు ఎదురుచూస్తున్నామని, ఇప్పటికి ఆ కల నెరవేరిందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. విచక్షణారహితంగా దాడులు జరుపుతూ వేలాదిమందిని పొట్టన బెట్టుకున్న ఇజ్రాయిల్ ఆర్మీ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత మొదటిసారిగా నిర్వాసితులను ఉత్తర గాజాకు వచ్చేందుకు ఇజ్రాయిల్ అనుమతించింది. ఇజ్రాయిల్ ఆర్మీ ఆదేశాల మేరకు ఆనాడు వీరందరూ దక్షిణ గాజాకు వెళ్ళిపోవాల్సి వచ్చింది. కాలినడకన వచ్చేవారు సోమవారం ఉదయం 7గంటల నుండి అల్ రషీద్ వీధి గుండా, వాహనాల్లో వచ్చే వారు ఉదయం 9గంటల నుండి సాలాహ్ అల్ దిన్ వీధి గుండా వచ్చేందుకు అనుమతించినట్లు ఆర్మీ ప్రకటించింది. బందీగా వున్న ఇజ్రాయిల్ మహిళ అరబెల్ యహుద్‌ను, మరో ఇద్దరిని శుక్రవారానికల్లా విడుదల చేసేందుకు హమాస్ అంగీకరించిందని, పైగా ఒప్పందంలో భాగంగా మొదటి దశలో విడుదల చేసేవారి పరిస్థితిపై కూడా సమాచారం అందించామని కతార్ ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయిల్ ఈ అనుమతిని ఆమోదించింది.

ఇదిలావుండగా, ఇజ్రాయిల్-హిజ్బుల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఫిబ్రవరి 18వరకు పొడిగిస్తున్నట్టు అమెరికా, లెబనాన్ ప్రకటించాయి. గాజా ప్రజలను బలవంతంగా ఈజిప్ట్, జోర్డాన్‌లకు ...11లో


## కాళేశ్వరంపై బీఆర్‌ఎస్‌వి తప్పుడు వాదనలు

జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు జేఏసీ నేత రఘు వాంగ్మూలం



11లో..

## అటు పథకాలు..ఇటు బారులు..



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి గణతంత్ర దినోత్సవం జనవరి 26న వాటి అమలుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే పథకాల లబ్ది కోసం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. ముఖ్యంగా ఆధార్ సవరణల కోసం ఆధార్ సెంటర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త ఆధార్‌కార్డుల కోసం, పేరు, అడ్రస్, తదితర వాటి అప్డేట్ కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. సోమవారం హనుమకొండ జిల్లాలోని రీజియన్ ఆధార్ కేంద్రం వద్ద ప్రజలు బారులు తీరిన దృశ్యాన్ని నవతెలంగాణ క్లిక్‌మనిపించింది.

- వరంగల్ ప్రాంతీయప్రతినిధి

## జీవో నెంబర్ 46పై నెల రోజుల్లో వైఖరి తెలపండి

- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చేపట్టిన స్పెషల్ పోలీస్ నియామకాల్లో జీవో నెంబర్ 46పై నెల రోజుల్లో వైఖరి తెలపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్పెషల్ పోలీస్ నియామకాల్లో హైదరాబాద్, సైబరాబాద్ అభ్యర్థులకు కటాఫ్ మార్క్ తగ్గిస్తూ గత సర్కారు 2023లో జీవో నెంబర్ 46ను తీసుకొచ్చింది. ఈ జీవోతో గ్రామీణ ప్రాంత యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందనీ, దీనిని మినహాయించాలని కోరుతూ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. ఈ తీర్పును సవాల్ చేస్తు అక్టోబర్ 19 మాటూరి శ్రీకాంత్, బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డితో పాటు మరో 74 మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటీషనర్ల తరపు అడ్వొకేట్లు ఆదిత్య సోంది, మిథిన్ శశాంక్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అఫిడవిట్ దాఖలు చేయలేదని బెంచ్‌కు నివేదించారు. ఇందుకు ప్రభుత్వ తరపు న్యాయవాది స్పందిస్తూ.. అఫిడవిట్ దాఖలుకు మరో రెండు నెలలు గడవు ఇవ్వాలని అభ్యర్థించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం ఫిబ్రవరి 28 లోపు జీవో నెంబర్ 46పై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపత్నకు ఊరట

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొన్న మేకల తిరుపతన్న(అప్పటి అడిషనల్ ఎస్పీ)కు సుప్రీంకోర్టు నుంచి ఊరట దక్కింది. ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని తిరుపత్న రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గతేడాది అక్టోబర్ 20న ఆయన సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సుదీర్ఘకాలంగా జైలులో ఉంటున్నాననీ, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్‌లో పొందుపరిచారు.

## ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఏఈ

- రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
- గతంలోనే పలు ఆరోపణలు



నవతెలంగాణ-మనోహరాబాద్

ఓ ప్రయివేటు పరిశ్రమకు విద్యుత్ సర్వీసును ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ ఏఈని సోమవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కోర్టుకు తరలించిన సంఘటన పారిశ్రామిక ప్రాంతమైన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో జరిగింది. మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపూర్ పారిశ్రామిక ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓ ప్రయివేటు పరిశ్రమకు 63 కేవీ 3 ఫేస్ లైన్ అవసరం కావడంతో విద్యుత్ సర్వీస్ గురించి ఏఈ కృష్ణను యజమాని కలిశారు. దాంతో ఏఈ కనెక్షన్‌కు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. కాగా ఈ నెల 17న రూ.10 వేలు ఇవ్వగా మరో రూ.20 వేలు సోమవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇస్తున్నట్టు ఏసీబీకి సమాచారం అందడంతో నిఘా పెట్టారు. విద్యుత్ కార్యాలయం వద్ద మిగతా డబ్బు రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌తో కలిసి ఏఈ కృష్ణను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈ కృష్ణను ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

## హుస్సేన్‌సాగర్ బాధితులకు రూ.5లక్షల పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హుస్సేన్‌సాగర్ బోటు ప్రమాదంలో గాయపడిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.5లక్షల పరిహారం చెల్లించాలని తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి జె.కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. రిపబ్లిక్‌డే వేడుకల్లో భాగంగా భరతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాగర్‌లో నిర్వహించిన వేడకల్లో టపాకాయలు పేలటంతో జరిగిన ఘటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలన్నారు. ప్రమాద సమయంలో బోటులో ఉన్న 11 మంది సిబ్బందిని, బోటు డ్రైవర్లు ప్రాణాలకు తెగించి రక్షించారని గుర్తు చేశారు. అయితే ఈ దుర్ఘటనలో గణపతి అనే వ్యక్తికి 90 శాతం, ప్రణీత్, సునీల్ చేతులకు, తీవ్ర గాయాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. టూరిజం యాజమాన్యం తక్షణం స్పందించి బాధితులకు రూ.5 లక్షల నష్టపరిహారంతో పాటు పూర్తి వైద్య ఖర్చులు భరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రూ.50 లక్షలతో కొత్త బోట్లు కొనడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మంత్రి శ్రీధర్‌బాబుతో అయిచి ప్రతినిధి బృందం భేటీ

- 20వ ఆసియా క్రీడలకు ఆహ్వానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జపాన్‌లోని అయిచి రాష్ట్రానికి చెందిన ప్రతినిధి బృందం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం భేటి అయింది. 2026లో తమ రాష్ట్రంలో జరిగే 20వ ఏషియన్స్ గేమ్స్‌కు మంత్రిని ఆహ్వానించారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర వాణిజ్య, వ్యాపార అవాకాశాలపై సమావేశంలో చర్చించారు. తమ రాష్ట్రం టొయోటా కార్ల పరిశ్రమతో పాటు, ఏరోస్పేస్, ఆటోమొబైల్, రోబోటిక్స్, యంత్ర పరికరాల తయారీలో అగ్రగామిగా ఉందనీ. ఇటీవలే 'స్టేషన్ ఏఐ' పేరుతో దేశంలోనే అతిపెద్ద అంకుర సంస్థల ఇంక్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించామని ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన అయిచి శాసనసభ్యులు హిరోహిటో కొండా మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని టీ హబ్ కూడా అంకుర సంస్థల ప్రోత్సాహంలో దేశంలో ప్రముఖంగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు తెలంగాణా ఆహ్వానం పలుకుతోందని ఆయన వెల్లడించారు. ఇరు ప్రాంతాలు ప్రయోజనం పొందేలా సహకారం కొనసాగించాలని భేటీలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఇండోబాక్స్ ఇండియా ఎండీ డైసుకే టాంజీ, షిన్యా సుకాడా, సపల ఆర్గానిక్స్ సీఈవో పైడి ఎల్లారెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి జి.చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో అమల్లోకి యూసీసీ

**అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సీఎం పుష్కర్‌సింగ్ దామి**




న్యూఢిల్లీ : వివాదాస్పదమైన ఏకీకృత పౌర స్మృతి (యూసీసీ) ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం సోమవారం నుంచి అమల్లోకి తీసుకువచ్చింది. యూసీసీ సర్వీసుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఉద్దేశించిన కొత్త వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామిని ప్రారంభించారు. పౌరులందరికీ అందుబాటులో వుండేలా, పారదర్శకతకు హామీ కల్పిస్తూ ఏకీకృత పౌర స్మృతి (యూసీసీ) చట్రపరిధి కింద సర్వీసులు అందుబాటులోకి తీసుకురావడానికి, నమోదు చేసుకోవడానికి ఈ వెబ్‌సైట్ ఉపయోగపడుతుంది. ఎస్‌టీలు, రాష్ట్రం వెలుపలకు వలస వెళ్ళిపోయిన ఈ రాష్ట్ర ప్రజలకు ఈ పౌర స్మృతి అమలు నుండి మినహాయింపు వుంది. దీంతో వివాహం, విడాకులు, వారసత్వం సహజీవనం వంటి అంశాలపై ఉమ్మడి చట్టాన్ని ఆమోదించిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నమోదైంది. ఆధార్ ప్రాతిపదికన వెరిఫికేషన్, కృత్రిమ మేథస్సు (ఏఐ) ప్రాతిపదికన 22 భారతీయ భాషల్లో అనువాద సర్వీసులు పోర్టల్ ద్వారా అందచేయబడతాయి. మరణవాంగ్మూలం లేని వారసత్వం కోసం చట్టబద్ధమైన వారసులను ప్రకటించేందుకు, విల్లు రిజిస్ట్రేషన్‌కు, నిర్ణయాలకు వ్యతిరేకంగా అప్పీళ్ళను ఆమోదించేందుకు, వివిధ డేటా, సమాచారం ఈ పోర్టల్‌లో అందుబాటులో వుంటుంది.

మతం లేదా కమ్యూనిటీతో నిమిత్తం లేకుండా ఉత్తరాఖండ్ ప్రజలందరి కోసం వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాలకు చెందిన పర్సనల్ చట్టాలను ఏకీకృతం చేయడానికి ఉద్దేశించి సమగ్ర చట్టపరమైన చట్రపరిధిని యూసీసీ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

పౌర సంబంధమైన అంశాల్లో సమానత్వం, పారదర్శకతను పెంపొందించేందుకు, పాలనను క్రమబద్ధీకరించేందుకు ఈ నిబంధనలు రూపొందించబడ్డాయని ఉత్తరాఖండ్ ప్రభుత్వం పేర్కొంటోంది. రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ రంజన ప్రకాష్ దేశాయ్ నేతృత్వంలో ఈ నిబంధనల రూపకల్పనకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఆగస్టులో, రెండు ఉప సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీ మొత్తంగా 72సార్లు సమావేశాలు నిర్వహించింది. 2023 చివరిలో ముసాయిదా కోడ్‌ను ఖరారు చేశారు. ఈ ఏడాది జనవరి 20న నిబంధనల మాన్యువల్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.

వివాహాలు, విడాకులు, సహజీవనం, సహజీవనాన్ని తెగతెంపులు చేసుకోవడం వంటి వాటికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో సహా పలు సేవలను ఈ పోర్టల్ అందిస్తుంది. యుసిసిలో చేర్చిన ఈ అంశాల్లో చివరి రెండు అంశాలు అత్యంత వివాదాస్పదంగా వున్నాయి.

ముస్లిం పర్సనల్ లాలో వివాహం, విడాకులకు సంబంధించిన ఆచారాలు, సాంప్రదాయాలైన హలాలా, ఇద్దత్, తలాక్ వంటి వాటిపై పూర్తి నిషేధాన్ని యుసిసి ప్రకటిస్తోంది. ఆస్తులు, వారసత్వం హక్కులకు సంబంధించిన అంశాల్లో మహిళలకు సమాన హక్కులు ఇస్తూ ఇది హామీ కల్పిస్తోందని ప్రభుత్వం పేర్కొంది.

పోలీసులు, న్యాయస్థానాలు, స్థానిక సంస్థలతో సహా మొత్తంగా 13 ప్రభుత్వ విభాగాలకు చెందిన డేటాను ఈ పోర్టల్‌లో సమగ్రంగా అందిస్తారు. అత్యవసర కేసుల్లో తత్కాల్ సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు. ఈ సర్వీసుకు లాంఛనంగా ఫీజు వుంటుంది. యూసీసీ అమల్లోకి వచ్చిన తర్వాత వచ్చే ఆరు మాసాల్లోగా రాష్ట్రంలో జరిగిన వివాహాలను ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సి వుంటుంది. చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జరిగిన వివాహాలను వివాహం జరిగిన 60రోజుల్లోగా నమోదు చేసుకోవాల్సి వుంటుంది.

అలాగే సహ జీవనాలను కూడా నెల రోజుల వ్యవధిలో నమోదు చేయాల్సి వుంది. భాగస్వాముల్లో ఇరువురూ లేదా ఒకరు ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో ఈ సంబంధాన్ని తెగతెంపులు చేసుకోవచ్చు. ఒకవేళ ఒక్క భాగస్వామే దరఖాస్తు చేస్తే రెండో వ్యక్తి నుండి నిర్ధారణ తీసుకున్న తర్వాతనే రిజిస్ట్రార్ ఆమోదిస్తారు. ఒకవేళ ఈ సహజీవనంలో మహిళ గర్భవతి అయితే తప్పనిసరిగా బిడ్డ పుట్టిన 30రోజుల్లోగా ప్రభుత్వానికి తెలియచేయాల్సి వుంటుంది. సహజీవనంలో వుంటూ ప్రభుత్వం వద్ద నమోదు చేసుకున్న జంటకు ఇల్లు అద్దెకు ఇవ్వనని ఏ యజమాని చెప్పరాదని కూడా యూసీసీ పేర్కొంటోంది.

# కరీంనగర్ మేయర్‌పై అవిశ్వాసం

- కలెక్టర్‌కు కలిసి బీఆర్ఎస్ కార్పొరేటర్ల వినతి
- పదవీకాలం మరో 24గంటలే
- చివరి నిమిషంలో బీజేపీలో చేరడంతో భగ్గుమన్న గులాబీదళం
- ఉన్న ఒక్కరోజైనా అవిశ్వాసం పెట్టాలని నిర్ణయం
- ఇదే సమయంలో సోషల్‌మీడియాలో సునిల్‌రావుపై పోస్టులు
- చర్యలు తీసుకోవాలని సీపీకి మేయర్ ఫిర్యాదు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం మంగళవారంతో ముగియనున్న క్రమంలో మేయర్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. రెండ్రోజుల కిందట మేయర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. దాంతో కార్పొరేటర్లు సోమవారం ఉదయం కరీంనగర్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇదే సమయంలో తనపై సోషల్ మీడియాలో అసభ్యరంగా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు మేయర్ సునిల్‌రావు ఫిర్యాదు చేశారు.

బీఆర్ఎస్ పార్టీ తరపున మేయర్‌గా ఐదేండ్లు పదవి అనుభవించి, తీరా చివరి రోజుల్లో బీజేపీలో చేరారంటూ సునిల్‌రావుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుంకు గులాబీ పార్టీకి చెందిన 29 మంది, కాంగ్రెస్‌కు చెందిన మరో ఆరుగురు కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు రాజేందర్‌రావు, మహేష్, గందె మాధవి మీడియాతో మాట్లాడారు. సునీల్‌రావు మేయర్‌గా తన పదవిని ఉపయోగించుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నిధులను దుర్వినియోగం చేశారన్నారు. సునీల్‌రావుపై అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మెజారిటీ కోల్పోయి కూడా పదవిలో కొనసాగడం చట్టానికి విరుద్ధమని, మున్సిపల్ చట్టం ప్రకారం ఆయన్ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అవిశ్వాసం కోసం తయారు చేసిన దరఖాస్తుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు సంతకాలు చేశారు. అయితే, కొంత మంది వెంటనే మేయర్‌కు ఫోన్ ద్వారా తెలిపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో 24గంటల వ్యవధిలో కంప్లీట్ కానున్న పదవీకాలానికి విశ్వాస పరీక్ష పెట్టడం అనేది బీఆర్ఎస్‌లోని కొంత మంది కార్పొరేట్లకు, నాయకులకు కూడా ఇష్టం లేదని ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. అయినప్పటికీ ఈ అంశంపై మేయర్ కూడా వ్యూహాత్మకంగా వ్యవహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంగళవారం పాలవర్గ పదవీకాలం ముగుస్తుండటంతో ఏజెండా రహిత సమావేశం ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోలేదు. ప్రజాప్రతినిధులందరికీ సన్మానం చేసే కార్యక్రమంతో సరిపెట్టాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

### సీపీకి మేయర్ సునిల్‌రావు ఫిర్యాదు

తనపై 56వ డివిజన్ కార్పొరేటర్ రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్, 43వ డివిజన్‌కు చెందిన నవాజ్‌హుస్సేన్ సహా మరికొందరు ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మేయర్ సునిల్‌రావు కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తన ఫొటోలతో కూడిన అసభ్యకరమైన, తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించే ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తూ కామెంట్లు చేస్తున్నారని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించాలి

- రాష్ట్రమంతా కామన్ మెనూ అమలు చేయండి
- మెస్ చార్జీలు పెంచాలి
- ఆహార నాణ్యత, పరిశుభ్రత, సదుపాయాలు కల్పించండి : సీఎస్ శాంతికుమారికి విద్యా కమిషన్ నివేదిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలంగాణ విద్యాకమిషన్ కోరింది. ఇంటర్మీడియెట్ విద్యార్థుల వరకు ఆ పథకాన్ని విస్తరించాలని తెలిపింది. రాష్ట్రమంతా విద్యార్థులకు ఒకే రకమైన కామన్ మెనూను అమలు చేయాలని సూచించింది. పాఠశాలల్లో ఆహార నాణ్యత, పరిసరాల్లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారిని సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో విద్యాకమిషన్ ఛైర్మెన్ ఆకునూరి మురళి, సభ్యులు సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి కలిసి నివేదికను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తోన్న మధ్యాహ్న భోజన పథకంలో పలు కీలక మార్పులు చేయాల్సి ఉందని సూచించారు. ఇటీవల పలు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల విద్యాసంస్థలు, సంక్షేమ హాస్టళ్ల, అంగన్‌వాడీ కేంద్రాలను విద్యా కమిషన్ సందర్శించి పలు అంశాలను పరిశీలించింది. ఫుడ్ పాయిజన్ ఘటనలకు కారణాలపై ఆరా తీసింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను కమిషన్ పరిశీలించి ఓ నివేదికను రూపొందించింది. వారం వారం మధ్యాహ్న పథకానికి బిల్లులను చెల్లించాలనీ, పెండింగ్‌లో ఉంచొద్దని సూచించారు. కట్టెల పొయ్యి మీద వండొద్దనీ, గ్యాస్ సిలిండర్లపైనే వంట చేయాలని కోరారు. వంట చేయడంతోపాటు తాగేందుకూ బోర్ నీళ్లను వాడొద్దనీ, మిషన్ భగీరథ నీటినే వినియోగించాలని తెలిపారు. మెస్ చార్జీలను అన్ని కేటగిరీల వారికీ రూ.రెండు పెంచాలని సూచించారు. అంగన్‌వాడీలు, గురుకులాలు, హాస్టళ్ల, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల, ప్రభుత్వ పాఠశాలలు అన్న వ్యత్యాసం లేకుండా అన్నింటికీ ఒకే తరహాలో మెస్‌చార్జీలను అమలు చేయాలని సిఫారసు చేశారు. గురుకులాల్లోని విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు అవసరమైన కాస్మొటిక్స్, ఇతరత్రా సామగ్రిని తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా మాత్రమే కొనుగోలు చేసి అందించాలని కోరారు. కేంద్రీకృత కొనుగోలు విధానం వల్ల విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించొచ్చని పేర్కొన్నారు.

## సైబర్ నేరాల నివారణపై మార్గాన్వేషణ

- వచ్చేనెల 18,19 తేదీల్లో రాష్ట్రస్థాయి సదస్సు : సీఎస్‌బీ డీజీపీ షికా గోయెల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

సమాజంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల నివారణపై ఒక యుద్ధ స్థాయిలో ప్రతిచర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని రాష్ట్ర సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) డీజీపీ షికా గోయెల్ అన్నారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సైబర్ నేరాల నివారణపై విస్తృతస్థాయిలో చర్చ జరిపి నిపుణులతో మార్గాన్వేషణ చేయటానికి రెండ్రోజులపాటు సదస్సును నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. వచ్చేనెల 18, 19 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే ఈ సదస్సుకు జాతీయస్థాయి మొదలుకొని అంతర్జాతీయస్థాయిలో నిపుణులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. 'షీల్డ్' పేరిట జరిగే ఈ సదస్సులో ఆన్‌లైన్ ఫ్రాడ్స్, డిజిటల్ మోసాలు, క్రిప్టో కరెన్సీ నేరాలు మొదలుకొని సైబర్ నేరాలతో ముడిపడిన పలు అంశాలపై కూలంకశంగా చర్చించటం జరుగుతుందని ఆమె తెలిపారు. ముఖ్యంగా, మహిళలు, బాలికలపై సాగుతున్న సైబర్ మోసాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. రాష్ట్రస్థాయిలోనేగాక జాతీయ, అంతర్జాతీయస్థాయిలలో సైబర్ నేరాలు రోజురోజుకూ కొత్త రూపురేఖలు దాలుస్తూ అమాయక ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ఏదో ఒక చర్య తీసుకోవటం వల్ల ఈ నేరాలు సమసిపోవనీ, వీటిపై ప్రజలందరూ సమిష్టిగా పోరాటం చేయాల్సినవసరం ఉన్నదని ఆమె అన్నారు. ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొనటానికి ఆసక్తి కలిగినవారు తమ విభాగంలో పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై సమాజంలోని ప్రతి ఒక్కరూ అవగాహనను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఎన్ని నేరాలూ వెలుగు చూస్తున్నప్పటికీ.. కొందరు చదువుకున్నవారే ఈ నేరాలకు గురవుతున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించబోయే సదస్సుకు సంబంధించి ప్రత్యేక పోస్టర్‌ను డీజీపీ షికా గోయెల్, అవినాశ్ మహంతిలు ఆవిష్కరించారు.

## గద్దర్‌కు అవార్డు ఎలా ఇస్తాం..?

- బీజేపీ కార్యకర్తలు, పోలీసులను చంపిన వారికి ఇవ్వం : కేంద్ర మంత్రి బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పద్మ అవార్డులు స్థాయి ఉన్న వారికి ఇస్తాం, గద్దర్‌కు అవార్డు ఎలా ఇస్తాం? బీజేపీ కార్యకర్తలను, పోలీసులను చంపిన వారికి అవార్డులు ఇవ్వబోం'అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం పేర్లనే రాష్ట్రాలు పెట్టాలని కేంద్రమంత్రి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తే ఇందిరమ్మ పేరు ఎలా పెడతారని ప్రశ్నించారు. రేషన్ ఇచ్చేది కేంద్రమైతే రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎందుకు పెడుతున్నారన్నారు. పేదల ఇండ్ల కోసం కాకుండా పేర్ల కోసం కాంగ్రెస్ నేతలు పాకులాడుతున్నారని విమర్శించారు. ఇస్తామన్న ఆరు గ్యారంటీలు ఇంకా ఎందుకు అమలు చేయట్లేదని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి సహకరిస్తోందని చెప్పారు. కేంద్రం, రాష్ట్రం కలిస్తేనే అభివృద్ధి అని తెలిపారు.అయితే గద్దర్‌పై కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలు రాజకీయం వేడెక్కింది.

### బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి :టీపీసీసీ అధ్యక్షులు మహేశ్

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బీజేపీ భావజాలమున్న వ్యక్తులకే పద్మ అవార్డులు ఇస్తామంటూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకే అవార్డులు ఇవ్వాలని రాజ్యాంగంలో ఉందా? గతంలో గద్దర్‌ను ఆలింగనం చేసుకున్నప్పుడు భావజాలం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు ఒప్పుకోకపోయినా గద్దర్ పేరు చిరస్మరణీయమని తెలిపారు. వామపక్ష భావజాలం ఉన్న వారు బీజేపీలో లేరా అని నిలదీశారు. నక్సలైట్లు దేశ భక్తులు అన్న ఎన్.టి.ఆర్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోలేదా? అని గుర్తు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు, ఆ పార్టీ మండలాధ్యక్షుల్లో ఎంత మంది బీజేపీ భావజాలమున్న వారున్నారో చెప్పాలన్నారు. బీజేపీ నేతలు సిద్ధాంతాలకు, భావజాలానికి ఎప్పుడో తిలోదకాలిచ్చారని విమర్శించారు. పార్టీకి రాష్ట్ర అధ్యక్షునిగా కొత్త వ్యక్తి వస్తున్నారనీ, తన ప్రాధాన్యత తగ్గుతుందని బండి ఒత్తిడిలో మాట్లాడుతున్నారని చెప్పారు.

### బండి సంజయ్‌ను తరిమికొట్టండి : ఇందిరాశోభన్

గద్దర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని కాంగ్రెస్ నేత ఇందిరాశోభన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోడీ పొగిడిన అమరుడైన గద్దర్‌పై అనుచితంగా మాట్లాడిన బండికి మెదడు, మేధస్సు పని చేయడం లేదని విమర్శించారు. సంజయ్ మాటలు గల్లీ లీడర్ కంటే హీనంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం, తెలంగాణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన అమరుడు గద్దర్ అని చెప్పారు. గద్దర్‌పై సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యావత్ తెలంగాణ బండి సంజయ్ హటావో నినాదాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


**కులం పేరుతో వేధించడం వల్లే : తండ్రి ఫిర్యాదు**

నవతెలంగాణ-హయత్‌నగర్

తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరి మండలం అంబగిరి గ్రామానికి చెందిన ఉడతనూరి సౌమ్య(17) పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ పరిధిలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (బైపీసీ)చదువుతున్నది. వసతి గృహంలో ఆదివారం రాత్రి అందరూ భోజనానికి వెళ్లగా ఆమె తరగతి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత తోటి విద్యార్థినులు గమనించి సిబ్బందికి చెప్పగా వెంటనే బాలికను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆమె చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆమె గతంలో కూడా ఆత్యహత్యాయత్నం చేయగా.. హాస్టల్ నుంచి ప్రిన్సిపాల్ పంపించేశారు. తల్లిదండ్రులు బతిమలాడటంతో మళ్లీ హాస్టల్‌లో చేర్చుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

### కులం పేరుతో వేధింపులు..

తన కూతురిని కులం పేరుతో టీచర్ వేధించడంతోనే ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి శివశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, పెద్ద కూతురైన సౌమ్యను ఇక్కడ హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నామని తెలిపారు. క్లాస్ టీచర్ వేధించడంతో పాటు అందరిలో కాకుండా వేరుగా గదిలో కూర్చోబెట్టేదని తన కూతురు ఫోన్ చేసి చెప్పేదని ఆవేదన వ్యక్తం చేశారు.




### రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సీపీఐ(ఎం)

విద్యార్థిని ఆత్మహత్యకు కారణమైన వారిపై, హాస్టల్ ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు కీసరి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు.



## కుటుంబ అనుబంధాలు మాయమైపోతున్నాయి

శాసన మండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదనాచారి

జర్నలిజం పతనానికి యాజమాన్యాల వైఖరే కారణం : ఎస్. వినయకుమార్

త్యాగరాయ గాన సభలో ఫణి భార్గవ్ జయంతి

జర్నలిస్టులకు, సేవా సంస్థలకు పురస్కారాలు

నవతెలంగాణ-కల్చరల్

నేటి సమాజంలో కుటుంబ ఆప్యాయతలు, అనుబంధాలు మాయమైపోతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నాయకులు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ మరణించిన కుమారుని పేర ప్రతి ఏటా జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారం, విద్యార్థులకు సామాజిక సేవా సంస్థలకు ఆర్థిక సహాయం అందించడం విశేషమని చెప్పారు. హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కళా నిలయం సంస్థ నిర్వహణలో సోమవారం ఫణి భార్గవ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు నవీన్, రాధిక, జ్యోతికి నగదు ప్రతిభా పురస్కారం, విద్యార్థి క్రాంతి, అమృత వర్షిణి సేవా సంస్థకు ఆర్థిక పురస్కారాలను మధుసూదనాచారి, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి అందజేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు వినయకుమార్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. జర్నలిజం రంగంలో విలువలు మానవజాతి కల్తీ అయిన విధంగానే కల్తీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితుల్లో అంకిత భావం, సేవా గుణం ఉన్న ఫణి భార్గవ్‌ను గుర్తు చేసుకుంటూ ప్రతిభ ఉన్న జర్నలిస్టులను గుర్తించి గౌరవించడం మంచి ఆలోచనని అభినందించారు. కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. సమాజంలో అన్ని రంగాలు పతన స్థాయిలో ఉన్నా ఇంకా న్యాయ వ్యవస్థ, పత్రికా రంగంలో విలువలు ఉండటం వల్లే సమాజం సజావుగా నడుస్తోందని చెప్పారు. కొడుకు స్మృతిలో పదేండ్లకుపైగా ఫణి భార్గవ్ జయంతిని ఘనంగా నిర్వహించడం అరుదు అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ కవి డాక్టర్ ఎంకె.రాము మాట్లాడుతూ.. ఫణి భార్గవ్ విద్యార్థిగా సామాజిక చింతనతో పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారని గుర్తు చేశారు. ఆయన జీవితం నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు.

వినయకుమార్ ప్రసంగిస్తూ.. జర్నలిజంలో విలువల పతనానికి కారణం యాజమాన్యాల వైఖరి అని చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. పుచ్చలపల్లి సుందరయ్య సాహిత్యానికి, కళలకు, ప్రజా చైతన్యం మీడియాగా భావించారని, అందుకే సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. గానసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తి ప్రారంభోపన్యాసం చేయగా, నేటి నిజం సంపాదకులు బేస దేవదాసు.. ఫణి గురించి చెప్పారు.

# ఐక్య పోరాటాలకు సిద్ధం

## ప్రజా సమస్యలకే ప్రాధాన్యత

కోటిన్నర మంది కార్మికులకు కనీస వేతనాలు కరువు

2013 భూ సేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పరిహారమివ్వాలి

ఈజీఎస్ పని దినాలు 200కు పెంచాలి

మూసీ ప్రక్షాళన పేర ఇండ్ల తొలగింపు అన్యాయం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, మల్లు లక్ష్మి

కీలకాంశాలపై తీర్మానాల ఆమోదం

పేదలకు స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలివ్వాలి

కనీస మద్దతు ధర చట్టం పట్టని బీజేపీ, కాంగ్రెస్



సంగారెడ్డి నుంచి మేకల కృష్ణయ్య

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల్లో చర్చించి, తీర్మానాలు ఆమోదించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలో ఆమోదించిన పలు తీర్మానాల వివరాలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి సోమవారం (సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణం) మీడియా పాయింట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలోని రైతాంగం, కార్మికులు, పేదలు, నిర్వాసితుల సమస్యలతో పాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించినట్టు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా రైతాంగాన్ని మోసం చేశాయన్నారు. దేశ ప్రజలకు అన్నం పెట్టేందుకు రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానం చేసిందని తెలిపారు. కనీస మద్దతు ధరల చట్టం కోసం రైతాంగం దేశవ్యాప్తంగా సమరశీలంగా పోరాడుతుంటే కేంద్రం నిర్బంధం ప్రయోగిస్తుందన్నారు. ప్రధాని మోడీ ఎన్నికల ముందు కనీస మద్దతు ధర చట్టం తెస్తామని చెప్పి మూడో సారి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని విమర్శించారు. వ్యవసాయోత్పత్తులకు డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ సూచించిన ప్రకారం పెట్టుబడులను నిర్ధారించి దానికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే విధంగా చట్టం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం ఎన్నికల వేళ రైతులు పండించే ఆరు రకాల పంటలకు బోనస్ ఇస్తామని, నాలుగు రకాల పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, అధికారంలోకి రాగానే పట్టించుకోవడంలేదని విమర్శించారు.

రాష్ట్రంలో ఉన్న కోటీ 30 లక్షల మంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ విడుదల చేసిన కనీస వేతనాల జీవోలో రోజుకు రూ.178 కూలి ఇస్తే సంబరపడాలని చెప్పడం సిగ్గుచేటన్నారు. కుటుంబ పోషణకు నెలకు రూ.4628 ఎలా సరిపోతాయని అన్నారు. రాష్ట్రంలో ఏ బీజేపీ నాయకుడైనా సరే ఆ వేతనంతో తమ కుటుంబాన్ని గడుపుకోగలడా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.10 వేల కనీస వేతనం నిర్ణయించారని, ప్రతి ఐదేండ్లకోసారి కనీస వేతనాలను పునర్ నిర్ణయం చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే మూడు పర్యాయాలు పెంచాల్సి ఉన్నా రాష్ట్రంలో కనీస వేతనాలు పెంచడం లేదన్నారు. కనీస వేతనాలను పెంచితే ప్రభుత్వానికి పైసా ఖర్చు ఉండదని, అయినా పెట్టుబడిదారులు, కార్పొరేట్ల లాభాల కోసం కార్మికులకు కనీస వేతనాలు పెంచేందుకు పాలకులు సిద్ధపడటం లేదన్నారు. 73వ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాల ముసాయిదాను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం రూ.11 వేల వేతనం ఇస్తే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు నిర్వహించేందుకు మహాసభలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేయనున్నట్టు తెలిపారు.

### సొంతిల్లు ఆత్మగౌరవ సమస్య: మల్లు లక్ష్మి

సొంతిల్లు అనేది ఆత్మగౌరవ సమస్యగా ఉంటుందని, రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు ఇండ్లులేక ఆర్థిక ఇబ్బందుల్లో కాపురాల్ని నెట్టుకొస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి అన్నారు. రాష్ట్రంలో పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు కూడా ఒకేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. టీఆర్ఎస్ నియంతృత్వ ప్రభుత్వాన్ని కాదనుకొని కాంగ్రెస్‌కు ఓట్లేసిన ప్రజలను ఈ ప్రభుత్వం కూడా మోసం చేస్తుందన్నారు. సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగా సీఎం రేవంత్ రెడ్డి జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా రాష్ట్రంలోని 110 నియోజకవర్గాల్లో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇండ్లు మంజూరు చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు ఎన్నికల ముందు ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మాత్రం రూ.5 లక్షలే ఇస్తామని చెప్పడం మోసం చేయడమే అవుతుందన్నారు.

కేరళలోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు చెల్లిస్తుందన్నారు. ఇంటి నిర్మాణ వ్యయం పెరుగుతున్నందున లబ్ధిదారునికి రూ.15 లక్షల చొప్పున చెల్లించాలని మహాసభ డిమాండ్ చేసిందని తెలిపారు. ఇంటి స్థలాలు లేని పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో ఇండ్లులేని పేదలు లక్షకుపైగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం వారిపై నిర్బంధాన్ని ప్రయోగించి కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసి అప్రజాస్వామికంగా వ్యవహరించడం దుర్మార్గ మన్నారు. ప్రభుత్వం భేషరతుగా పేదలపై పెట్టిన కేసుల్ని వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రంలో 2.5 లక్షల ఇండ్లు మంజూరు చేశామంటూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పార్లమెంటులో ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద పేదలకు ఎన్ని ఇండ్లు ఇచ్చారో చూపించగలరా అని ప్రశ్నించారు. రాబోయే కాలంలో పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేసే వరకు సమరశీలంగా ప్రజా పోరాటాలు నిర్వహిం చాలని మహాసభ ఉద్యమ కర్తవ్యంగా ఎంచు కుందన్నారు. రాష్ట్రంలో ఇంటి స్థలాలు లేని పేదలను గుర్తించి ఖాళీగా ఉన్న బంజరు, ప్రభుత్వ భూములను ఇండ్ల స్థలాల కోసం కేటాయించి, పేదలకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అదే విధంగా జాతీయ ఉపాధి హామీ కింద పని చేస్తున్న గ్రామీణ పేదలకు సంవత్సరానికి 200 పని దినాలు, రోజుకు రూ.600 వేతనం చెల్లించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తూ చట్టాన్ని నిర్వీ ర్యం చేస్తున్నారన్నారు. ఈజీఎస్ పథకాన్ని పట్టణాల్లోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చి వేయడం దారుణ విషయమన్నారు. దశా బ్దాలకు పైగా పేదలు నివాసముంటుంటే ఉన్నట్టుండి బుల్డోజర్లు పెట్టి నేలమట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం కలిసి మూసీ ప్రక్షాళనను కాస్త రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా మార్చే కుట్ర జరుగుతుందన్నారు. భూ నిర్వాసి తులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడింతలు పెంచి నష్టపరి హారం ఇవ్వాలని తెలిపారు. ఈ సమా వేశంలో సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య పాల్గొన్నారు.

# నేడు నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక

పలు అంశాలపై చర్చలు, తీర్మానాలు | దిశా నిర్దేశం చేసిన జాతీయ నేతలు | ముగియనున్న సీపీఐ (ఎం) రాష్ట్ర మహాసభలు

సంగారెడ్డి నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తూ సంగారెడ్డి పట్టణంలో కొనసాగుతున్న సీపీఐ (ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి మూడో రోజుకు చేరుకున్న ఈ మహాసభల్లో పలు ప్రజా సమస్యలు, సామాజికాంశాలపై తీర్మానాలు చేశారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళలు, ఆదివాసీలు, దళితులకు సంబంధించిన పలు అంశాలపై రంగాల వారీగా చర్చలు జరిపారు. రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉద్యమాలు, కర్తవ్యాలపై సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఏ.విజయరాఘవన్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు ప్రజా నాట్య మండలి కళాకారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతినిధులను ఆద్యంతం ఉర్రూతలూగిస్తూనే ఆలోచింపజేశాయి. అమరవీరుల స్థూపానికి నివాళులు, అగ్రనేత సీతారాం ఏచూరి స్మరణతో మహాసభల ప్రాంగణం మొత్తం పోరాట స్ఫూర్తిని నింపింది. దేశానికి, పార్టీకి ఏచూరి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కార్యకర్తలు, నాయకులు ఆయనకు విప్లవ జోహార్లు అర్పించారు. కాగా మహాసభల చివరి రోజైన మంగళవారం సీపీఐ (ఎం) రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకోనుంది. దీంతోపాటు తమిళనాడులోని మధురైలో ఏప్రిల్‌లో నిర్వహించబోయే పార్టీ అఖిల భారత మహాసభలకు ప్రతినిధులను ఎన్నుకోనున్నారు.


## తీర్మానాలు

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి వీడీసీలను నిషేధించాలి : స్కైలాబ్‌బాబు



తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలనీ, వీడీసీలను నిషేధించాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రతినిధుల సభలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని ఉడుత రవీందర్ బలపరిచారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ. .వర్గీకరణ నేపథ్యంలో దళితుల మధ్య వైషమ్యాలు తీవ్రంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల దురంహకార హత్యలు పెరగడం పట్ల తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలంటూ అన్ని రాజకీయ పార్టీలను కోరగా సీపీఐ(ఎం) మాత్రమే తమ మ్యానిఫెస్టోలో చేర్చిందని చెప్పారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులపై మతోన్మాద దాడులు కొనసాగుతున్నాయని వాపోయారు. ఈ క్రమంలో మతోన్మాద శక్తుల దాడులకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాలను బలోపేతం చేయనున్నట్టు తెలిపారు. తద్వారా దళితులందర్నీ ఐక్యం చేసే కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలనీ, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

### మైనార్టీ అభివృద్ధికి నిధులు కేటాయించండి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్‌డీ అబ్బాస్



కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీనిచ్చి నట్టుగా రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి రూ.4 వేల కోట్ల నిధులు కేటాయిం చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎమ్‌డీ.అబ్బాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సీపీఐ(ఎం) నాయకులు నబీ బలపరిచారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. మైనార్టీలకు సబ్‌ప్లాన్ అమలు చేయాలనీ, ఇతర సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### ఆదివాసీల అభివృద్ధి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవి కుమార్



రాష్ట్రంలో ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహాసభలో ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీపీఐ(ఎం) నాయకులు పూనం సచిన్ బలపరిచారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ..తునికాకు సేకరణకు తక్షణం టెండర్లను కోరారు.సాగులో ఉన్న అటవీ భూములకు పోడు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో అమలు కోసం రోడ్‌మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫారెస్టు అధికారులు సాగుభూముల చుట్టూ కందకాలను తవ్వడాన్ని ఆపాలనీ, గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసీలకు ఎస్టీ(కోయ) సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. అడవిలో ఉంటూ 50 శాతానికిపైగా ఆదివాసీలు నివసించే గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. జీవో నెంబర్ 3, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



# వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్షాల సవరణలకు 'నో'

## ఎన్డీఏ ప్రతిపాదనలకు జేపీసీ ఆమోదం

అదో ప్రహసనం..కమిటీ చైర్మెన్ నియంతలా వ్యవహరించారు

విపక్షాల ఆగ్రహం

**న్యూఢిల్లీ :** వక్ఫ్ సవరణ బిల్లును పరిశీలించిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సోమవారం అధికార బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సభ్యులు ప్రతిపాదించిన అన్ని సవరణల్ని ఆమోదించింది. అదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు సూచించిన మార్పులన్నింటినీ తోసిపుచ్చింది. సమావేశం అనంతరం కమిటీ చైర్మెన్ జగదాంబికా పాల్ విలేకరులతో మాట్లాడుతూ ఆమోదించిన సవరణలు చట్టానికి మరింత మెరుగైన, సమర్థవంతమైన రూపాన్ని ఇస్తాయని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు మాత్రం సమావేశం జరిగిన తీరును నిరసించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను చైర్మెన్ పాల్ అపహాస్యం చేశారని విమర్శించారు.


'ఇదో ప్రహసన కసరత్తు. మా గోడును ఎవరూ వినలేదు. పాల్ ఓ నియంతలా వ్యవహరించారు' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణను జగదాంబికా పాల్ తోసిపుచ్చారు. ప్రక్రియ యావత్తూ ప్రజాస్వామ్యబద్ధంగా సాగిందని, మెజారిటీ సభ్యుల అభిప్రాయాన్ని ఆమోదించడం జరిగిందని ఆయన చెప్పుకొచ్చారు. బిల్లులోని 14 క్లాజుల్లో ఎన్డీఏ సభ్యులు సూచించిన సవరణల్ని ఆమోదించామని తెలిపారు. మొత్తం 44 క్లాజుల్లోనూ ప్రతిపక్షాలు సవరణలు ప్రతిపాదించి అడ్డంకులు సృష్టించాయని, అవన్నీ చర్చల అనంతరం ఓటింగ్‌లో తిరస్కరణకు గురయ్యాయని అన్నారు.

**ఇవి సవరణలు ..**

అధికార పక్షానికి చెందిన 16 మంది ఎంపీలు సవరణల్ని సమర్థించగా ప్రతిపక్షానికి చెందిన 10 మంది వ్యతిరేకించారు. ఆమోదం పొందిన సవరణల ప్రకారం....ప్యానల్‌లో ముస్లిమేతర సభ్యుల సంఖ్య పెరుగుతుంది. ఇకపై ప్యానల్ సభ్యుల్లో ఇద్దరు ముస్లిమేతరులు ఉండవచ్చు. అంటే వక్ఫ్ ప్యానల్ సభ్యుల్లో ఇద్దరు హిందువులు లేదా ఇతర మతాలకు చెందిన వారు ఉండవచ్చు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ప్రతిపాదించిన క్లాజ్ 14 ప్రకారం (ఇది కూడా ఆమోదం పొందింది) ఎవరైనా ఐదు సంవత్సరాల పాటు ఇస్లాంను ఆచరించి, అతని ఆస్తికి సంబంధించి ఎలాంటి అవకతవకలు జరిగి ఉండని పక్షంలో మాత్రమే అతను తన ఆస్తిని వక్ఫ్‌కు ఇవ్వవచ్చు. ఇక వక్ఫ్ ట్రిబ్యునల్‌లో ఇద్దరికి బదులు ముగ్గురు సభ్యులు ఉంటారు. మూడో వ్యక్తి ఇస్లాం స్కాలర్ అయి ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం నియమించే ఏ అధికారి అయినా వక్ఫ్ ఆస్తిని పరిశీలించి పర్యవేక్షించవచ్చు. గతంలో ఆస్తిని సర్వే చేసే అధికారం కలెక్టరుకు మాత్రమే ఉండేది. ఆమోదం పొందిన సవరణల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, జిల్లా మెజిస్ట్రేట్లను కొన్ని బాధ్యతల నిర్వహణ కోసం నియమించవచ్చు. ముసాయిదా నివేదికను వక్ఫ్ ప్యానల్ సభ్యులకు మంగళవారం పంపిణీ చేస్తారు. ఐదు వందలకు పైగా పేజీలున్న తుది నివేదికను బుధవారం లాంఛనంగా ఆమోదిస్తారు.

## ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎన్.సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సప్లమెంటరీ బిల్లులైన సంపాదిత సెలవులు, జీపీఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలను వెంటనే ఆర్థికశాఖ ద్వారా క్లియర్ చేయాలని అన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సంబంధించి ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగోన్నతులు కల్పించాలని, జీరో వన్ జీరో వేతనాలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. ప్రీ ప్రైమరీ తరగతులను అంగన్వాడీల్లో కాకుండా ప్రాథమిక పాఠశాలల్లోనే నిర్వహించాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు టైం స్కేల్, వివిధ రకాల సెలవులను వర్తింపజేయాలని అన్నారు. గురుకుల పాఠశాలల్లో పనివేళలను సరిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కె.అరుణ భారతి, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శి బి.ఆడం, వి.రమేష్, సిహెచ్.రమేష్, డి.లాలు, జి.శోభారాణి, సిహెచ్.వీరారెడ్డి, ఆర్.శీను, పి.అభినవ్, పి.కరుణాకర్ రెడ్డి, పి.నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, ఏ.శీనయ్య, కె.సీనయ్య, డి.దయాకర్, కె.రాజన్న, ఎం.వంశీ, ధారభిక్షం, ఆర్.సత్యనారాయణ, కె.ఉదయభాస్కర్, సైదా పాల్గొన్నారు.

# అర్హతలు లేకున్నా అధ్యాపకుల నియామకం

ఫ్యాకల్టీ నాణ్యతపై ప్రభావం

యూజీసీ తాజా నిబంధనలపై విద్యావేత్తల ఆగ్రహం



**న్యూఢిల్లీ :** పీహెచ్‌డీ డిగ్రీ లేకపోయినా, జాతీయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోయినా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కొన్ని పాఠ్యాంశాలను బోధించడానికి అధ్యాపకులను నియమించుకునేందుకు యూజీసీ అనుమతిస్తోంది. టెక్నాలజీ, యోగా, నాటకం, సంగీతం, కళలు, విజువల్ ఆర్ట్స్‌తో పాటు శిల్పం వంటి ఇతర సంప్రదాయ భారతీయ కళా రూపాలకు సంబంధించిన పాఠ్యాంశాలను బోధించే అధ్యాపకులకు పీహెచ్‌డీ, నెట్ వంటి అర్హతలు అవసరం లేదంటూ యూజీసీ తాజాగా ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. వీటిపై ఫిబ్రవరి ఐదవ తేదీ లోగా అభిప్రాయాలు తెలియజేయాలని యూనివర్సిటీ సీనియర్ అధికారులను కోరింది. ముసాయిదా నిబంధనల ప్రకారం అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమిం చాలంటే అభ్యర్థికి పీహెచ్‌డీ డిగ్రీ కానీ లేదా నెట్ పరీక్ష ఉత్తీర్ణత కానీ అవసరం. అయితే కళలకు సంబంధించిన ఫ్యాకల్టీ నియామకానికి ఈ సూత్రం వర్తించదు. అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు ఐదు సంవత్సరాల వృత్తి నైపుణ్యం ఉంటే సరిపోతుంది. రాష్ట్ర లేదా జాతీయ స్థాయిలో వారు వృత్తిపరంగా మంచి విజయాలు సాధించి ఉండాలి. థియరీపై పరిజ్ఞానం అవసరం. ఇంజినీరింగ్, టెక్నాలజీ సబ్జెక్టుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులు కావాలంటే కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ ఉండాలి. దీనితో పాటు ఏఐసీటీఈ నిర్దేశించిన నియామక నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. అయితే పీహెచ్‌డీ డిగ్రీ లేదా నెట్ అర్హత లేకుండా అభ్యర్థులను నియమించడం ఫ్యాకల్టీ నాణ్యతపై ప్రభావం చూపుతుందని గౌహతిలోని కాటన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రమేష్ చంద్ర దేకా అభిప్రాయపడ్డారు. పీహెచ్‌డీ లేని అభ్యర్థుల ఎంపిక కోసం జాతీయ లేదా రాష్ట్ర స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించాలని ఆయన సూచించారు. ఏ సబ్జెక్టును బోధించే వారికైనా జాతీయ స్థాయి నెట్ లేదా రాష్ట్ర స్థాయి స్లెట్ లేదా పీహెచ్‌డీ డిగ్రీ కనీస అర్హతగా ఉండాలని ఆయన చెప్పారు. పేరున్న విదేశీ విశ్వవిద్యాలయాల్లో సీనియర్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు బోధించే వారికి పీహెచ్‌డీ అవసరమేనని జేఎన్‌యూ మాజీ ప్రొఫెసర్ రాజీవ్ కుమార్ తెలిపారు.

నెట్ అర్హత పీహెచ్‌డీ డిగ్రీకి ప్రత్యామ్నాయం కాబోదని, సరైన ఫ్యాకల్టీని నియమించుకోవాలంటే పీహెచ్‌డీ తప్పనిసరి అని ఆయన అన్నారు. కాగా యూజీసీ నిర్ణయాన్ని ఆంధ్ర యూని వర్సిటీ ఆంగ్ల విభాగం అధిపతి ఎస్.ప్రసన్న శ్రీ సమర్థించారు.

2021 నుంచి యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీని నియమించాలంటే పీహెచ్‌డీ డిగ్రీ తప్పనిసరి అని 2018లోనే యూజీసీ ఓ నిబంధన తీసుకొచ్చిందని, అయితే అది ఇప్పుడు అమలు కావడం లేదని హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆర్కే చౌహాన్ గుర్తు చేశారు. 'గతంలో కొన్ని కారణాలతో పీహెచ్‌డీ లేదా నెట్‌ను తప్పనిసరి చేసి ఉండకపోతే దానిని యూజీసీ సమీక్షించాలి. ఆ కారణాలు ఇప్పటికీ వర్తిస్తాయా లేదా అనే విషయాన్ని పరిశీలించాలి' అని ఆయన అన్నారు. ఒకటి రెండు దశాబ్దాల క్రితం కొన్ని సబ్జెక్టుల్ని బోధించడానికి నెట్ అర్హత లేదా పీహెచ్‌డీ డిగ్రీ ఉన్న అభ్యర్థులు తగిన సంఖ్యలో ఉండి ఉండకపోవచ్చునని, అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, కాబట్టి పాత నిబంధనలనే పట్టుకొని వేళ్లాడటం సరికాదని ఆయన చెప్పారు.

సంపాదకీయం

# ఆలస్యంగా మేల్కొన్నా..

కొస్త ఆలస్యంగా మేల్కొన్నా.. సరైన దారిలోనే నేడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి అడుగులు వేయడం హర్షణీయం. ఆ అడుగులు ఈ దిశగా పడితేనే రాష్ట్ర ప్రయోజనాలకు దోహదపడుతాయి. ఏ మాత్రం తప్పటడుగులుగా మారినా రాష్ట్రాల హక్కులకు ప్రమాదం వాటిల్లక మానదు. నిజానికి కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నిబంధనలను గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. వారితో రేవంత్ రెడ్డి ఈపాటికే గొంతు కలిపి ఉంటే ఇంకా బాగుండేది. ఇప్పటికైనా తెలంగాణ సీఎం కేరళ, తమిళనాడు రాష్ట్రాలతో కలిసి ఉద్యమిస్తామనడం ఆహ్వానించ దగ్గ పరిణామం.

విశాల భావాలతో విలసిల్లాల్సిన విశ్వవిద్యాలయాలను కాషాయ రాజకీయ కేంద్రాలుగా మార్చాలన్న కమలనాథుల ఆలోచనల అమలులో భాగమే నేటి యూజీసీ ముసాయిదా. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకంపై గవర్నర్లకు పూర్తి అధికారం కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) జారీచేసిన ముసాయిదా నోటిఫికేషన్ రాష్ట్రాల హక్కులను పాతరేయడమే. సహజంగా యువతలో ఉరకలెత్తే తార్కిక ఆలోచనలకు ఊతమివ్వకుండా నిరర్థక భావోద్వే గాలను వారి బుర్రలోకి జొప్పించే ప్రయత్నాలను అధికారికంగా చేయడమే తాజా నిబంధనల ఉద్దేశ్యం. యూజీసీ నిబంధనల ముసుగులో వర్సిటీలపై అధిపత్యం కోసం కేంద్రం ప్రయత్నిస్తున్నదని మన రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు ముమ్మాటికీ నిజం.




> ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో వ్యాపారమయం చేసి తమ కార్పొరేట్ స్నేహితుల ఆకాంక్షలను నెరవేర్చడానికి కూడా ప్రతిపాదిత మార్పులు ఉపయోగపడతాయి. అందుకే, రాష్ట్ర ప్రభుత్వాలతో, విద్యారంగనిపుణులతో ఏ మాత్రం చర్చించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం, యూజీసీ ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశాయి. ఈ చర్య పూర్తిగా అప్రజాస్వామికం!

ఉన్నత విద్యా వ్యవస్థను కాషాయికరించాలనుకోవడం మోడీ తలంపులో భాగమే. అదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను నామమాత్రం చేయడమే. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమే కాదు.. మన సంస్కృతిపై దాడి కూడా. బహుభాషలు, విభిన్న సంస్కృతులు, విభిన్న ఆకాంక్షల సమాహారం మన దేశం. వాటిపై దాడి జరిగితే దేశం మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఇలాంటి దాడులను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత నేడు అన్ని రాష్ట్రాలపైనా ఉంది.

విశ్వవిద్యాలయాలంటేనే మేధో నిలయాలు! వేనవేల చర్చలకు, భావాల సంఘర్షణలకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రాలు! ఒక్క మాటలో చెప్పాలంటే భవిష్యత్ దేశ నిర్మాణం జరిగేది అక్కడే. అటువంటి చోట కనీసం పీహెచ్‌డీ నెట్ అర్హతలు లేని వారితో సాంకేతికత, నాటకం, సంగీతం, దృశ్య, ప్రదర్శన కళలు, శిల్పం, యోగా వంటి సబ్జెక్టులు బోధించాలని చూడడం ఆందోళనకరం.

సంస్థలకు నాయకత్వం వహించే వ్యక్తి ఆదర్శప్రాయంగా, అందరికీ ఆమోద యోగ్యుడిగా ఉండాలి. కానీ, తాజా మార్గదర్శకాల ప్రకారం ప్రయివేటు రంగానికి చెందిన వారితో పాటు, ఎటువంటి విద్యానుభవమూ లేని వారిని కూడా వైస్ ఛాన్సలర్లుగా నియమించే అవకాశం లేకపోలేదు. ఎందుకంటే ఇదంతా జరిగేది గవర్నర్ కన్నుసన్నల్లోనే! ఇప్పటికే రాష్ట్రాల్లో గవర్నర్లు వ్యవహరిస్తున్న తీరు అనారోగ్యకరంగా ఉన్నది. తాజాగా వీసీల నియామక బాధ్యత కూడా వారికే అప్పగించడమంటే రాష్ట్రప్రభుత్వాలను మరింత ఇబ్బందులకు గురి చేయడమే వారి హిడెన్ ఎజెండాగా ఉంది. విద్యా వ్యవస్థకు ప్రమాదకరంగా ఉన్న ఇలాంటి నిబంధనలను ఫిబ్రవరి 5లోగా వెనక్కి తీసుకోవాలని యూజీసీకి స్పష్టం చేయాల్సిన బాధ్యత విద్యావేత్తలు, అధికారులపై ఉంది.

మతతత్వ, కార్పొరేట్ శక్తుల కలయికగా నరేంద్రమోడీ ప్రభుత్వం ఉందన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అనేక కీలక రంగాలను సంఘ్ పరివారంతోనూ, ఆ భావజాలంతోనూ నింపిన ఘనత కేంద్ర సర్కారుకు ఉంది. ఇప్పుడు ఉన్నత విద్యా రంగాన్ని అటువంటి మౌఢ్యపు ఆలోచనలతో మెదళ్లను నింపుకున్న వారితోనూ, ఆ భావజాలాన్ని ప్రచారం చేసే వారి తోనూ నింపివేయడానికే ఈ కుటిల ఎత్తుగడలకు పాల్పడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. పనిలోపనిగా ఉన్నత విద్యను పూర్తి స్థాయిలో వ్యాపారమయం చేసి తమ కార్పొరేట్ స్నేహితుల ఆకాంక్షలను నెరవేర్చడానికి కూడా ప్రతిపాదిత మార్పులు ఉపయోగపడతాయి. అందుకే, రాష్ట్ర ప్రభుత్వాలతో, విద్యారంగనిపుణులతో ఏ మాత్రం చర్చించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం, యూజీసీ ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశాయి. ఈ చర్య పూర్తిగా అప్రజాస్వామికం!

యూనివర్శిటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థల నిర్వహణ కోసం అవుతున్న ఖర్చులో 80 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తున్నాయి. అయితే, ఈ వాస్తవ పరిస్థితులు, రాజ్యాంగ నిర్దేశాలను కేంద్రంలోని మోడీ సర్కారు నామమాత్రంగా కూడా పట్టించుకోవడం లేదు. అందుకే, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ఈ చర్యపై తీవ్రంగా స్పందించాయి. రెండు రాష్ట్రాలు ఈ ముసాయిదాను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. ఈ దిశగా తెలంగాణ శాసనసభలో కూడా తీర్మానం చేసి సీఎం తన చిత్తశుద్ధిని చాటుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యను కాషాయీకరించడాన్ని, వ్యాపారమయం చేసే ఎత్తుగడలను తిప్పికొట్టడానికి జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి. రాజ్యాంగాన్ని, అది నెలకొల్పిన విలువలను రక్షించుకోవాలి. అప్పుడే దేశాన్ని కాపాడుకోగలిగిన వారమవుతాం.

---

## బ్లర్బ్

యుద్ధ శిథిలాల కడుపుకోత
విషాద గీతాల కన్నీళ్ల
నిప్పుకణిక కళ్లల్లోంచి
ఎగిసి పడుతున్న మంటలకు
దావోస్ సభలు చలికాచుకుంటున్నాయి

కంపెనీలు ప్రాజెక్టులు
అరచేతిలో వైకుంఠాలు
అభివృద్ధి ఉపాధి కల్పనలు

షరతులు అంగీకారాలు
సీ.ఈ.ఓ.లు రాజకీయ ప్రతినిధులు
చేతులు మార్చుకుంటున్న
కాగితం మీద కందిపప్పు
ఒప్పందాల అవగాహన పత్రాలు

రుణమను సువ్వు ఆర్థిక సహాయమను
పేరు ఏదైనా ఒక్కటే
పూల బొకే లాటి
చక్కెరపూత సంభాషణలు



రెప్పలు తెరచి ఉండగానే
సుతారంగా కనుగుడ్లను
ఒడుపుగా మాయం చేసేకాలం

ఉద్రిక్తలు వారే పెంచుతారు
యుద్ధాలు వారే చేయిస్తారు
సహాయ శిబిరాలను నిర్మించి
హెలికాప్టర్ మీంచి గొప్ప ఉదారతతో
నిత్యావసరాలను వారే విసిరేస్తారు

నొప్పి తెలియకుండా
ఎన్ని రకాల సుద్దులు బుద్దులు చెప్పినా
అమాయక శిశువులు స్త్రీలు వృద్ధులు
దాలర్ దాహానికి ఆహుతి అవుతుంటారు

శ్రమవస్తువు వినియోగదారుడు
ప్రతిదీ షోకేస్‌లో
అందంగా ప్రదర్శించి
మార్కెట్ చేయబడుతుంది

నాకు తెలియక అడుగుతా
రాజ్యాలకు రాజ్యాలను నడిపిస్తున్న
కుంపినీల లక్ష్యం ప్రజాసంక్షేమమైతే
దేశదేశాలు లేబర్ అడ్డామీద
పనికోసం వలస కూలీలుగా
ఎందుకు నిలబడుతున్నారు

-జూకంటి జగన్నాథం

---

# ఆర్థిక వృద్ధికి మార్గం ఏది?



ప్రభాత్ పట్నాయక్

ప్రభుత్వం తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడేవారంతా- అటు కన్సల్టెన్సీ సంస్థల మొదలు ఇటు ఆర్థిక వ్యవహారాల మీద రాసే పత్రికల వరకూ - అందరూ ఇప్పుడు ఒకటే పాట అందుకున్నారు. దిగజారిపోతున్న భారతదేశ ఆర్థిక వృద్ధి రేటు మళ్ళీ పుంజుకోవాలంటే దేశీయంగా వినిమయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలంటూ వారంతా ఘోషిస్తున్నారు. ఈ బృందంతో తాజాగా ఇప్పుడు రిజర్వు బ్యాంకు కూడా గొంతు కలిపింది. పారిశ్రామికవేత్తల 'వేటాడే జంతు ప్రవృత్తి'ని మళ్ళీ ప్రేరేపించాలంటే తక్షణమే దేశీయ వినిమయాన్ని పెంచాల్సిందేనంటూ తాజా బులెటిన్‌లో ఆర్‌బీఐ పేర్కొంది.

వాళ్ళందరూ చెప్తున్నట్టు 2024-25లో మన దేశ ఆర్థిక వృద్ధిరేటు ముందు అనుకున్న 7 శాతం బదులు 0.5 శాతం తగ్గి 6.5 శాతంగా ఉండబోతోందన్నదే వాస్తవమైతే ఇంత ఆందోళన పడిపోవడం దేనికి? 6.5 శాతం వృద్ధి రేటు గనుక ఉండేట్టయితే అదేమీ అంత దిగజారిపోవడం కాదు. అర్జెంటుగా 'వేటాడే జంతు ప్రవృత్తి'ని ప్రేరేపించాల్సిన అగత్యమూ లేదు. ఐనా వాళ్ళంతా ఇంత ఆందోళన పడుతున్నారంటే వాళ్ళు చెప్తున్న జీడీపీ లెక్కలన్నీ తప్పుల తడకలన్నమాట. అతి అంచనాలు వేసి మనకు చూపిస్తూ వచ్చారన్నమాట. ఇక ఆర్‌బీఐ మాట్లాడుతున్న 'దేశీయ వినియోగం' అనేది శ్రామిక ప్రజల వినియోగం కాదు. కేవలం పట్టణ మధ్య తరగతి వినియోగం మాత్రమే.

ఒకవేళ శ్రామికవర్గ పేదల వినియోగాన్ని పెంచాలని అనుకుంటే అందరికీ వేతనాల స్థాయిని పెంచితే సరిపోతుంది. చట్ట ప్రకారం చెల్లించవలసిన కనీస వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయిస్తే చాలు. కాని ఎల్ అండ్ టీ ఛైర్మన్ వారానికి 90 గంటలు పని ఉండేలా పెంచాలని డిమాండ్ చేశాడు. తక్కిన ఏ పరిశ్రమాధిపతీ అతనితో విభేదించలేదు. అతను కోరినదే గనుక అమలైతే అప్పుడు మన ఫ్యాక్టరీలన్నీ జర్మన్ నాజీ నిర్బంధ శిబిరాలుగా మారుతాయి. వాటిలోకి వెళ్ళినవాళ్ళు మళ్ళీ తిరిగి రావడం అంటే శవాలుగానే! ఇళ్ళల్లో భార్యల కళ్ళల్లోకి చూసుకుంటూ కాలాన్ని వృధా చేసేకన్నా ఆ సమయాన్ని డ్యూటీలో వెచ్చించడం మంచిదని ఆ ఎల్ అండ్ టీ ఛైర్మన్ వ్యాఖ్యానించాడు! జర్మనీలోని ఆష్విజ్ కాన్సెంట్రేషన్ క్యాంప్ దగ్గర "పని చేయడం ద్వారానే స్వేచ్ఛ పొందుతారు" అన్న బోర్డు ఉండేది. ఇతగాడు చెప్పినది చూస్తే ఆ బోర్డు గుర్తుకొస్తోంది. ఏదేమైనా, యజమానులు పని గంటలు పెంచాలంటున్నారే తప్ప వినిమయ శక్తి పెంచుతాం అని, లేదా వేతనాలను పెంచుతాం అని చెప్పడం లేదు.




మరి పట్టణ మధ్య తరగతి ప్రజల వినిమయ శక్తిని పెంచడానికి ఏం చేయాలని సూచిస్తున్నారు? ఆహార వస్తువుల ధరల పెరుగుదలను నియంత్రించాలని సూచిస్తున్నారు. అలా చేస్తే ఇతర వినిమయ వస్తువుల కొనుగోళ్ళు పెరుగుతాయని అంటున్నారు. ఆహార వస్తువుల ధరల నియంత్రణ చేయవలసిందే. కాని దానివలన పట్టణ మధ్య తరగతి ప్రజల వినియోగం కొత్తగా పెరిగిపోయేది ఎంత? వారి ఆదాయాల్లో ఇప్పుడు ఆహార వస్తువుల కొనుగోలు కోసం ఎంత శాతం ఖర్చు చేస్తున్నారు? శ్రామిక వర్గం అయితే తమ ఆదాయంలో అత్యధిక శాతం ఆహార వస్తువుల కొనుగోలుకే వెచ్చిస్తున్నారు. వాటి ధరలు పెరిగితే వాటి వినియోగం పడిపోతుంది. బడా పరిశ్రమలు ఉత్పత్తి చేసే సరుకుల ప్రధాన వినియోగదారులు పట్టణ మధ్యతరగతి ప్రజలు. ఆహార వస్తువుల ధరలను నియంత్రించినంత మాత్రాన ఆ సరుకుల డిమాండ్ పెరిగేది పెద్దగా ఏమీ ఉండదు.

వాణిజ్యాన్ని పూర్తిగా సరళతరం చేశాక నయా ఉదారవాద వ్యవస్థలో ఆర్థికవృద్ధి వేగం పుంజుకోవాలంటే ఎగుమతులు పెరిగితేనే సాధ్య పడుతుంది. దేశీయంగా తాత్కాలికంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ పుంజుకున్నప్పుడు అది కూడా వృద్ధికి తోడ్పడవచ్చు. కాని అది నిలకడగా ఉండేది కాదు. ఎగుమతుల మార్కెట్ విస్తరిస్తేనే వృద్ధి వేగం పెరుగుతుంది. ఇంతవరకూ ప్రభుత్వం కూడా ఎగుమతులను పెంచడం ద్వారా వృద్ధి జరగాలనే చెప్తూ వస్తోంది. మరి ఇప్పుడు ఉన్నట్టుండి ఆ విషయాన్ని వదలిపెట్టి దేశీయ డిమాండ్‌ను పెంచుకోవాలని ఎందుకంటు న్నారు? నయా ఉదారవాద వ్యవస్థ పరిధి లోపల వాళ్ళు కోరుతున్నట్టు దేశీయ డిమాండ్‌ను పెంచుకోవడం సాధ్యపడేదేనా?

రుణాలను మరింత ఎక్కువ మొత్తంలో అందించడమో, లేక రుణాల మంజూరును మరింత సరళతరం చేయడమో పరిష్కారం కాదు. దాని వలన పట్టణ మధ్య తరగతి కూడా తమ వినియోగాన్ని పెంచుకుంటారని భావించలేము. తాత్కాలికంగా అప్పులు తీసుకుని సరుకులు కొన్నా, ఆ అప్పుల వాయిదాలు కట్టడానికి ఆ వెంటనే ఎక్కువ మొత్తాన్ని ఆదాయం నుంచి కేటాయించాల్సి వస్తుంది. అప్పుడు మళ్ళీ డిమాండ్ పడిపోతుంది. అందుచేత పట్టణ మధ్య తరగతి మరింత ఎక్కువ అప్పు కావాలని కోరుకోరు. ఆహార వస్తువుల ధరలను తగ్గించినా అది కూడా తాత్కాలికంగా వినిమయాన్ని పెంచుతుందే తప్ప వినిమయం నిరంతరాయంగా పెరుగుతూ పోయే పరిస్థితి ఉత్పన్నం కాదు.

వినిమయం పెరిగితే అప్పుడు ఆదాయాలు కూడా పెరుగుతాయి. అలా ఆదాయాలు పెరగడం మళ్ళీ వినిమయం పెరగడానికి దారితీస్తుంది. ఇలా వినిమయమూ, ఆదాయాలు ఒకదాని వెంట మరొకటి పెరుగుతూ పోతాయి కదా అని వాదించవచ్చు. కాని ఏ కారణంగానైనా ఒకానొక కాలంలో వినిమయం పడిపోతే అప్పుడు ఆదాయాలు పడిపోవడం కూడా మొదలౌతుంది. ఈ క్రమాన్ని కూడా ఎవరూ ఆపలేరు. అంటే వినిమయాన్ని పెంచడం ద్వారా సాధించే వృద్ధిని పడిపోకుండా నిలబెట్టాలంటే వెలుపలి నుండి ఒక దన్ను ఉండాలి. ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా వచ్చే అదనపు ధనాన్ని వినియోగదారులకు అందించగలిగితే అప్పుడు వినిమయం పడిపోకుండా నిలబెట్టడం సాధ్యపడుతుంది.

ఇది జరగాలంటే ప్రభుత్వ వ్యయాన్ని ఒక్కసారిగా పెంచాల్సి వుంది. అవసరం అయితే నేరుగా వినియోగదారులకు నగదును కూడా బదిలీ చేయవచ్చు. కాని ప్రభుత్వం అదనపు వ్యయాన్ని చేయాలంటే అందుకోసం అప్పులు చేసైనా ఖర్చు చేయాలి (దాన్నే ద్రవ్య లోటు పెంచడం అని కూడా అంటారు). లేదా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించి అలా సమకూరిన సొమ్మునైనా ఖర్చు చేయాలి. పేదవాళ్ళ మీద పన్నులు విధిస్తే ప్రయోజనం ఉండదు. పేదవారిమీద రూ.100 పన్ను అదనంగా విధిస్తే ఆ మేరకు వారి వినియోగం పడిపోతుంది. ఆ సొమ్మును మళ్ళీ ప్రభుత్వం ఖర్చు చేస్తే మహా అయితే ఆ రూ.100 వరకే పేదలు మళ్ళీ ఖర్చు చేయగలుగుతారు. మొత్తం మీద వినిమయం పెరిగేది ఏమీ ఉండదు.

> ప్రభుత్వ వ్యయాన్ని పెంచి తద్వారా వచ్చే అదనపు ధనాన్ని వినియోగదారులకు అందించగలిగితే అప్పుడు వినిమయం పడిపోకుండా నిలబెట్టడం సాధ్యపడుతుంది. ఇది జరగాలంటే ప్రభుత్వ వ్యయాన్ని ఒక్కసారిగా పెంచాల్సి వుంది. అవసరం అయితే నేరుగా వినియోగదారులకు నగదును కూడా బదిలీ చేయవచ్చు. కాని ప్రభుత్వం అదనపు వ్యయాన్ని చేయాలంటే అందుకోసం అప్పులు చేసైనా ఖర్చు చేయాలి (దాన్నే ద్రవ్య లోటు పెంచడం అని కూడా అంటారు). లేదా సంపన్నుల మీద అదనపు పన్నులు విధించి అలా సమకూరిన సొమ్మునైనా ఖర్చు చేయాలి. పేదవాళ్ళ మీద పన్నులు విధిస్తే ప్రయోజనం ఉండదు. పేదవారిమీద రూ.100 పన్ను అదనంగా విధిస్తే ఆ మేరకు వారి వినియోగం పడిపోతుంది. ఆ సొమ్మును మళ్ళీ ప్రభుత్వం ఖర్చు చేస్తే మహా అయితే ఆ రూ.100 వరకే పేదలు మళ్ళీ ఖర్చు చేయగలుగుతారు. మొత్తం మీద వినిమయం పెరిగేది ఏమీ ఉండదు.

అందుచేత సంపన్నుల మీద అదనపు పన్నులు విధించడమో లేక ద్రవ్యలోటును పెంచడమో ఏదో ఒకటి గాని రెండూ గాని ప్రభుత్వం చేయాలి. కాని నయా ఉదారవాద వ్యవస్థ ఇందుకు అంగీకరించదు. ఎఫ్‌ఆర్‌బిఎం చట్టం ప్రభుత్వ వ్యయం మీద ఒక పరిమితిని విధించింది. ఇక సంపన్నుల మీద అదనపు పన్నుల విధిస్తే వాళ్ళు తమ పెట్టుబడులను ఈ దేశాన్నుంచి ఇతర దేశాలకు తరలించుకుపోతారు. అప్పుడు వృద్ధి రేటు పెరగకపోగా పడిపోతుంది. దేశాన్ని విడిచిపెట్టి క్షణాల మీద బైటకు జారుకునే పెట్టుబడిలో ద్రవ్య పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడి కన్నా ముందే ఉంటుంది. దాని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ మరీ చిక్కుల్లో పడుతుంది.

> దేశాన్ని విడిచిపెట్టి క్షణాల మీద బైటకు జారుకునే పెట్టుబడిలో ద్రవ్య పెట్టుబడి పారిశ్రామిక పెట్టుబడి కన్నా ముందే ఉంటుంది. దాని ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థ మరీ చిక్కుల్లో పడుతుంది.
> వ్యవసాయదారుల ఆదాయాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటే అప్పుడు వారి వినిమయం పెరిగి ఆర్థిక వృద్ధి వేగం పెరుగుతుంది. కాని ఇది జరగాలంటే రైతు-అనుకూల విధానాలు అమలు చేసే ప్రబదచీశీఅవగుత్వం ఉండాలి. కార్పొరేట్ ప్రయోజనాలను, అగ్రి-బిజినెస్‌ను ప్రోత్సహించే ప్రస్తుత ప్రభుత్వ విధానాలు రైతుల ఆదాయాలను పెంచడం లేదు సరికదా మరింత కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం ఈ విధానాలను నయా ఉదారవాదం ఆదేశాల మేరకే చేస్తోంది.

వ్యవసాయదారుల ఆదాయాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటే అప్పుడు వారి వినిమయం పెరిగి ఆర్థిక వృద్ధి వేగం పెరుగుతుంది. కాని ఇది జరగాలంటే రైతు-అనుకూల విధానాలు అమలు చేసే ప్రబదచీశీఅవగుత్వం ఉండాలి. కార్పొరేట్ ప్రయోజనాలను, అగ్రి-బిజినెస్‌ను ప్రోత్సహించే ప్రస్తుత ప్రభుత్వ విధానాలు రైతుల ఆదాయాలను పెంచడం లేదు సరికదా మరింత కుంగదీస్తున్నాయి. ప్రభుత్వం ఈ విధానాలను నయా ఉదారవాదం ఆదేశాల మేరకే చేస్తోంది.

దీనిని బట్టి ఒక విషయం స్పష్టమవుతోంది. ఈ నయా ఉదారవాద విధానాల చట్రానికి లోబడి నడుచుకుంటున్నంత వరకూ ప్రభుత్వం దేశీయ వినిమయాన్ని పెంచడం కాని, తద్వారా వృద్ధి రేటును పెంచడం కాని చేయడం అసాధ్యం. మరి చైనా దేశీయ వినిమయాన్ని పెంచుకుని దాని మీద ప్రధానంగా ఆధారపడి వృద్ధి రేటును కొనసాగిస్తోంది కదా అని అడగవచ్చు. కాని చైనాకు నయా ఉదారవాద చట్రపు ఆంక్షలేవీ వర్తించవు. అక్కడ ప్రభుత్వం తన నిర్ణయాలను ఎవరి ఒత్తిడులూ లేకుండా స్వంతంగా చేస్తున్నది. స్వావలంబన విధానం అమలు చేస్తున్నది. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి దయాదాక్షిణ్యాల మీద ఆ దేశం ఆధారపడి లేదు. పైగా వెలుపలినుండి చైనాకు వచ్చే పెట్టుబడుల ప్రవాహమూ తక్కువే. ఎందుకంటే వాణిజ్యంలో చైనా మిగులులో ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అంటే చైనా పెట్టుబడులే ఇతర దేశాల్లో ఎక్కువ ఉన్నాయన్నమాట.

కాని భారతదేశం పరిస్థితి అలా కాదు. మనం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రవాహం మీద ఆధారపడి వున్నాం. అలా పెట్టుబడులు వస్తూ వుండకపోతే విదేశీ వ్యాపారంలోని లోటును భర్తీ చేయడం సాధ్యం కాదు. అందువలన పెట్టుబడుల ప్రవాహాన్ని అదుపు చేయగల శక్తి లేదు.

కాని రిజర్వు బ్యాంకు, తక్కిన ప్రభుత్వ బాకా రాయుళ్ళు మన ప్రభుత్వానికి సంపూర్ణ స్వావలంబన ఉన్నట్టు మాట్లాడుతున్నారు. వాళ్ళకి నయా ఉదారవాద ఆర్థిక చట్రం ఏ విధంగా పని చేస్తోందో అర్థం అయినట్టు లేదు!

(స్వేచ్ఛానుసరణ)

---

# కుబేర వర్గాల గుప్పిట్లో ట్రంప్ పాలన

డోనాల్డ్ ట్రంప్ ప్రారంభోపన్యాసం, అధ్యక్షుడుగా మొదటి రోజున ఆయన జారీ చేసిన అధికార ఉత్తర్వుల పరంపరను బట్టి చూస్తే ఆయన ఏం చేస్తానని చెప్పాడో అదే చేశాడని అర్థమవుతుంది. మరోసారి అమెరికా గొప్ప దేశంగా చేస్తానని చెప్పిన ప్రకారం ట్రంప్ పనామా కాల్వను స్వాధీనం చేసుకుంటామని బెదిరింపుకు దిగాడు. 1977లో పనామా ఒప్పందం ప్రకారం దానిపై అదుపు పనామాకు అప్పగించబడింది. 'గల్ఫ్ ఆఫ్ మెక్సికో'కు 'గల్ఫ్ ఆఫ్ అమెరికా' అని కొత్తగా నామకరణం చేశాడు. ఇటీవలి చరిత్రలో ఏ అమెరికా అధ్యక్షుడూ చేయని విధంగా తమ భూభాగం విస్తరించుకోవడం కోసం మరిన్ని సామ్రాజ్యవాద విస్తరణ చర్యలు చేపడతానని ప్రకటించారు. మెక్సికోతో దక్షిణ సరిహద్దులో ఎమర్జన్సీ ప్రకటించి వలసదార్లు సరిహద్దు దాటి రాకుండా సైన్యాన్ని మొహరించాలని ఆదేశాలిచ్చారు. పుట్టుకతోనే పౌరసత్వ హక్కును రద్దు లచేయడంతో సహా మరిన్ని వలస నిరోధక చర్యలు కూడా ప్రకటించారు. ఇవన్నీ కూడా జాతి వ్యతిరేకతను పెంచి పచ్చి మితవాద శక్తులకు ఊతమిచ్చేవే.మరో రకం అధ్యక్ష ఉత్తర్వుల ప్రకారం పారిస్ వాతావరణ పరిరక్షణ ఒప్పందం నుంచి అమెరికా ఉపసంహరించు కుంటుంది. దేశంలో అంతర్గతంగానూ పర్యావరణ పరిరక్షణ చర్యల వ్యవస్థ విచ్ఛిన్నమవుతుంది. చమురు కంపెనీల లాబీ ఎలాంటి నిబంధనలు లేకుండా విచక్షణా రహితంగా వ్యవహరించడానికి ఈ స్వేచ్ఛ పొందబోతున్నది.

### స్పష్టమైన సంకేతం

ట్రంప్ మలి దఫా అధ్యక్ష పీఠం అధిష్టించడంలో కొట్టొచ్చినట్టు కనిపించిన అంశం సాంకేతిక కుబేరుల, మహా సంపన్నుల బహిరంగ మద్దతు. ఇది ప్రమాణ స్వీకారంలో గ్రాఫిక్స్‌తో సహా గోచరమైంది. ప్రపంచ ధనాఢ్యులలోనే ప్రథముడైన ఎలన్ మస్క్ ఇంకా ఇతర మహా సంపన్నులు పాలనా యంత్రాంగంలో నిర్వహించిన పాత్రను బట్టి చూస్తే ఇది మహా కుబేర రాజ్యం (ప్లుటోక్రసీ)గా కనిపిస్తుంది. ఫెడరల్ ప్రభుత్వ వ్యవస్థను కుదించడం వల్ల సామాజిక భద్రతా సదుపాయాలు, సామాజిక సంక్షేమ వ్యయం దెబ్బతిని పోతాయనే భయాలు అలుముకున్నాయంటే అందుకు స్పష్టమైన ఆధారాలున్నాయి. బడా వ్యాపారవేత్తలకూ కార్పొరేట్ ప్రయోజనాలకు యథేచ్ఛగా అవకాశమిచ్చే పాలనా వ్యవస్థ ఇది.

### సరికొత్త సామ్రాజ్యవాద పోకడ

అంతర్జాతీయ సంబంధాల విషయంలో ట్రంప్ అధ్యక్ష కాలం బహుళపక్ష వ్యవహారాలను, వాణిజ్య సుంకాలు వాతావరణ మార్పుల రక్షణ చర్యలను విచ్ఛిన్నం చేయడం జరిగినా మౌలికంగా అమెరికా ప్రయోజనాలను కాపాడుకోవడం మాత్రం కొనసాగుతుంది. బైడెన్ ప్రభుత్వం పరిశేష నయా మితవాద విదేశాంగ విధానాన్ని అమలు చేయడంలో అపఖ్యాతి మూటకట్టుకుంది. గాజాలో ఇజ్రాయిల్ మారణయుద్ధానికి నిధులు సమకూర్చింది. ఉక్రెయిన్‌కు నిరాటంకంగా సైనిక, ఆర్థిక సాయం అందించడం ద్వారా రష్యా ఉక్రెయిన్ ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మార్చడానికి కారణమైంది. చైనాతో సంఘర్షణను పెంచడానికి, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కూటములు కట్టడానికి బైడెన్ ప్రభుత్వం పాల్పడింది.ట్రంప్ ప్రభుత్వం పొందికను బట్టి చూస్తే లాటిన్ అమెరికాలో అది మరింత దూకుడుగా వ్యవహ రిస్తుందని అంచనా వేయొచ్చు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)



క్యూబా, వెనిజులాలలో మరింతగా జోక్యాలు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### మోడీ సర్కారు ఆరాటం

అమెరికాకు ఎగుమతయ్యే భారతీయ సరుకులపై సుంకాల విషయంలోనూ ఆంక్షలతో కూడిన వీసాల విషయంలోనూ ట్రంప్ ఎలాంటి చర్యలు తీసుకుంటాడనేది మోడీ ప్రభుత్వం ఆతృతగా ఎదురుచూస్తున్నది. సరైన పత్రాలు లేని వలసదారులను గనక వెనక్కు పంపేయడమనే తన బెదిరింపును ట్రంప్ అమలు చేసేట్టయితే ఇప్పటికే గుర్తించబడిన, కొంత ప్రక్రియ జరిగిన ఇరవై వేల మంది భారతీయులను వెనక్కు పంపేయవచ్చు.మరింత ముఖ్యమైన విషయమేమంటే మోడీ ప్రభుత్వం ట్రంప్ విశ్వసనీయమైన మంచి మిత్రుడని ఎలాగోలా నిరూపించడానికి తాపత్రయ పడుతున్నది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ గత కొద్దివారాల్లో వాషింగ్టన్‌లో రెండుసార్లు మకాం వేశారు. ప్రమాణ స్వీకారానికి హాజరు కావడం కోసం వెళ్లిన ఆయన క్వాడ్ కూటమికి చెందిన ఇతర విదేశాంగ మంత్రులతో పాటు అమెరికా నూతన విదేశాంగ మంత్రిని కలుసుకున్నారు. కానీ ట్రంప్‌తో ఫోటో తీసుకునే అవకాశం మాత్రం ప్రమాణ స్వీకారానికి ముందు జరిగిన విందు సందర్భంలో ముఖేష్, నీతూఅంబానీలకే దక్కింది. ఇప్పుడు వాషింగ్టన్‌లో మంత్రుల కన్నా మహా కుబేరులకే ఆధిక్యత వచ్చింది.మోడీ సర్కారు ట్రంప్ చాంచల్యాలపైన ఆధారపడి అడుగులు తప్పుగా వేయడంగాక మరింత వ్యూహాత్మక స్వాతంత్ర్యం పునరుద్ధరించుకునే విధంగా తీవ్రమైన మందగమనంలో పడిన భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి తగిన విధంగా తన వ్యూహాన్ని పునరుల్లేఖించుకోవాలి.

> అంతర్జాతీయ సంబంధాల విషయంలో ట్రంప్ అధ్యక్ష కాలం బహుళపక్ష వ్యవహారాలను, వాణిజ్య సుంకాలు వాతావరణ మార్పుల రక్షణ చర్యలను విచ్ఛిన్నం చేయడం జరిగినా మౌలికంగా అమెరికా ప్రయోజనాలను కాపాడుకోవడం మాత్రం కొనసాగుతుంది. బైడెన్ ప్రభుత్వం పరిశేష నయా మితవాద విదేశాంగ విధానాన్ని అమలు చేయడంలో అపఖ్యాతి మూట కట్టు కుంది. గాజాలో ఇజ్రాయిల్ మారణయుద్ధానికి నిధులు సమకూర్చింది. ఉక్రెయిన్‌కు నిరాటంకంగా సైనిక, ఆర్థిక సాయం అందిం చడం ద్వారా రష్యా ఉక్రెయిన్ ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మార్చడానికి కారణమైంది. చైనాతో సంఘర్షణను పెంచడానికి, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కూటములు కట్టడానికి బైడెన్ ప్రభుత్వం పాల్పడింది.ట్రంప్ ప్రభుత్వం పొందికను బట్టి చూస్తే లాటిన్ అమెరికాలో అది మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని అంచనా వేయొచ్చు.

(జనవరి 22 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల్లో కుమారుడు పేరు లేదని...

## మనస్తాపంతో తండ్రి మృతి

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని చెబుతూ గ్రామసభల్లో అర్హుల జాబితా ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో ఈనెల 23న గ్రామసభ నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అర్హుల జాబితాను వెల్లడించారు.వెల్లడించిన జాబితాలో అర్హుడైన తమ కుమారుడు పేరు రాలేదని గ్రామానికి చెందిన చాట్ల కృష్ణయ్య (62) తీవ్ర మనస్తాపం చెంది ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణయ్య మృతదేహాన్ని సోమవారం సీపీఐ(ఎం) జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సిద్ధినేని కోటయ్యలు సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిద్ధినేని కోటయ్య మాట్లాడారు. కృష్ణయ్య కుమారుడు రాముకు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు ప్రకటించకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది కృష్ణయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సరైన పద్ధతుల్లో సర్వే చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. కృష్ణయ్య కుమారుడికి ఇల్లుతో పాటు వారి కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నివాళు లర్పించిన వారిలో సీపీఎం నాయకులు మడిపల్లి వెంకన్న, షేక్ రంజాన్ పాషా, మల్లెపోయిన రాజశేఖర్, పగిడిపల్లి ఉపేందర్, వెంకట్రావు, పాము ఉపేందర్, బాబు, కలపాల బద్రీ, అవిరేణి బాబీ, వంగూరి భాను తదితరులు పాల్గొన్నారు.



## లంచం తీసుకుంటూ సత్తుపల్లి మున్సిపల్ వార్డు ఆఫీసర్ పట్టివేత

**నవతెలంగాణ-సత్తుపల్లి**



సత్తుపల్లి మున్సిపల్ 23వ వార్డు ఆఫీసర్ ఒకరు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన వైనం సోమవారం సత్తుపల్లిలో జరిగింది. సత్తుపల్లి మున్సిపల్ పరిధిలో గ్యారంటీ పథకాలు పొందడానికి ఇటీవల ప్రజాపాలన సభలు నిర్వహించిన విషయం విదితమే. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం... సత్తుపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 23వ వార్డుకు సంబంధించిన మహిళ ఒకరు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం ఇటీవల వాళ్ల వార్డులో జరిగిన సభలో వార్డు ఆఫీసర్ నల్లంటి వినోద్‌కు దరఖాస్తు చేసుకుంది. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చూడాలని సదరు మహిళ వినోద్‌ను కోరింది. రూ.3వేలు ముట్టజెబితే రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చేస్తానని మహిళకు తేల్చి చెప్పాడు. అంత ఇచ్చుకోలేనని, రూ.2500 వరకు ఇస్తానని ఆ మహిళ చెప్పడంతో వార్డు ఆఫీసర్ వినోద్ సరేనన్నాడు. రేషన్‌కార్డు, ఇల్లు మంజూరుకు డబ్బులు డిమాండ్ చేసిన వార్డు ఆఫీసర్‌పై ఆ మహిళ ఖమ్మం ఏసీబీ అధికారులకు ఈనెల 24న ఫిర్యాదు చేసింది. దీంతో ఏసీబీ అధికారులు సదరు లంచాధికారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడానికి పథకం రచించి మహిళను సన్నద్ధం చేశారు. సదరు వార్డు ఆఫీసర్ వినోద్ సోమవారం మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి సైతం డుమ్మాకొట్టి డబ్బు తీసుకొని పట్టణంలోని డీసీబీ బ్యాంకు పక్కన ఉన్న భరత్ జ్యూస్ స్టాల్‌కు రమ్మని సదరు మహిళకు ఫోన్ చేశాడు. డబ్బు తీసుకొని జ్యూస్ స్టాల్‌కు వెళ్లిన మహిళ నుంచి రూ.2500 తీసుకొనుచుండగా ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది వార్డు ఆఫీసర్ వినోద్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వాధికారులు ఎవరైనా ప్రజలకు అందించాల్సిన సేవలు గాని, ఇతరత్రా పనులు, ప్రభుత్వ పథకాల మంజూరు విషయంలో డబ్బు డిమాండ్ చేసిన యెడల ఏసీబీ టోల్ ఫ్రీ నెం:1064కు సమాచారం అందించాలని కోరారు. ఈ నెంబరు 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. దీంతో పాటు 9154388981 సెల్ నెంబరును కూడా సంప్రదించవచ్చని ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.



## తుమ్మల చెరువు ఆక్రమణపై ఉద్రిక్తత

- అధికారుల ఉదాసీనతపై రైతులు ఆగ్రహం
- కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని అధికారులు

**నవతెలంగాణ-కొణిజర్ల**

తుమ్మల చెరువు ఆక్రమణపై లాలాపురం గ్రామంలో సోమవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గుండ్రాతిమడుగు రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 419లో తుమ్మలచెరువు ఉంది. ఈ చెరువు ఆయుకట్టు కింద 50 ఎకరాలు భూమిని రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. స్థానిక ఆయుకట్టు రైతులు పంటలు ఎండిపోతున్నాయని, ఆక్రమణలో ఉన్న చెరువుని కాపాడాలని, గత ఐదు సంవత్సరాల నుంచి పలు దఫాలుగా సంబంధిత శాఖ అధికారులకు వినతిపత్రాలు అందించారు. స్థానిక రైతు పాసంగులపాటి కోటేశ్వరరావు అధికారుల అండదండలతో చెరువుని ఆక్రమించుకొని పాస్ బుక్‌లు చేయించుకొని ఈ ఆక్రమించిన చెరువులో కొంతభాగం వరి పంట సాగుచేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. చెరువులు కాపాడాల్సిన అధికారులే ఉదాసీనంగా ఉండటం పట్ల రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఫలించబోతున్న రైతుల పోరాటం**

తుమ్మలచెరువుని కబ్జాదారుడి నుంచి కాపాడాలని రైతులు అధికారుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతూనే ఉంటున్నారు. నిత్యం మూడు శాఖల అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఫలితంగా ఆక్రమణలో చెరువుని ధ్వంసం చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు ఆర్డర్ పాస్ చేయడంతో సోమవారం చెరువు దెగ్గరికి ఎన్ఎస్‌పి, ఫిషరిస్, రెవెన్యూ అధికారులు జెసిబితో చెరువు వద్దకు వచ్చారు. దీంతో ఆక్రమణ చేసిన సదరు వ్యక్తి తన కుటుంబ సభ్యులతో వచ్చి అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకునే అవకాశం ఉందని సమాచారం తెలుసుకున్న సీఐ సాగర్, ఎస్ఐ సూరజ్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి అక్కడ నుండి పంపించి వారి వద్ద పత్రాలు తీసుకొని స్టేషన్‌కి రావాలని సూచించి ఆక్రమణకు గురైన చెరువుని పరిశీలించారు.

## అర్హులందరికీ పథకాలు

**సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి**

**నవతెలంగాణ- తల్లాడ**



అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ కంగారు పడాల్సిన పని లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఆదివారం రాత్రి రెడ్డిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు పథకాల లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు పథకాలు నిరంతర ప్రక్రియ అని, ఎవరైనా అర్హులై ఉండి అందకపోతే అధికారులను సంప్రదించాలని సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**నవతెలంగాణ-ఖమ్మం**

ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఖమ్మం ఎంపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ మేరకు లబ్ధిదారులకు కాంగ్రెస్ జిల్లా నేత కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, కార్పొరేటర్ దొడ్డా నగేష్ చెక్కులను అందజేశారు. ముదిగొండ, బోనకల్, దమ్మపేట, జూలూరుపాడు, పెనుబల్లి, ఖమ్మంఅర్బన్ మండలాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4.10 లక్షల



విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మహిళా వైస్ చైర్మన్ హారికా నాయుడు, నాయకులు మొగిలిచర్ల సైదులు, ఎయిర్ టెల్ నర్సింహారావు, షేక్ సమీరా తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకే ప్రభుత్వ పథకాలు చేరాలి

- రైతులు లాభసాటి ఆయిల్ పామ్ పంట సాగు చేయాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నవతెలంగాణ-ఖమ్మం**

అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు చేరాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ లో పర్యటించి 8 కోట్ల 45 లక్షలతో అల్లీపురం నుండి రామకృష్ణపురం వరకు, అల్లీపురం నుండి జంగాల కాలనీ వరకు, అల్లీపురం ఎన్‌టీఆర్ విగ్రహం నుండి ధంసలాపురం వరకు చేపట్టిన 3 రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలు ఇక్కడ కొంత మంది రైతులు బాగా వేసారని, మిగిలిన రైతులు కూడా ఆయిల్ పామ్‌కు మారాలని, ఎకరానికి 52 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందని,



మిర్చి, పత్తి, వరి పంటల కంటే అధికంగా లాభం వస్తుందని, మూడు సంవత్సరాల వరకు కూరగాయలు, ఇతర అంతర పంటల వల్ల ఆదాయం వస్తుందని అన్నారు. 15వ డివిజన్‌లో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చిన తర్వాత బీటీ రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం మనం చేసే పని 10 కాలాల పాటు ఉండాలని, రోడ్డుపై ర్యాంపులు తొలగించాలని అన్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా మనం కూడా మారాలని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం 40 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని అన్నారు. రైతు భరోసా కింద వ్యవసాయం చేయని భూములకు సహాయం తొలగించాలని అన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టామని, అక్కడ ప్లాస్టిక్ నిషేధమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహారావు, పీఆర్ ఇఇ వెంకటరెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ యుగంధర్‌రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, కార్పొరేటర్లు కరుణ, కమర్తపు మురళి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ బోర్డు నిధులు...
## కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలి

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు

**నవతెలంగాణ-నేలకొండపల్లి**



వెల్ఫేర్ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొద్ది నెలలుగా సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కె.వి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముదాం శ్రీనివాసరావు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డును భవన నిర్మాణ రంగ కార్మికులు ప్రభుత్వంపై కొట్లాడి సాధించుకున్నారన్నారు. కార్మిక కుటుంబాల సంక్షేమం కోసం సెస్సు ద్వారా వచ్చిన నిధులను వెల్ఫేర్ బోర్డు ద్వారా వారి సంక్షేమానికే ఖర్చు చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు, వారి కుటుంబాలకు వృత్తి నైపుణ్య శిక్షణను కార్మిక సంక్షేమ మండలి ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి "కుట్టు" శిక్షణ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగ కార్మికులు డెత్ క్లెయిమ్స్, డెలివరీ, వివాహ గిఫ్టుల కోసం కార్మిక శాఖ యందు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఆయా నిధులను విడుదల చేసి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎన్టీఆర్ ఫౌండేషన్ తరపున భవన నిర్మాణరంగ కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం ఎలక్ట్రికల్ వర్క్స్, పెయింటింగ్, డ్రైవింగ్ తదితర వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కేంద్రాలలో కార్మికులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని తమ కుటుంబ జీవనోపాధికి కావలసిన వృత్తి నైపుణ్యాల్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఇప్పటికే ఫౌండేషన్ తరపున సిపిఎం కార్యాలయంలో నెలనెలా వైద్య శిబిరం, వికలాంగులకు వృత్తి నైపుణ్య శిబిరాలు, యువతి యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజలకి అందిస్తామన్నారు. ఈ సదావకాశాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ సభ్యులు చెరువు నరసింహారావు, దుగ్గి వెంకటేశ్వర్లు, దండా సూర్యనారాయణ, ఎస్కే జమాల్, కొంగర నారాయణరావు, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, షేక్ అబ్దుల్లా, మంకెనపల్లి నరసింహారావు, మహిళాకుట్టు శిక్షణ ట్రైనర్ గుగులోత్ స్వరూప, మల్లికార్జున, నాగమణి, పార్వతి, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



## కుల వివక్ష చూపిస్తే చట్టరీత్యా చర్యలు

- ఖమ్మంరూరల్ తహశీల్దార్ రాంప్రసాద్
- కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-ఖమ్మంరూరల్**

ప్రజలందరూ సమానమేనని, సోదర భావంతో మెలగాలని ఎవరైనా కుల వివక్ష చూపిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఖమ్మంరూరల్ తహశీల్దార్ రాంప్రసాద్ అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) క్యాలెండర్‌ను సోమవారం ఖమ్మం తహశీల్దార్ కార్యాలయంలో రాం ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఇంకా కులం, మతం పేరుతో దళితులు, గిరిజనులు, అట్టడుగు వర్గాలపై వివక్ష చూపిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ మాట్లాడుతూ...ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలనే ధ్యేయంగా 1998, అక్టోబర్ 2న కేవీపీఎస్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ 26 ఏళ్ల కాలంలో కేవీపీఎస్ ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. గత 25 సంవత్సరాల నుండి మహనీయుల ఫోటోలతో క్యాలెండర్ ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు అరేంపుల ఉప్పలయ్య, మండల కార్యదర్శి పగిడిపల్లి వెంకట్రావు, నాయకులు ఏపూరి వరకుమార్, వడ్లమూడి నాగేశ్వరరావు, మిర్యాల సారయ్య, నూకల బాలరాజు, నందిపాటి లక్ష్మయ్య, వెలుతురు రామనాథం, కొర్ని వెంకయ్య, దండగల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## హేతుబద్ధంగా ఆలోచిద్దాం.. రాజ్యాంగబద్ధంగా వ్యవహరిద్దాం

- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు
- ఆదర్శ మహిళలు, యువతకు సన్మానం

**నవతెలంగాణ- బోనకల్**



పిల్లలకు చిన్నప్పటి నుండి హేతుబద్ధంగా ఆలోచించడం రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం నేర్పిస్తే మెరుగైన సమాజం నిర్మించడం సాధ్యమవుతుందని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు అన్నారు. మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలో జీనియస్ 5 మోడల్ టెస్ట్, క్విజ్, ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు రావెళ్ల శివ నాగమణి, పల్లా కొండలరావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రావెళ్ల శివ నాగమణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో దాగి ఉన్న జీనియస్‌లను వెలికితీసేందుకు పల్లెప్రపంచం ఫౌండేషన్ కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. నేత్రదానం సభ్యులు హనుమంత రావు మాట్లాడుతూ చొప్పకట్లపాలెంలో నేత్రదానంను ప్రోత్సహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నేత్రదానం విషయంలో ఈ గ్రామం ఖమ్మం జిల్లాలో ముందంజలో ఉందన్నారు. గ్రామంలో నేత్రదానం, రక్తదానం చేయిస్తున్న వారిని, ఆదర్శ మహిళలు, సేవా దక్పథం కలిగిన యువకులను సన్మానించారు. బోయినపల్లి శ్రీజ అధ్యక్షతన జరిగిన సభలో పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు, లోటస్ హిల్స్ కమిటీ సభ్యులు రావెళ్ళ శివ నాగమణి, ఖమ్మం నేత్రదానం బాధ్యులు హనుమంతరావు, బాల్ బాడ్మింటన్ కోచ్ అమిరేసి లింగయ్యలు ప్రసంగించారు. పిల్లల్లోనూ, సమాజంలో చైతన్యం నింపే కార్యక్రమాలు చేస్తున్న పల్లెప్రపంచం ఫౌండేషన్ సభ్యులను పలువురు వక్తలు అభినందించారు. జీనియస్ 4 మోడల్ టెస్ట్ లో వివిధ గ్రామాల నుండి వచ్చిన పార్టిసిపెంట్స్ పాల్గొన్నారు. విజేతలకు పల్లెప్రపంచం ఫౌండేషన్ సభ్యులతో పాటు, అతిథులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బహుమతులు అందజేశారు. సభలో బాల్ బాడ్మింటన్ టోర్నమెంట్లో నేషనల్ లెవెల్ ప్లేయర్స్‌గా, స్టేట్ లెవల్ ఛాంపియన్స్‌గా రాణిస్తూ చొప్పకట్లపాలెం గ్రామ విద్యార్థులు కోటపర్తి జస్వతి, ఆకాంక్షలను వారి తల్లిదండ్రులు కోటపర్తి నాగేశ్వరరావు, రమాదేవి దంపతులను, కోచ్ అమిరేసి లింగయ్యలను పల్లెప్రపంచం ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు. నేత్రదానం కోసం కృషి చేస్తున్న చలమల అజయ్‌కుమార్, మండెపుడి వెంకటేశ్వరరావు టెక్నీషియన్ మందా నాగేశ్వరరావు, రక్తదానం కోసం కృషి చేస్తున్న బోయినపల్లి పవన్‌కుమార్, వడ్డెబోయిన బాలాజీ, యువత నుండి మెట్టెల నాగరాజు, రచ్చ శివరావు, ఆదర్శ మహిళలు యేశాల సరోజిని, బాలు మనోహరి, కోటపర్తి ఎలిశెమ్మ, తెల్లబోయిన నాగమ్మలతో పాటు జీనియస్ 4లో మానవ సేవే మాధవ సేవ పార్ట్‌లో మొదటి విజేత బోయినపల్లి శ్రీజ, వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాగి ఫౌండేషన్ అధ్యక్షులు మాగి ముక్తేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లెప్రపంచం ఫౌండేషన్ సభ్యులు బోయినపల్లి అంజయ్య, కొండేటి అప్పారావు, రచ్చ మధు, బోయినపల్లి సురేష్, కొండేటి ప్రవీణ్‌లతో పాటు సిపిఎం నాయకులు బూసి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు తెల్లబోయిన రాజశేఖర్, తెలుగుదేశం నాయకులు ఏసుపోగు నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ సైదా హుస్సేన్, గ్రామస్తులు ఏడునూతల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## టీఎస్ యుటీఎఫ్ మండల పాకెట్ క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ - బోనకల్**

టీఎస్ యుటిఎఫ్ బోనకల్ మండల పాకెట్ క్యాలెండరును మధ్యాహ్న భోజన సమయంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు సద్దా బాబు సోమవారం ముష్టికుంట ఉన్నత పాఠశాలల్లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు గార్లపాటి చిన రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి.గోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొనకండ్ల భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు కమలాకర్, సయ్యద్ నవీద్ పాషా, సుజాత, సత్యవతి, సుభాని, సరస్వతి, ఉషశ్రీ పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఆపరేటర్ ఈలప్రోలు శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం

**నవతెలంగాణ-వైరా**



వైరా మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఈలప్రోలు శ్రీనివాసరావును గణ తంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖమ్మంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఉత్తమ కంప్యూటర్ ఆపరేటర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయం నందు మండల పరిషత్ అధికారిని సరస్వతి, ఎంపీఓ జ్యోస్న దేవి, సహచర కంప్యూటర్ ఆపరేటర్లు కట్ల రజిని, ప్రభాకర్‌తో పాటు పలువురు కార్యాలయ సిబ్బంది, సెక్రటరీలు ఈలప్రోలు శ్రీనివాసరావును సన్మానించి అభినందించారు.

# బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లకు సన్మానం

**నవతెలంగాణ-వైరా**



వైరా మున్సిపాలిటీ పాలకవర్గం ముగియడంతో సోమవారం వైరాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లను సన్మానించారు. బిఆర్ఎస్ వైరా పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షతన వాసవి కళ్యాణ మండపంలో బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు ఎదునూరి పద్మజ, మాదినేని సునీత, దారెల్లి పవిత్ర కుమారి, వనమా విశ్వేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, చల్లగుండ్ల నాగేశ్వరరావు, తడికమల్ల నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు నూకల అన్నపూర్ణ, అప్పం సురేష్‌లకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. లగడపాటి లక్ష్మీరాజ్యం తిరుపతి వెళ్ళగా ధనేకుల వేణు పనులపై బయటికి వెళ్లడంతో ఉండటంతో వాళ్ళిద్దరూ హాజరు కాలేకపోయారు. ఈ సన్మాన కార్యక్రమం అనంతరం దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున రావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు సుదీర్ఘంగా ప్రజలకు సేవలు అందించారని, మరోసారి ప్రజలకు సేవలు అందించేందుకు మాజీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు .బిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున నిధులు వచ్చాయని అన్నారు, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైన పాలకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సంవత్సరకాలంలోనే ప్రజా సమస్యలను పరిష్కరించలేక ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్‌ని కెసిఆర్ పాలనను తిడుతు ప్రజలని మోసం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే ప్రజలు తప్పు చేసినట్లు భావించి కేసీఆర్ పాలనే బాగుందని అంటున్న విషయాన్ని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించడం ఖాయం అని చెప్పారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందని, కేసీఆర్ ఇచ్చిన మాటను నెరవేర్చారని అన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయలేక బిఆర్ఎస్ పార్టీపై నిందలు మోపుతున్నారని అన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించారని, ఆ 30 కోట్ల రూపాయల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సక్కుబాయి, కొత్త వెంకటేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, మోటపోతుల సురేష్, మాదినేని ప్రసాద్, దొంతేబోయన వెంకటేశ్వర్లు, షేక్ లాల్ మహమ్మద్, ఏదునూరి శ్రీనివాసరావు, నూకల ప్రసాద్, ఆదూరి ప్రేమ్ కుమార్, గుజ్జర్లపూడి దేవరాజ్, తోటకూర వీరబాబు, వజినేపల్లి చక్రవర్తి, చింతలపూడి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, నూకల వాసు, కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్‌లో జమ

- తొలివిడతలో మండలానికి ఒక గ్రామం
- పైలట్ ప్రాజెక్టు కింద రాజులదేవరపాడు గ్రామం ఎంపిక

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలనలో పేద ప్రజలకు అందిస్తానన్న నాలుగు ప్రజా సంక్షేమ పథకాలను జనవరి 26 తారీకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రారంభించారు. మండల పరిధిలోని రాజులదేవరపాడు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద తీసుకొని నూరు శాతం లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. దీనిలో భాగంగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని తొలి విడతలో మాముసూరు రెవిన్యూ పరిధిలోని రాజులదేవరపాడు, లక్ష్మీపురం, బుచ్చిరెడ్డిపాలెం, నరసింహపురం, మాముసూరు ఐదు గ్రామాలలోని రైతులకు రైతు భరోసా పథకం కింద రైతుల అకౌంట్లోకి డబ్బులు జమ అవుతున్నట్లు రైతులు తెలిపారు. నరసింహాపురం గ్రామానికి చెందిన శీలం వెంకట్రామిరెడ్డి తన అకౌంట్లో డబ్బులు జమ అయినట్లు తెలిపారు.

6
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com

## లయన్స్ క్లబ్‌కు నేత్ర దానం

**నవతెలంగాణ-పెనుబల్లి**

వీఎం బంజర గ్రామానికి చెందిన పరిమి రాఘవకుమార్ సోమవారం అనారోగ్యంతో మరణించారు. కుటుంబ సభ్యులకు లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తపది వీఎం బంజర వారు నేత్రదానం పై అవగాహన కల్పించి వారి నేత్రాలను సేకరించి ఖమ్మం నేత్రనిధికి పంపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్ లయన్ ఎస్‌కే. అబ్దుల్ సలాం, ప్రెసిడెంట్ లయన్ శ్రీధరాల, సుబ్బారావు, క్లబ్ బాధ్యులు లయన్ నాళ్ళ జయరాం, లయన్ పెరుమాళ్ళ రామారావు, లయన్ బజ్జూరి నాగేశ్వరరావు, లయన్ ఎస్.అనంత్, లయన్ సుంకర సత్యనారాయణ, శీలం మాధవరెడ్డి, లయన్ అన్నపరెడ్డి, వెంకటేశ్వరరావు, లయన్ వనమా, సత్యప్రసాద్, మిట్టపల్లి సత్యనారాయణ, మిట్టపల్లి నరేందర్, టెక్నీషియన్ నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు హైవేకు మరమ్మతులు

**నవతెలంగాణ-కల్లూరు**



రాష్ట్ర ప్రధాన రహదారిపై ఊబ్బెత్తుగా ఉన్న రోడ్డుకు ఎట్టకేలకు సోమవారం నుండి రాష్ట్ర హైవే అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఖమ్మం నుండి వస్తున్నప్పుడు కల్లూరు ప్రారంభం నుండి ఎన్నెస్పీ క్రాస్ రోడ్ వరకు రోడ్డు ఇరువైపులా మధ్యభాగంలో తారు ఉబెత్తుగా తేలి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయాలపాలైన మృత్యువాతన పడుతున్నారు. గత సంవత్సర కాలం నుండి ఈ విషయంపై స్థానిక అధికారులు, ప్రజలు ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకుపోతున్నప్పటికీ కాలయాపన చేస్తూ చర్యలు తీసుకోలేదు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో రిటైర్డ్ ఉద్యోగి రాఘవాచారి, ఉబ్బెత్తుగా ఉండటంతో బండి మీద వెళుతూ జారి కింద పడటంతో గాయాలయ్యాయి. 2023 డిసెంబర్ 31న ప్రధాన రహదారిపై బండి మీద వెళుతూ జారి కింద పడి అక్కడికక్కడే ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విధంగా అనేకమైన తరుచూ రోడ్డు ప్రమాదాలు గురవుతూ కుటుంబాలు ఛిద్రమయ్యాయి. అప్పుడున్న ఎస్‌ఐలు, అధికారులు తరచూ వారి దృష్టికి సమస్య తీసుకుపోవటంతో ఎట్టకేలకు నేషనల్ హైవే అధికారులు రోడ్డు మరమ్మతు పనులు మొదలుపెట్టారు. దీంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందినీ ప్రజలు భావిస్తున్నారు.

## 'యూపీఎస్' ఉపసంహరణకు కృషి చేయాలి

**నవతెలంగాణ-బోనకల్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యుపిఎస్ విధానాన్ని ఉపసంహరించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ మండల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్‌కు మండల ప్రత్యేక అధికారి కడారు విజయభాస్కర్‌రెడ్డికి పిఆర్‌టియు ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, తాజాగా కేంద్ర ప్రభుత్వం మరింత ఇబ్బందులకు గురి చేసే పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టడాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని మండలాలలో తహసిల్దార్‌కు వినతి పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా నాయకులు రత్నకుమార్, కొమ్ము శ్రీనివాసరావు, సిహెచ్.రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి మద్దినేని వెంకటేశ్వరరావు, నాయకులు ఝాన్సీ రాణి, రవికిరణ్, రామారావు, రాజేష్, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అండగా ఆశ్రయ సేవా సొసైటీ

**నవతెలంగాణ-బోనకల్**



మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎంగల నవీన్ రోడ్డు నిర్మాణ పనుల సందర్భంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గత వారంక్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన ఆశ్రయ సేవా సొసైటీ వారు మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం, 5 వేల రూపాయల నగదును గోవిందాపురం (ఎల్) గ్రామ పంచాయితీ మల్టీ పర్పస్ వర్కర్ మందా వెంకయ్య ద్వారా సోమవారం లక్ష్మీపురం గ్రామంలో అందించారు. ఈ సందర్భంగా ఆశ్రయ సంస్థ అధ్యక్షుడు ఇరుగు నవీన్ మాట్లడుతూ చిన్న వయసులో నవీన్ మృతి చెందటం చాలా బాధాకరం అన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. వీరి కుటుంబ పరిస్థితి ఆర్థికంగా ఎంతో వెనకబడి ఉన్నారన్నారు. తమ వంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ చిరు సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్లు విజయ రాజు, మర్రి ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు గడ్డిపర్తి వెంకటేష్, ఇరుగు రమేష్, కుక్కల నిఖిల్, పాటిమళ్ళ వంశీ, ఇరుగు కిరణ్, నవీన్, కొరివి వంశి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ తెలిసి ఉండాలి

- ఎంవీఐ వరప్రసాద్

**నవతెలంగాణ-వైరా**





రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వైరా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ ఏ.వరప్రసాద్ తన కార్యాలయ పరిధిలోని వైరా, కొణిజర్ల, తల్లాడ, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలలో విస్తృతంగా పర్యటిస్తూ వాహన చోదకులతో పాటు హై స్కూల్ విద్యార్థులకు కూడా ట్రాఫిక్ రూల్స్, సిగ్నల్స్ పై అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం తల్లాడ మండల పరిధిలోని డాన్ బాస్కో హై స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు తన సిబ్బందితో కలిసి ఎంవిఐ వరప్రసాద్ ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. విద్యార్థులకు కొన్ని ట్రాఫిక్ కోటేషన్లను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ రవిచంద్ర, అశోక్ కుమార్, డాన్ భాస్కో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ఉత్తమ సేవ ప్రశంసా పత్రాలు

**నవతెలంగాణ-కల్లూరు**



మండల పరిధిలోని పలు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉత్తమ సేవలందించినందుకు ప్రశంసా పత్రాలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ముజామిల్ ఖాన్ చేతుల మీదుగా అందుకున్నారు. కల్లూరులోని ఆర్డీఓ రాజేంద్ర, డిటి వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ నాగమణి, బీసీ సంక్షేమ వసతి గృహాధికారి రవీందర్, ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సూపరిండెంట్ శర్మ, సర్కిల్ నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ షమీద్దీన్, గురుకులంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆర్.వరలక్ష్మి, వెంకటరమణలతోపాటు మరో 16 మంది విద్యార్థులు ఉత్తమ విద్యార్థులకు గాను ప్రశంస పత్రాలను అందుకున్నారు. కలెక్టర్‌చే ఉత్తమ సేవ ప్రశంసా పత్రాలను అందుకోవడం పట్ల కల్లూరు మండల ప్రజలు పలు శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



## సయ్యద్ భాషాకి కీర్తి పురస్కార్ గోల్డ్ మెడల్ అవార్డు

**నవతెలంగాణ-ఖమ్మం**

న్యూ లైఫ్ తీ లాజికల్ యూనివర్సిటీ వారు కోవిడ్ సమయంలో చేసిన సేవలకు సంఘంలో చేసిన కార్యక్రమాలకు దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ భాషా కీర్తి పురస్కార్ గోల్డ్ మెడల్ అవార్డు ఇచ్చి సన్మానించారు. సోమవారం హైదరాబాద్లో రవీంద్రభారతిలో అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర నూర్ భాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ షకీనాబీ, ఫరీద్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ది న్యూ లైఫ్ తియాలజికల్ ఆఫ్ యూనివర్సిటీ హైదరాబాద్ వారిచే ఫౌండర్ ఛైర్మెన్ జోసెఫ్ పాలంగి, చీఫ్ గెస్ట్ శామ్యూల్ అర్బాఉర్, జబర్దస్త్ అతిస్ట్ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు హాజరైన మధిర డివిజన్ ప్రతినిధులు

**నవతెలంగాణ-బోనకల్**



సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలో సంగారెడ్డి పట్టణంలో ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగనున్నాయి. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభకు మధిర డివిజన్ నుంచి ప్రతినిధులుగా పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, మడిపల్లి గోపాల్‌రావు, మందా సైదులు, శీలం నరసింహారావు, వాసిరెడ్డి వరప్రసాదరావు, కిలారి సురేష్, మద్దాల ప్రభాకర్, దివ్వెల వీరయ్య, బట్టు పురుషోత్తం, ఎన్నిగండ్ల శ్రీనివాసరావు, నెల్లూరి వీరబాబు తదితరులు హాజరయ్యారు. మధిర డివిజన్ పరిధిలోనే ఎర్రుపాలెం, మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల నుంచి సీపీఐ(ఎం) ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర మహాసభలో ఎంతో ఉత్సాహపూరితంగా జరుగుతున్నాయని వారు తెలిపారు.

# నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ

**నవతెలంగాణ-ఖమ్మం**



నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నులిపురుగుల నివారణ, కుష్టు వ్యాధిగ్రస్తుల చికిత్స అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ఫిబ్రవరి 10 న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో 19 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలందరికి తప్పనిసరిగా మాత్రలు వేయించాలని అధికారులకు సూచించారు. నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటి వల్ల రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునని అన్నారు. జిల్లాలోని 1840 అంగన్వాడి కేంద్రాల్లోని 74 వేల 641 మంది ఒకటి నుండి ఐదు సంవత్సరాల పిల్లలకు, 1618 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలోని, జూనియర్ కళాశాలల్లో గుర్తించిన మొత్తం 2 లక్షల 36 వేల 676 మంది విద్యార్థులు, మొత్తం 3 లక్షల 11 వేల 317 మంది ఒకటి నుండి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేయాలని అన్నారు. జిల్లాలో అవసరమైన మేర నులిపురుగుల నివారణ మాత్రలను అందుబాటులో ఉంచుకున్నామని ,అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. 1339 మంది ఆశావర్కర్లు, 1739 మంది అంగన్వాడి టీచర్లు, 1260 మంది వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 10 నాడు మాత్రలు అందించని విద్యార్థులకు తప్పనిసరిగా ఫిబ్రవరి 17 నాడు అందించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలకు ముందస్తు సమాచారం అందించి పూర్తి స్థాయిలో విద్యార్థులు ఆ రోజు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈనెల 30 నాడు గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలని, మనకు కుష్టు వ్యాధిగ్రస్తులు తగ్గుతున్నప్పటికీ ఇప్పటికీ ఆ వ్యాధి వస్తుందని అన్నారు. ఒంటిపై ఎలాంటి మచ్చలు ఉన్న వైద్యులను సంప్రదించాలనే అవగాహన ప్రజలకు కల్పించే దిశగా ఈ గ్రామ సభలు జరపాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతి బాయి, ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి, అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ. డాక్టర్ వెంకట రమణ, డిఇఓ. సోమశేఖరశర్మ, డిడబ్ల్యూఓ. కె.రాంగోపాల్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే కోరం కనకయ్య

**నవతెలంగాణ-కామేపల్లి**



ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని ఎమ్మెల్యే కోరం కనకయ్య, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు తేటానికి కొంతమంది కంకణం కట్టుకొని పనిచేస్తున్నారని, వారి మాయమాటలను ఎవరు నమ్మవద్దని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ధ్యేయంగా పని చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉందామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నర్సిరెడ్డి, తహసీల్దార్ సిహెచ్.సుధాకర్, ఎంపిడిఓ రవీందర్, ఏవో తారాదేవి, డిసిసి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఫత్తేఅహ్మద్, కామేపల్లి సహకార సొసైటీ చైర్మెన్ పుచ్చకాయల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లకు సన్మానం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు
- మాజీ ఎంపీపీ కట్టా క్రీష్ణార్జునరావు

**నవతెలంగాణ-వైరాటౌన్**



వైరా మున్సిపాలిటీ పాలకవర్గం కాలం ముగిసి పోవడంతో సోమవారం వైరాలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి అధ్యక్షతన వాసవి కళ్యాణ మండపంలో బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు ఎదునూరి పద్మజ, మాదినేని సునీత, దారెల్లి పవిత్ర కుమారి, వనమా విశ్వేశ్వరరావు, మాజీ వైస్ చైర్మెన్ ముళ్ళపాటి సీతారాములు, చల్లగుండ్ల నాగేశ్వరరావు, తడికమల్ల నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు నూకల అన్నపూర్ణ, అప్పం సురేష్‌లకు ఘనంగా సన్మానం నిర్వహించారు. మరో ఇద్దరు కౌన్సిలర్లు లగడపాటి లక్ష్మీరాజ్యం తిరుపతికి వెళ్లడంతో మరో కౌన్సిలర్ ధనికులు వేణు పనులపై బయటికి వెళ్లడంతో వాళ్ళిద్దరూ హాజరు కాలేకపోయారు. అనంతరం దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ కట్ట కృష్టార్జునరావు మాట్లాడుతూ బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు ఐదు సంవత్సరాలు సుదీర్ఘంగా ప్రజలకు సేవలు అందించారని, మరోసారి ప్రజలకు సేవలు అందించేందుకు మాజీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున నిధులు వచ్చాయని, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైన పాలకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్ రావులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని, సంవత్సరకాలంలోనే ప్రజా సమస్యలను పరిష్కరించలేక ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ పాలనను విమర్శిస్తూ ప్రజలని మోసం చేస్తున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించడం ఖాయం అని, ప్రతి కార్యకర్త ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందని, కేసీఆర్ ఇచ్చిన మాటను నెరవేర్చారని, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయలేక బిఆర్ఎస్ పార్టీపై నిందలు మోపుతున్నారని అందులో నిజమేమిటో ప్రజలకు తెలుసు అని అన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి మున్సిపల్ శాఖ మంత్రిగా అప్పట్లో ఉన్న కేటీఆర్ 30 కోట్ల రూపాయల నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సక్కుబాయి, కొత్త వెంకటేశ్వరరావు, డాక్టర్ పెరుమాల కృష్ణమూర్తి, మోటపోతుల సురేష్, మాదినేని ప్రసాద్, దొంతేబోయన వెంకటేశ్వర్లు, షేక్ లాల్ మహమ్మద్, కామినేని శ్రీనివాసరావు, ఏదునూరి శ్రీనివాసరావు, నూకల ప్రసాద్, ఆదూరి ప్రేమ్ కుమార్, వజినేన పల్లి చక్రవర్తి, చింతలపూడి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, నూకల వాసు, నుకల ప్రసాద్, రంగా సత్యనారాయణ, విలాసాగరం నరేష్, మడిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన అధికారిని అభినందించిన సీపీ

**నవతెలంగాణ-ఖమ్మం**



ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ హెూదాలలో భాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం కమాండ్ కంట్రోల్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ (ఏఎస్సై)గా భాధ్యతలు నిర్వహిస్తూ (ఎస్సై) సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పదోన్నతి పొందిన జి.కృష్ణారావును సీపీ సునీల్‌దత్, అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు అభినందించారు. జి.కృష్ణారావు మహబూబాబాద్‌కు బదిలీ పై వెళ్తున్నారు.

## నాగేంద్రమ్మకు నివాళి

**నవతెలంగాణ-తల్లాడ**

మండల పరిధిలోని తెల్లగావరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలారా పాపారావు సతీమణి నాగేంద్రమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు కొమ్మినేని ప్రభాకర్‌రావు, కొమ్మినేని విద్యాసాగర్, ధూమ్ నరసింహారావు, నన్నా లక్ష్మయ్య తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నిరుపేద కుటుంబానికి సరుకులు పంపిణీ

**నవతెలంగాణ-కల్లూరు**

పెరువంచ చైతన్య నగర్ కాలనీకి చెందిన మామిడి పావని భర్త సతీష్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ముగ్గురు పిల్లల బాధ్యత తల్లి పావని మీద పడింది. అతి పేదరికంతో ఉండటానికి ఇల్లు కూడా సరిగా లేదు.. శిథిలమైన పట్టాలతో చుట్టూ కట్టుకొని చలితో కోతులతో ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్ఫూర్తి ఫౌండేషన్ వారు రగ్గులు పంపిణి చేస్తున్నా సమయంలో వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి రామారావు స్ఫూర్తి ఫౌండేషన్ దాతల దృష్టికి తీసుకెళ్ళారు. వారు వెంటనే స్పందించి నెలవారీ సరుకులను అందించటం జరిగింది. ఈ సహాయం చేసిన ఫౌండేషన్ దాతలకు మామిడి పావని కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి వరక రామారావు, స్థానిక నివాసి కువ్వారపు శ్రీనివాసరావు, వాలంటీర్లు ఉబ్బన బాబూరావు, జల్ది రామక్రిష్ణ, మేక రాజేష్ పాల్గొన్నారు.

## ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**నవతెలంగాణ-ఖమ్మం**

విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఒప్పంద అధ్యాపకుల సంఘం ఆర్గనైజేషన్ సభ్యుడు డాక్టర్ పేరెల్లి కోటి డిమాండ్ చేశారు. నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్ట్‌లను భర్తీ చేస్తామని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ దీనివల్ల ఏళ్ల తరపడి వివిధ విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, పార్ట్ టైం, కన్సలెటెడ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి సేవలకు తగిన నిర్ణనయం తీసుకున్న తర్వాత భర్తీ చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సంఘం సభ్యులు, ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ ఎం.శ్యాంబాబు, డాక్టర్ కే.చలపతిరావు, డాక్టర్ రవిబాబు, డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జగ్జీవన్‌రావు, పి. మధు, పి.శ్రీనివాస్, జి రమ పాల్గొన్నారు.



## ఎస్ఎస్‌టీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో సత్తాచాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

**నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్**

డిసెంబర్ 4 నిర్వహించిన ఎస్ఎస్‌టిఎస్‌సి పరీక్షా ఫలితాల్లో ఖమ్మం మమత హాస్పిటల్ రోడ్‌లో శ్రీ చైతన్య పాఠశాల చెందిన విద్యార్థులు సత్తా చాటి తన ప్రతిభ నిరూపించుకున్నారు. పదవ తరగతికి చెందిన పి.పార్థు గ్రాండ్ ప్రైజ్‌గా లాప్టాప్‌ను దక్కించుకోగా, 9వ తరగతి చదువుతున్న జీ.అశ్విత్, ఆరో తరగతి చదువుతున్న పి.అభినవ్ నగదు బహుమతిగా 2000 రూపాయలు పదవ తరగతి చదువుతున్న బి.రాజ్య వర్ధన్ 9వ తరగతి చదువుతున్న యామిని లక్ష్మి 8వ తరగతి చదువుతున్న వి. గోకుల్ శ్రీనాథ్, ఏడవ తరగతి పి.బాలు సాయి శౌరి, హరిహర సాయి, జి.విరుద్ధ నగదు బహుమతిగా వెయ్యి రూపాయలు గెలుచుకున్నారు. వీటితోపాటు 17 మంది విద్యార్థులు ప్రత్యేక బహుమతులు గెలుపొందారు. ఇవి కాక 22 మంది విద్యార్థులు ఆల్ ఇండియా వందలోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మెన్ మల్లంపాటి శ్రీధర్ అభినందిస్తూ తమ పాఠశాలలో పోటీ పరీక్షల్లో గెలుపొందే విధంగా కార్యాచరణ రూపొందించడం దానికి అనుగుణంగా పాఠ్యాంశాలు బోధించడం వలననే ఇటువంటి అద్భుత ఫలితాలు సాధించగలిగామని అన్నారు. డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో అనుసరిస్తున్న పాఠ్య ప్రణాళిక ద్వారానే ఇటువంటి ఫలితాలు రావడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం చేతన్ మాధుర్ కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ ఎల్ఎన్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, ఐపీఎల్ ఇన్చార్జి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు పట్ల హర్షం

**నవతెలంగాణ-ఎర్రుపాలెం**



ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి మాదిగ హక్కులు ఉప కులాల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు లభించడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిళ్ళపాటి బాబురావు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సంబంధాల విభా గంలో పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మందకృష్ణ మాదిగకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అణగారిన వర్గాలకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. భవిష్యత్తులోనూ ఆయన పేద వర్గాల పక్షాన మరింత పట్టుదలతో పని చేయాలని అన్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు

**నవతెలంగాణ-కామేపల్లి**

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య రామ్‌రెడ్డి గోపాల్ రెడ్డి సమక్షంలో మండల పరిధిలోని బర్లగూడెం గ్రామానికి చెందిన 8 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనుకయ్య, రామ్‌రెడ్డి గోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండవ కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.

**IN THE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE (PROB & EXCISE):: AT KHAMMAM**
**O.S.No. 1460/2022**

Between:
Kutumbaka Kodanda Ravi Kumar through his GPA Kutumbaka Vijaya Babu .....*Plaintiff*

And

Nagothu Shouraiah & others .....*Defendants*

To,
1) Nagothu Shouraiah, S/o Ananthaiah, Aged: Adult, Occ: Busienss, R/o Mamillagudem, Khammam town and district (Defendant no.1)
2) Smt. Itham Leela, W/o.Kodanda Rama Rao, Aged Adult, Occ: Household, R/o: Rotary Nagar, Khammam Town & District (Defendant No. 3)
3) Gottemukkala Venkata Narasimha Raju, S/o. Sri Ramachandra Raju, Aged adult, Occ: Business, R/o: H.No.11-4-71, Nehru Nagar, Khammam Town & District (Defendant No. 4)
4) Chekati Ganga Vijaya Lakshmi, W/o: Laxminarayana, Age: 54 years, Occ: Household, R/o H.No. 4-2-753/204, Mamatha Hospital Road, Vardaiah Nagar, Khammam (Defendant No. 10)

Take notice that the above suit stands posted to 11-02-2025 for your appearance. In view of the above you are requested to attend the court personally or through your advocate at 10.30 a.m. on 11-02- 2025 to represent the matter on your behalf else the matter will be decided unilaterally in your absence.

**//BY ORDER OF THE COURT//**
**Sri Swamy Ramesh Kumar**
Advocate, Khammam
Mobile: 9399311713

Khammam, Dt: 27-01-2025

**IN THE COURT OF THE III ADDL. DISTRICT JUDGE AT KHAMMAM**
**E.P. No. 40 OF 2018**
**IN**
**ARB. No. 98 OF 2012**

**Between:**
**M/s Shriram City Union Finance Ltd., KHAMMMAM-II Branch** Rep.by its authorized signatory & GPA holder **K.Srinivasulu, S/o Rangaiah,** Age: 37 years, Occ: Regional Manager, R/o Khammam. ...**Petitioner**

**And**

1) **M/s. Sri Sai Padma Granites** Rep. by its Managing Partner **Salla Padma,** R/o. H.No.6-1-462, C-77/ Phase 1, Opp. SBH, Vanasthalipuram, Hyderabad-500070, 988144465.
2) **Sri Kodide Vankata Rama Krishna, S/o. Agaiah (Late),** R/o. D.No.5-5-37, Kranthi Hills, Vanasthalipuram, Hyderabad-500060.
3) **Sri Kattaguri Ravi, S/o. Esthari (Late),** Age: 49 Years, Occ: Self Employee, Address-I: R/o: H.No.11-3-215/1, Flat No.302, Raj Bharathi Apartments, Road No.7, Venkateshwara Colony, Saroor Nagar, Hyderabad, Address-II: # 239, Vanasthalipuram, Sachivalaya Nagar, Ward-11, L.B. Nagar, Ranga Reddy, 9848840343
4) **Sri Gajam Chandra Sekhar, S/o. Dasarath,** Age: 48 Years, Occ: Self Employee, Address-I: R/o: H.No.S2 C-72, Sachivalaya Nagar, Vanasthalipuram, Hyderabad-500060, Address-II: # S2-C-69, Vanasthalipuram, N.G.O.S Colony, L.B.Nagar, Ranga Reddy.
5) **N.Narasimha Reddy, S/o: Pratap Reddy,** Age: 63, Occ: Retired Govt. Employee R/o: H.No.5-4-454, Saheb Nagar Kalan, Ranga Reddy, O/o: Govt. School, worked as A.S.G.T.Teacher.
6) **P.Yegender Reddy, S/o. Ramanuja Reddy,** Age:62 Years, Occ: Retired Govt Employee, Add-I: R/o: H.No. 3-15-M/11/204, Mansoorabad, Sahara Estates, (3-15-1 Nundi 3-15-416/304) Saroor Nagar, Ranga Reddy, Add-II: # 11-204, Old MLH or Saraha Estate, Mansoorabad, Hyderabad.

సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా...! **శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్,** మధిర బ్రాంచి తనకు రావలసిన దబ్బులు రాబట్టుకొనుటకు ఏఆర్‌బి కేసు **నెం.98/2012** ద్వారా **3) శ్రీ కట్టగూరి రవి, తండ్రి: ఇస్తారి (లేట్), 4) శ్రీ గజం చంద్రశేఖర్** పై డిక్రీ పొంది యున్నారు. సదరు అవార్డు డిగ్రీని అనుసరించి ఈ ఇద్దరు చెల్లించవలసిన రూపాయలు అసలు, వడ్డీ మరియు ఖర్చులు చెల్లించని కారణంగా **ఇ.పి. నం.40/2018** ద్వారా మొత్తం దబ్బులు రాబట్టుకొనుటకై **3) శ్రీ కట్టగూరి రవి, తండ్రి: ఇస్తారి (లేట్), 4) శ్రీ గజం చంద్రశేఖర్** గార్ల స్వాధీనానుభవ యాజమాన్య హక్కు భుక్తములలోని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కోర్టువారు అటాచ్మెంట్ చేసి యున్నారు. మరియు దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని అమ్మవలసినదిగా పై కోర్టు వారిని కోరినందున సదరు కోర్టు వారు ఆజ్ఞానుసారం తేది: **28.02.2025 ఉ॥ గం॥ 10.30 ని॥లకు** కోర్టు వారి ముందు కోర్టు వారి షరతులకు లోబడి బహిరంగ వేలం వేయడం జరుగుతుంది, కావున ఆసక్తి గలవారు పైన తెలిపిన కోర్టు వారు నిర్వహించబడు వేలంలో పాల్గొని దిగువ షెడ్యూలు స్థిరాస్తిని కొనుగోలు చేయవచ్చు. ఈ రోజు వరకు అవార్డు/ డిక్రీ బాపతు అసలు, వడ్డీ మరియు ఖర్చులు మొత్తం కలిపి **శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌**కు రావలసిన బకాయి **రూ. ఇపి అమౌంట్ రూ.99,42,399/-**

**SHEDULE OF THE IMMOVABLE PROPERTIES**

**ITEM NO. I:** (As per register document No.5224/10, dt.30.07.2010 in favour of **Kattaguri. Ravi, S/o. Isthari** and Gajam Chandrasekhar, S/o. Dasaradhi) Khammam District, Khammam joint Sub-District, Khammam revenue district, Khammam Urban Mandal, Khammam Town Municipal Area, Bhuranapuram Revenue Village accounts, Sy.No. 255, 256, 257, Plot No.3 and 4 part an extent of 2000 Sq.Yards or 1672.20 Sq.Mts. **bounded on the: East:** 30 ft. Wide Road (Gollapadu Panta Kalva), **West:** Plot No.4 part, **North:** Land of Atluri Tirumala Rao, **South:** Plot No.5, and 2 of Gajam Chandrasekhar.

**ITEM NO.II:** (As per register document No. 5216/10, dt.28.07.2010 in favour of **Gajam. Chandrashekar, S/o. Dasaradhi)** Khammam District, Khammam joint Sub-District, Khammam revenue district, Khammam Urban Mandal, Khammam Town Municipal Area, Bhuranapuram Revenue Village accounts, Sy.No. 255, 256, 257 and 258, Plot No.5 an extent of 2000sq. Yards or 1672.20 Sq.Mts (Plot Size 122.3 ft.x147ft.,) **bounded on the: East:** Plot No.2 sold to Gajam Chandrasekhar. **West:** Site retained by vendor Salla Padma. **North:** Plot No.4, **South:** Plot No.6.

**ITEM NO. III :** (As per register document No.5215/10, dt.13.07.2010 in favour of **Kattaguri Ravi S/o. Isthari)** Khammam District, Khammam Joint Sub-District, Khammam revenue district, Khammam Urban Mandal, Khammam Town Municipal Area, Bhuranapuram Revenue Village accounts, Sy.No.255, 256, 257 and 258, Plot No.6 an extent of 2000sq. Yards or 1672.20 Sq.Mts (Plot Size 122.3 ft.x147ft.,) **bounded on the: East:** Plot No.1 sold to Kattaguri Ravi, **West:** Site retained by vendor Salla Padma, **North:** Plot No.5, **South:** Land of Godavarthy Krishna Murthy.

**Sd/- G.Harendar Reddy**
**Advocate, Khammam**

7

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

# భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com


## తెలంగాణ జట్టు కెప్టెన్‌గా వైష్ణవి రత్న



**నవతెలంగాణ-పినపాక**

జాతీయ స్థాయి అండర్-17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు మండలంలోని గడ్డంపల్లి గ్రామానికి చెందిన చెందిన పోలెబోయిన వైష్ణవి రత్న ఎంపికైంది. వైష్ణవి రత్న పినపాక జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతూ హైదరాబాదులోని నెక్స్ జెన్ క్రికెట్ అకాడమీ శిక్షణ పొందుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా కెప్టెన్‌గా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జట్టును ప్రథమ స్థానం రావడం ద్వారా తెలంగాణ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైనట్టు ఖమ్మం జిల్లాస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరసింహమూర్తి తెలిపారు. జూనియర్ కళాశాల అధ్యాపకులు, మండల వాసులు అభినందనలు తెలిపారు. వైష్ణవి రత్న తండ్రి పోలెబోయిన అనిల్ కుమార్ పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించండి



**నవతెలంగాణ-మణుగూరు**

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని, గడచిన పదేళ్లలో బీఆర్ఎస్ నాయకులు ఏం చేశారని ప్రజలు గల్లా పట్టుకుని అడగాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సూరపరెడ్డి తరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలను అమలు చేయడం చాలా సంతోషకరం అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కార్యదర్శి లక్ష్మీ ప్రగతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్, ధారా అశోక్ ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్, చైతన్య నాయుడు, లిఖిత్, లతీఫ్, ప్రవళిక, గొల్లపల్లి నరేష్ కుమార్, కరుణ్ రెడ్డి, అజిత్ పాల్గొన్నారు.

## మణుగూరు రికార్డు అసిస్టెంట్‌కు ఉత్తమ అవార్డు

- కలెక్టర్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్న గంటా



**నవతెలంగాణ-మణుగూరు**

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ పనిచేస్తున్న అన్నారం గ్రామానికి చెందిన గంటా వెంకటేశ్వర్లు విధి నిర్వహణలో ప్రజలకు రైతులకు అందించిన సేవలకు గాను ఉత్తమ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదగా ఆయన ఉత్తమ అవార్డు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వరదల సమయంలో సేవలకు గాను ఆయన తండ్రికి కూడా అవార్డు అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు.

## ఐటీడీఏ పీవోకి ప్రశంసలు

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో నిర్మించి ఉన్న ఆదివాసీ మ్యూజియంలో సరికొత్తగా ఆదివాసీల జీవనశైలి ప్రతిబించేలా ఆదివాసీ గృహాలు నిర్మించి వారు నిత్యం తీసుకునే ఆహారాల ప్రదర్శన కోసం స్టాల్స్, పార్క్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆదివాసీ మ్యూజియాన్ని సరికొత్త హంగులతో తీర్చిదిద్దుతూ, గృహాలను నిర్మించి ఆదివాసీ వంటకాల కోసం స్టాల్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ప్రాజెక్టు అధికారిని కొనియాడారు. ఈ సందర్భంగా వారు ప్రాజెక్ట్ అధికారిని కలిసి ఆదివాసీల ఆచార వ్యవహారాలకి సంబంధించి చర్చించి మ్యూజియంలో మార్పులు చేర్పులపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆదివాసీ సమితి అధ్యక్షులు పూనేం కృష్ణ దొర, ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ పాయం రవివర్మ, కొండ రెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు ముర్ల రమేష్ దొర, ఏఈడబ్ల్యూసీపీ రాష్ట్ర నాయకులు కొండ్రు వీరస్వామి, ఆదివాసీ నాయకులు సోందే రవికుమార్, కనితి రాధ, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ప్రింటర్ వితరణ

**నవతెలంగాణ-పినపాక**

తాము చదువుకున్న పాఠశాలకు 1998-99 పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు కంప్యూటర్ ప్రింటర్ వితరణ చేశారు. వివరాల్లోకి వెళితే సోమవారం మండల పరిధిలో గల ఈ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఎంతఓట నాగయ్య చేతుల మీదుగా కంప్యూటర్ ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంతఓట నాగయ్య మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదివిన పాఠశాలను గుర్తుం చుకొని పాఠశాలకు అవసరమైన అవసరాలు తీర్చడం అభినందనీయ విషయం అన్నారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాల్లో ముందు ఉండడాన్ని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## చేయూత ట్రస్టు సేవలు అభినందనీయం

- మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలి
- తహశీల్దార్ ముజాహిద్



**నవతెలంగాణ-బూర్గంపాడు**

ఆపదలో ఉన్న నిరుపేదలకు సహాయం చేస్తే భగవంతుడికి సహాయం చేసినట్లేనని, మానవ సేవే మాధవసేవ అని తహశీల్దార్ ముజాహిద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోరంపల్లి బంజరు గ్రామం రైతు వేదికలో చేయూత ట్రస్ట్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన పాల్గొన్నారు. ముందుగా చేయూత ట్రస్టు సభ్యులందరికీ ట్రస్ట్ ఐడీ కార్డ్స్‌ను ఆవిష్కరించి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి వ్యక్తి స్వార్థంతో జీవిస్తున్నారని ఆయన అన్నారు. అలాంటి సమాజంలో ఎవరి జీవితం వారిదేనని బిజీ బిజీగా ఉండే సమయంలో కూడా నిరుపేదలను ఆదుకోవాలని ఆయన అన్నారు. చేయూత ట్రస్టు కేవలం బంజర గ్రామమే కాకుండా మండలం ఇతర మం డలాల్లో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ట్రస్టు సభ్యులందరికీ ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడం లక్ష్మీనారా యణ రెడ్డి, సారెడ్డి దామోదర్ రెడ్డి, అలవాల సీతారా మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని, వ్యవసాయక సహాయ అధికారి నాగ వైష్ణవి, ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు కే.వెంకటేశ్వర్లు, ట్రస్ట్ చైర్మెన్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, వైస్ చైర్మెన్ నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.మల్లారెడ్డి, కోశాధికారి పుట్టి రాజేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తాం

- వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్



**నవతెలంగాణ-కొత్తగూడెం**

తెలంగాణ రాష్ట్రంలో ఇండ్ల స్థలాలు, పోడు భూమి పోరాటాలు ఉధృతం చేస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలందరికీ ఇంటి స్థలం ఇస్తామని, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ నేటికీ హామీలు అమలుకు నోచు కోలేదన్నారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటి స్థలం పట్టాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సింగరేణి, నిమ్జ్, వివిధ రకాల పరిశ్రమలు, ప్రాజెక్టుల్లో సాగు భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం ఉద్యోగాలు ఇవ్వాలని, భూమి విలువ బహిరంగ మార్కెట్లో ఉన్న విధంగా పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కరెంట్, సాగునీటి బోర్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 'పది'లో ఉత్తమ విద్యార్థినికి పూర్వ విద్యార్థులచే నగదు బహుమతి



**నవతెలంగాణ-బూర్గంపాడు**

మండలంలోని సారపాకలో ఎన్నో సంవత్సరాలుగా నాణ్యమైన విద్యను అందిస్తూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్న ప్రగతి స్కూల్లో 2023-2024 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థిని సింధు తెలంగాణ వ్యాప్తంగా రెండవ ర్యాంకు, ప్రగతి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 2001-02 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు పదివేల 116 నగదు బహుమతితో ప్రోత్సహించారు. ప్రగతి స్కూల్ చైర్మెన్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి చేతుల మీదుగా ఈ బహుమతిని అందజేశారు. అదేవిధంగా గత రెండు సంవత్సరాలుగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని స్కూల్ యాజమాన్యం పేర్కొంది. పూర్వ విద్యార్థులు ఈ సందర్భంగా మాట్లాడుతూ 2001-2002 పదవ తరగతి చదివినటువంటి మిత్రులందరూ ఎంత గానో సపోర్ట్‌గా నిలుస్తున్నారని అదేవిధంగా ఇకముందు కూడా తమ వంతు బాధ్యతగా మంచి విద్యను కనపర్చిన వారికి స్కాలర్‌షిప్ రూపంలో నగదు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి స్కూల్ చైర్మెన్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల టీం కెప్టెన్ శ్రీనివాస్ రెడ్డి, అక్బర్, శ్రీని వాసరావు, రాజా, ప్రస్తుత విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ప్రణాళిక బద్ధమైన కృషికి శ్రీకారం చుడతాం

- రాష్ట్ర ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించేలా ఉద్యమాలు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

**నవతెలంగాణ-కొత్తగూడెం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక పాత్ర పోషించేలా ప్రణాళిక బద్ధమైన పనిని చేస్తామని తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలో చర్చల సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. పార్టీ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డి జిల్లాలో జనవరి 25 నుండి 28 వరకు జరుగుతున్నాయి. రాష్ట్ర మహాసభల సందర్భంగా కార్యదర్శి నివేదికపై జరిగిన చర్చల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధులు విస్తృతమైన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మచ్చా మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపైన చేసిన కృషి, క్షేత్ర స్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం జరిగిన కృషి, వచ్చిన అనుభవాలపై చర్చలు జరిపామని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని, సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ప్రజలను సంసిద్ధులను చేసి మిలిటెంట్ పోరాటాలను నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు. ఒకవైపు ప్రజా పోరాటాలు చేస్తూనే, మరోవైపు మతోన్మాద శక్తుల పట్ల వ్యతిరేకంగా ఉద్యమించాలని చర్చించడం జరిగిందన్నారు. జిల్లాలో జరిగిన కృషి, అనుభవాలను, జరగబోయే పోరాటాలు వివరాలతో కూడిన రిపోర్టుని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజులు ప్రవేశపెట్టారు. ఈ సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజె.రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు 36 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహా సభలకు పార్టీ అగ్ర నేతలు పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్, విజయ రాఘవన్, బీవీ.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, హేమలత, అరుణ్ కుమార్, మమత తదితరులు హాజరయ్యారని, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారని మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఏది సాధించాలన్నా లక్ష్యం కనిపించాలి

- సెమినార్‌లో సీనియర్ ఐఏఎస్ అంగలకుర్తి విద్యాసాగర్
- సింగరేణి సీఅండ్ ఎండి ఎన్.బలరామ్



**నవతెలంగాణ-కొత్తగూడెం**

మనం ఏది సాధించాలన్నా మన ముందు లక్ష్యం కనిపించాలని, చేరుకున్న లక్ష్యం తర్వాత ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం ఉండాలి, వారిని ప్రేమించాలని సీనియర్ ఐఏఎస్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి విద్యాసాగర్ అన్నారు. సోమవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట శివశంకర్ అధ్యక్షతన జరిగింది. కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలుత డాక్టర్ బీఆర్.అంబేద్కర్, జ్యోతిరావు, సావిత్రిబాయి పూలే చిత్ర పటాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. "విద్యార్థులు...ఉన్నత భవిష్యత్తు" అనే సెమినార్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అంగలకుర్తి విద్యాసాగర్, సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం సుమారు రూ.2000 మంది విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత భావిభారత నిర్మాతలని, మన లక్ష్యాన్ని నిర్ణయించుకొని ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులకు ఎటువంటి కష్టనష్టాలు వచ్చినా తల్లిదండ్రులతో స్నేహితులతో తమ సమస్యలను పంచుకోవాలని, ఎలాంటి ఆగాయిత్యాలకు పాల్పడకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ న్యూరో వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్, జిల్లా అధ్యక్షులు జంగా శ్యామ్ చందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రాజేష్, యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణ, జీవన్, కుసుమ, నవీన్ కుమార్, పట్టణ నాయకులు అబ్దుల్ రహమాన్, మహిళ నాయకురాలు దుర్గ భవాని, స్వరూప రాణి, వివేక వర్ధిని, ప్రియదర్శిని, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.



## అయ్యప్ప హోటల్‌లో దొంగతనం

- రూ.70 వేలు అపహరణ
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



బాధితురాలు పద్మ

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**

అయ్యప్ప అనే హెూటల్‌లో దొంగలు పడి రూ.70 వేల నగదును దొంగిలించిన ఘటన సోమవారం ఆళ్ళపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి టేకులపల్లి మండల కేంద్రం నుండి బతుకు తెరువు కోసం సుమారు 5 సంవత్సరాల క్రితం నూనావత్ మోతిలాల్, పద్మ అనే దంపతులు వచ్చి, మెయిన్ రోడ్ హెూటల్ పెట్టుకుని, నడుపుకుంటూ జీవించడానికి వచ్చారు. ఈ నేపథ్యంలో 'అయ్యప్ప' అని హెూటల్‌కి నామకరణం చేసి నడుపుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీన టేకులపల్లిలో చిట్టి వ్యాపారి దగ్గర చిట్టి పాట పాడి రూ.1 లక్షా 30 వేలు ఆళ్ళపల్లిలోని వారి ఇంటికి తీసుకొచ్చి, ఇంట్లో బీరువాలో దాచారు. అవసర నిమిత్తం అందులో రూ.30 వేలు ఖర్చు చేసి, మిగతా డబ్బులు ఇంట్లోనే ఉంచి, సంక్రాంతి పండుగ సందర్భంగా సమీప బంధువుల ఫంక్షన్ వేరే గ్రామంలో ఉండటంతో ఈ నెల 14వ తేదీన దంపతులు ఇరువురు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఆరోజు అక్కడే గడిపి, మరునాడు సాయంత్రం ఆళ్ళపల్లికి వచ్చారు. అవసరం నిమిత్తం ఈనెల 16వ తేదీన మిగతా డబ్బుల కోసం బీరువా తీయగా డబ్బులు లేకపోవడంతో దంపతులు ఇరువురు బాధపడ్డారు. పోలీస్ స్టేషన్ జరిగిన ఘటన విషయం చెప్పి, దరఖాస్తు చేసుకున్నారు. పోలీసులు జరిగిన దొంగతనంపై పూర్తిగా దర్యాప్తు చేసి, మా డబ్బులు తిరిగి ఇప్పించాలని పద్మ, మోతిలాల్ వేడుకుంటున్నారు.

# పూరిల్లు దగ్ధం..భారీగా ఆస్తి నష్టం



- ఆందోళనలో గిరిజన కుటుంబం
- పరామర్శించిన సీపీఐ(ఎం)
- బాధ్యుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**నవతెలంగాణ-చర్ల**

మండల పరిధిలోని ఉంజుపల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ఇరప ముత్తయ్య అనే నిరుపేద ఆదివాసీ పూరి గుడిసె పూర్తిగా ఖాళీ బూడిదయింది. ఇంటి యజమాని ముత్తయ్య చెప్పిన వివరాల ప్రకారం... తెల్లవారుజామున మూడు నుంచి నాలుగు గంటల మధ్యన పక్కింటి వారు ఇల్లు కాలిపోతుందని పెద్ద పెద్ద కేకలు వేయడంతో నిద్రలేచి చూడగా అప్పటికే నలుదిక్కుల మంటలు అంటుకున్నాయి. పెద్దగా అరవగా చుట్టుపక్కల ఉన్న నా బంధువులు, స్నేహితులు వచ్చారు. ప్రతి మనిషి ఒకటి రెండు పనిముట్లు బయటకు తీయడం తప్ప మిగతాయాన్ని మంటల్లో ఖాళీ బూడిదయ్యాయని ముత్తయ్య తెలిపారు. బంగారం ఆభరణాలు, వెండి ఆభరణాలు, ఫర్నిచర్, తన కుమారుడి దిలీప్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సంబంధించిన మార్క్స్ మెమోలు సైతం కాలిపోయాయని సీపీఐ(ఎం) మండల పార్టీ ఎదుట బోరున విలపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలమైన మాకు ఉన్న ఏకైక గూడు పూరిల్లు కాస్త అగ్నికి ఆహుతి అయిందని వారు కన్నీటి పర్యంతం అయ్యారు. మంటలు ఆర్పడానికి అగ్నిమాప కేంద్రానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ.రాజు వర్మ సమాచారం ఇవ్వడం జరిగిందని ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఇంటి లోపల అంతా కాలిపోయి భారీగా ఆస్తి నష్టం చేకూరిందన్నారు. మండల కేంద్రంలో అగ్నిమాపకేంద్రం ఉన్నట్లయితే నా పూరిలు నాకు సగమైన మీగిలేదని ముత్తయ్య ఆవేదన వ్యక్తపరిచారు.

**మండల కేంద్రంలో అగ్ని మాపక కేంద్రాన్ని నిర్మించాలి : సీపీఐ(ఎం)**

మండల కేంద్రంలో అగ్ని మాపక కేంద్రాన్ని వెంటనే నిర్మించి అగ్ని ప్రమాదాలను అరికట్టాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు, పూసుగుప్ప జోన్ కన్వీనర్ దొడ్డి హరి నాగ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదానికి సర్వం కోల్పోయిన ముత్తయ్యకు ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరు చేసి ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని పార్టీ నాయకులు కోరారు. ప్రతి ఏటా వేసవి కాలంలో భారీగా అగ్ని ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో కుటుంబాలు నిరాశయులవుతున్నారని అది గుర్తుతెరిగి భద్రాచలం శాసనసభ్యులు, ఐటీడీఏ పీఓ, కలెక్టర్ చొరవచూపి మండల కేంద్రంలో అగ్నిమాప కేంద్రాన్ని నిర్మించడానికి నిధులు తెప్పించి ఏజెన్సీ ప్రాంత నిరుపేదలను ఆదుకోవాలని వారి కోరారు. అలాకాకుండా అలసత్వం వహిస్తే భారీగా ప్రజా సమీకరణ చేసి దసలవారి ఉద్యమాలు చేయడానికి వెనకాడబోమని నాయకులు హెచ్చరించారు.

## పని ఒత్తిడి తగ్గించేందుకు మానసిక ప్రశాంతత అవసరం : తెల్లం

- పీఓ నిర్వహించిన ఎట్ హెూమ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

ప్రతిరోజు కార్యాలయంలోని విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి ఇంటి సభ్యుల పట్ల కూడా సమయం కేటాయించలేక సతమతమవుతున్న ఉద్యోగులకు ప్రత్యేక సందర్భాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మనసుకు ప్రశాంతత చేకూరి ఒకే కుటుంబ సభ్యుల సంతోషంగా గడపడం కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావ్ అన్నారు. ఆదివారం రాత్రి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్ దంపతులు నిర్వహించిన ఎట్ హెూమ్ కార్యక్రమానికి ఏఎస్పీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఐటీడీఏ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు చిన్నారుల ఆటపాటలతో పీఓ క్యాంప్ ఆఫీస్‌లో పండుగ వాతావరణంల ఉండడంతో సరదాగా ఉద్యోగులతో కలిసి తగ్గాప్ వార్ ఆటలు ఆడిన తర్వాత చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలల కాలంలోనే గిరిజన కుటుంబాల అభివృద్ధి పట్ల ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మంచిర్యాలలో స్థానిక సంస్థల జేసీగా పనిచేసిన సమయంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో బెల్లంపల్లి కాన్స్టెన్సీకి రిటర్నింగ్ ఆఫీసర్‌గా చేసిన సేవలకు తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం తీసుకోవడం ఆయన పనితనానికి అద్దం పడుతుందని ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తున్నట్లు అన్నారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను తన సతీమణితో సందర్శించారు. అనంతరం ఎటు హెూం సందర్భంగా ఉద్దీపకం వర్క్ బుక్ రచించిన ఉపాధ్యాయులకు, క్యాంప్ ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బందికి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంస పత్రాలు, మెమొంటోళ్లు అందించి సత్కరించారు. అంతకుముందు గవర్నర్ చేత పురస్కారం పొందిన పీఓకు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివా నాయక్, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏవో సున్నం రాంబాబు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ చంద్రశేఖర్, ఆర్‌సీఓ నాగార్జున రావు, ఎస్ఓ భాస్కర్, ఏసీఎంఓ రమణయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు రక్ష కవచ్ కిట్‌లపై శిక్షణ



**నవతెలంగాణ-దమ్మపేట**

బీసీ వెల్ఫేర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కల్లుగీత వృత్తి దారులకు కాటమయ్య రక్ష కవచ్ కిట్‌ల వినియోగంపై సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి దమ్మపేట కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొనగా నల్గొండ జిల్లా నుంచి వచ్చిన శిక్షకుల సమక్షంలో తాటి చెట్ల వద్ద నిర్వహించారు. ట్రైనింగ్ అనంతరం సభ్యులకు బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారిణి విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ అట్టం లక్ష్మణరావు, దుర్గమ్మ, ఎక్సైజ్ శాఖ డిపార్ట్‌మెంట్ పి.భరత్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్ష కవచ్ కిట్‌లను గీత కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం గ్రామ ప్రజలు కొనకళ్ళ కృష్ణ, బైగాని కృష్ణ, కొనకళ్ళ లక్ష్మీనర్సు, పానుగంటి చెన్నారావు, గొల్లపల్లి సత్యనారాయణ, దమ్మపేట కల్లుగీత సొసైటీ ఇన్‌చార్జి పానుగంటి లక్ష్మణ్ గౌడ్, సభ్యులు పానుగంటి రామారావు, కొనకళ్ళ వెంకట్రావు, కాసగాని సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## గురుదేవ్ విద్యాలయంలో ఘనంగా నమస్కృతి

- అలరించిన విద్యార్థుల సంస్కృతి కార్యక్రమాలు



**నవతెలంగాణ-చర్ల**

స్థానిక గురుదేవ్ విద్యాలయంలో మూడు రోజులపాటు నమస్కృతి పేరిట బాల బాలికల చక్కని ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. చివరి రోజు సోమవారం జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు హెచ్.జి.వి ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు తొలి పలుకులు, అడుగులు నేర్పే మొదటి గురువులు అమ్మానాన్నలని, పిల్లల బంగారు భవిష్యత్తుకై అహర్నిశలు శ్రమిస్తూ, తమ జీవితాన్ని అంకితం చేసే తల్లిదండ్రుల త్యాగానికి నివాళిగా మా గురుదేవ్ విద్యాలయ వార్షికోత్సవాన్ని "నమస్కృతి" అనే పేరుతో అమ్మానాన్నలకు అంకితం ఇస్తున్నామని తెలిపారు. అంతేగాక ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క విద్యార్థిని పాల్గొనేలా ప్రణాళిక రూపొందించి, వారిలో సభాకంపనాన్ని పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని నింపడమే తమ ముఖ్య ఉద్దేశమని అందుకే మూడు రోజులపాటు ఈ నమస్కృతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ విలువైన సమయాన్ని కేటాయించి వచ్చి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు, పెద్దలకు, బంధువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎం.వి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున విద్యార్థులు తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ దుర్గా భవానిపై చర్యలు తీసుకోవాలి



- హాస్పిటల్ ఎదుట సిబ్బంది నిరసన

**నవతెలంగాణ-పినపాక**

పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని నోటికి వచ్చినట్లు తిడుతూ వేధిస్తున్న వైద్యురాలు దుర్గా భవానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిబ్బంది నిరసన చేపట్టారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు వైద్య ఆరోగ్యశాఖ ఐఎన్‌టీయూసీ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మెన్ గొంది వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. వారితో పాటు దీక్షలో కూర్చున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఉన్న క్యాజువల్ సెలవులు కూడా వినియోగించుకోకుండా డాక్టర్ చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్షలకు వెళ్లే సమయంలో కూడా సిబ్బందికి సెలవు ఇవ్వకుండా ఆబ్సెంట్ వేస్తున్నారన్నారు. సిబ్బందికి అధిక పని వేళలు చేయాలంటూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. సిబ్బంది ఇష్టారీతిగా దూషిస్తున్నారని దానికి నిరసనగా రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లుగా తెలియజేశారు. ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వైద్యురాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటిదాకా దీక్షలు విరమించేది లేదని తెలిపారు. ఈ దీక్షలకు కరకగూడెం, జానంపేట వైద్య సిబ్బంది సైతం మద్దతు తెలిపారు.

**ఎటువంటి ఎంక్వయిరీ కైనా సిద్ధం : డాక్టర్ దుర్గాభవాని**

ఎవరి పనివేళలో వారిని చేయమని చెబుతున్నామని, ఎవరిని వ్యక్తిగతంగా దూషించడం లేదని డాక్టర్ దుర్గాభవాని నవతెలంగాణకు తెలియజేశారు. వారి సెలవులు వినియోగించుకోవడంపై ఎటువంటి ఆంక్షలు పెట్టలేదన్నారు. ఒకేసారి ఇద్దరు స్టాఫ్ నర్సులు సెలవులో ఉంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించానన్నారు. సిబ్బందిని పనివేళలో పనిచేయడం ఎలా తప్పవుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 24 గంటలు సేవా అందించడానికి వైద్య వృత్తిలోకి వచ్చా మన్నారు. తాను ఏంటో తన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఎవరిని అడిగినా చెబుతారని ఎంక్వయిరీకి కూడా పూర్తిగా సిద్ధమని డాక్టర్ తెలియజేశారు. తన కాలికి గాయమై ప్రస్తుతం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.



## ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోండి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**నవతెలంగాణ-పాల్వంచ**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసిన అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని శాఖల వారీగా అధికారులను ఆదేశించారు. ములకలపల్లి మండలం చంద్రుకుంట గ్రామానికి చెందిన ఎస్టీ కోయ గిరిజనులు 40 కుటుంబాలు పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామని ప్రభుత్వం మాకు పోడు మీద హక్కు పత్రం కల్పించిందని మేము సంవత్సరానికి ఒక పంట మాత్రమే వేసి, ప్రస్తుతం జీవనం కొనసాగిస్తున్నామని మాకు బోర్లు, కరెంటు అనుమతిస్తే రెండు పంటలు పండించుకుంటానమని కోరారు. ములకలపల్లి మండలం సీతారాంపురం గ్రామ పంచాయతీ అన్నారంకు చెందిన గ్రామ రైతులు ముర్రేడు వాగు నందు మోటార్లు వేసి వ్యవసాయం చేస్తున్నామని, రాత్రిపూట ఇసుక ట్రాక్టర్ వల్ల నీరు అడుగంటుతున్నాయని, ఈ రెండు నెలల వరకు తోలకాలు ఆపాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పేదల ఖాతాలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

- జారేకి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు

**నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి**

ఇందిరమ్మమ ఆత్మీయ భరోసా పథకం కింద పేదల ఖాతాలో రూ.6వేలు జమఅయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు జానికిపురం గ్రామస్తులు, నాయకులు కట్టా శివ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో నాలుగు పథకాలు ప్రారంభానికి జానికిపురం గ్రామాన్ని ఎంచుకొని కృతజ్ఞతలు తెలిపారు.

## చెల్లని చెక్కు కేసులో శిక్ష

**నవతెలంగాణ-భద్రాచలం రూరల్**

చెల్లని చెక్కు కేసులో భద్రాచలం మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ శిక్షణ ఖరారు చేస్తూ తీర్పును వెల్లడించారు. పట్టణానికి చెందిన షేక్ నజీమ్ మునిసా బేగం వద్ద ఎటపాకకు చెందిన తన్నీరు లక్ష్మి సొంత ఖర్చుల నిమిత్తం చెక్కును హామీగా ఉంచి డబ్బు తీసుకున్నారు. నిర్ణీత గడువులోపు డబ్బు చెల్లించకపోగా సదరు నజీమ్ మునిసా బేగం చెక్కును బ్యాంకులో వేశారు. అది చెల్లని చెక్కుగా బ్యాంక్ వారు పరిగణించారు. తదుపరి బాధితురాలు లాయర్ ద్వారా కోర్టు నందు చెక్కు కేసు వేయగా కేసు నమోదు అయింది. ఆ కేసు తీర్పు సోమవారం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వెలువరించారు. తన్నీరు లక్ష్మికి ఆరు నెలలు జైలు శిక్ష, మూడు లక్షల రూపాయలు నష్టపరిహారం వేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నష్టపరిహారాన్ని కోర్టు ఇచ్చిన గడువులోగా కట్టలేని ఎడల మరొక ఆరు నెలలు శిక్షగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని వెలువడించారు.

## నాకు దక్కిన ఉత్తమ ప్రశంస కళాశాలకు వచ్చినదిగా భావిస్తున్నా...

- జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణి

**నవతెలంగాణ-దుమ్ముగూడెం**



దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నేను అందించిన సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేసి రిపబ్లిక్ డేను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నేను అందుకున్న ప్రశంస జూనియర్ కళాశాలకు వచ్చిన ప్రశంసగా భావిస్తున్నానని దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణి అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణిని కళాశాల విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ అవార్డు మన కళాశాలకు వచ్చినదిగా భావిస్తున్నానని అన్నారు. కళాశాలలో విద్యార్థులు ఉన్నత స్థితికి రావటానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు. రాబోయే పరీక్షల్లో ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా 30 రోజుల పాటు జరిగే స్టడీ అవర్స్ స్లిప్ టెస్టు పరీక్షల్లో పాల్గొని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సూచనలను విద్యార్థులందరూ పాటించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. నాకు వచ్చిన అవార్డుకి పూర్తిస్థాయి న్యాయం జరుగుతుందని, నన్ను సన్మానించినటువంటి కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్ వాడీ ఆయా జయమ్మకు సీఐటీయూ నివాళి

**నవతెలంగాణ-ఇల్లందు**

ఇల్లందు మండలం ముకుందపురం సర్కిల్ నిజాంపేట గ్రామానికి చెందిన అంగన్ వాడీ ఆయా జయమ్మ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నేతలు, యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రాంబాయి, మరియ, రమణ, ఇస్తార, వెంకటమ్మ చంద్రకళ, సర్కిల్ టీచర్లు, ఆయా మృతదేహానికి నివాళ్లు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణలు మాట్లాడుతూ యూనియన్ నిర్వహించిన ఆందోళన, పోరాటాల్లో క్రమం తప్పకుండ పాల్గొని యూనియన్ అభివృద్ధికి కోసం జయమ్మ కృషి చేశారని అన్నారు.

## వైసీఓఏ మహిళా క్లబ్‌లో బొమ్మలకొలువు


**నవతెలంగాణ-ఇల్లందు**

ఏరియాలోని వైసీఓఏ మహిళా క్లబ్‌లో సేవా, మహిళా క్లబ్ అధ్యక్షురాలు వి.రమ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీమణి శారద బలరాం, అలాగే డైరెక్టర్ పీపీ మరియు పా సతీమణి సునీతా వెంకటేశ్వర రావు, డైరెక్టర్ ఈ అండ్ ఎం సతీమణి హరిణి సత్యనారాయణ కొత్తగూడెం సేవా, మహిళా క్లబ్ అధ్యక్షురాలు మధురవాణి, మణుగూర్ సేవా, మహిళా క్లబ్ అధ్యక్షురాలు సుమ రామచందర్, జీఎం సెక్యూరిటీ రోజా లక్ష్మీనారాయణ హాజరై బొమ్మల కొలువులను ప్రారంభించారు. అనంతరం మహిళలు వేసిన రంగవల్లులను భద్రాచలం తెప్పోత్సవం సెట్టింగ్‌లను పరిశీలించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు.

## భవిష్యత్తులో బలమైన శక్తిగా టీడీపీ

- పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు

**నవతెలంగాణ-ఇల్లందు**



తెలుగుదేశం పార్టీలో గతం కంటే మెరుగ్గా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని తిరిగి రాష్ట్రంలో పార్టీ క్రియాశీలకంగా వ్యవహరిస్తుందని, రానున్న కాలంలో పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతుందని పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వ బీమాను ఉపయోగించుకోవాలన్నారు. పార్టీ సభ్యత్వ తీసుకున్న వారికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని, అదేవిధంగా తెలుగుదేశం పార్టీలో సభ్యులుగా చేరిన వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కోటిపైగా సభ్యత్వాలు పూర్తి చేసుకొని ముందుకు సాగుతుందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మణుగూరులో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

**నవతెలంగాణ-మణుగూరు**



మణుగూరు ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. సోమవారం స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మణుగూరు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకట పుల్లయ్య, మణుగూరు సిఐ సతీష్ కుమార్, ఎస్సై ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట పుల్లయ్య మాట్లాడుతూ ప్రయివేట్ స్కూల్ బస్సు డ్రైవర్స్ మరియు అటెండర్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదన్నారు. సిఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ స్కూల్ బస్సులు అతివేగంగా నడపరాదని అన్నారు. ఎస్సై ప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదు అన్నారు. తగు జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అరవింద కుమార్, ప్రయివేట్ పాఠశాలల కరస్పాండెంట్స్ ఎండి యూసఫ్ షరీఫ్, మధుసూదన్ రెడ్డి, ప్రతాపరెడ్డి, ఐజాక్, థామస్, సంపత్ రెడ్డి, డ్రైవర్లు, అటెండర్లు పాల్గొన్నారు.

# పాల్వంచలో రెచ్చిపోతున్న భూమాఫియా

- పట్టపగలే భూ ఆక్రమణకు ప్రయత్నం
- భూ యజమానిపై దాడి
- ట్రాక్టర్‌తో పంట మొత్తం తొక్కించి ధ్వంసం
- నాకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు
- పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు
- దాడిని ఖండిస్తూ రజక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన
- భూమాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి : సీపీఐ(ఎం)

**నవతెలంగాణ-పాల్వంచ**

పాల్వంచలో భూమాఫియా రెచ్చిపోతోంది. పట్టపగలే అన్ని హక్కులున్నా భూ యజమానులపై దాడికి దిగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందించిన సమయానికి రాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భూమిపై అన్ని హక్కులున్నా పాల్వంచలో భూమిని కాపాడుకోవడం కష్టంగా మారింది. పోలీసులు సైతం భూమాఫియాకు వత్తాసు పలుకుతున్నట్టు జరుగుతున్న తీరును చూస్తే తెలుస్తుంది.

పాల్వంచ రెవెన్యూ పరిధిలోని శ్రీనివాస కాలనీ గ్రామం పక్కన గల 817/1/2 సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల 26 గుంటలు పట్టా కలిగి ఉన్నటువంటి చిటికెన ముసలయ్య భూమిలో పంటకు నీరు పెట్టేందుకు సోమవారం ఉదయం 9 గంటల సమయంలో వెళ్లాడు. అయితే పాల్వంచకు చెందిన సముద్రాల సైదులు, సముద్రాల రామకృష్ణ, కోటిపల్లి సాయిబాబు ఆయన కుమారులు రమేష్, మహేష్ వారి అనుచరులు 40 మందిని తీసుకువెళ్లి ముసలయ్యపై కర్రలతో మూకుమ్మడిగా దాడి చేశారని రైతు తెలిపారు. అడ్డువెళ్లిన కందుకూరి రాము, కృష్ణ తేజలను కూడా కర్రలతో కొట్టి చంపడానికి ప్రయత్నం చేశారు. శెట్టిపల్లి వెంకటేశ్వర్లుకు చెందిన వ్యవసాయ ట్రాక్టర్‌తో పంట మొత్తం తొక్కించి ధ్వంసం చేశారని రైతు తెలిపారు. ఒక రోజు ముందే ముసలయ్య ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను సైదులు, సముద్రాల రామకృష్ణలు ధ్వంసం చేసి తగలబెట్టారు. 100కు డయల్ చేసినా పోలీసులు అక్కడికి రాకుండా స్టేషన్‌కి రావాలని చెప్పారు. వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్కు చేరుకుని ఫిర్యాదు చేశారు. తీవ్ర గాయాల పాలైన చిటికెన ముసలయ్యని పాల్వంచ ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స నిమిత్తం తరలించారు

ఇట్టి భూమి విషయమై వివరాల్లోకి వెళితే 2005లో కోటిపల్లి సాయిబాబా అను వ్యక్తి వద్ద చిటికెన ముసలయ్య తన కుటుంబ అవసరాల నిమిత్తం రూ.3లక్షలకు భూమిని తనఖా పెట్టాడు. 2011లో చిటికెల ముసలయ్య సాయిబాబాకి డబ్బులు చెల్లించడానికి వెళ్లగా మీ భూమి అమ్మేశాం అంటూ ఎదురు తిరిగాడు. నీకు భూమి లేదని బెదిరించాడు. దాంతో 2011లోనే చిటికెన ముసలయ్య కొత్తగూడెం సివిల్ కోర్టుకు వెళ్లగా 2018లో ఆయనకు అనుకూలంగా కోర్టు జడ్జిమెంట్, పూర్తి హక్కులతో డిక్రీ ఇచ్చింది. దాని ఆధారంగా 2019లో భూమిలోకి వెళ్ళగా సముద్రాల సైదులు, రామకృష్ణ, మల్లయ్య అనువారు ముసలయ్యని చంపుతామని బెదిరించి భూమిలోకి





రానివ్వకుండా అడ్డుకున్నారు.

దాంతో ఆ ముగ్గురిపై ముసలయ్య కోర్టులో ఈపి దాఖలు చేశారు. 2024 డిసెంబర్ నెలలో ముసలయ్య పాల్వంచ తహసీల్దార్‌కి, కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌కి తనకు రక్షణ కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. భూమిలో జొన్న, మినుము, పెసర విత్తనాలు చల్లినారు. పంటకు నీరు పెట్టేందుకు సోమవారం ఉదయం వెళ్ళగా సముద్రాల సైదులు, రామకృష్ణ, కోటిపల్లి సాయిబాబా తన కుమారులు మహేష్, రమేష్‌లు వారితో పాటు సుమారు 40 మందిని కిరాయి మనుషులను తీసుకుని వెళ్లి ముసలయ్యని కర్రలతో విచక్షణారహితంగా కొట్టి, దాడి చేసి గాయపరిచారు. చిటికెన ముసలయ్యపై, అడ్డు వెళ్లిన కందుకూరి రాము, కృష్ణ తేజలపై కూడా దాడి చేశారు. ఈ దాడిని ఖండిస్తూ రజక సంఘం ఆధ్వర్యంలో పాల్వంచ గవర్నమెంట్ హాస్పటల్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు మాట్లాడుతూ ముసలయ్యపై దాడి చేసిన దుర్మార్గం అన్నారు. సాయంత్రం వరకు అదే పొలంలో దుండగులు హల్చల్ చేస్తూ మోటార్లను పీకి వేసి, మద్యం సేవిస్తూ, జల్సాలు చేస్తున్నా పోలీసు కనీసం కన్నెత్తి చూడలేదన్నారు. ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా ఉన్నారన్నారు. ఇది ముందుగానే పోలీసులతో సముద్రాల సైదులు, రామకృష్ణలు మాట్లాడుకొని జరిగిన ఘటనగా కనిపిస్తుందని ఆరోపించారు. ఇలాంటి ఘటనను అధికారులు ప్రోత్సహిస్తే ప్రజలు అభద్రతాభావానికి గురై, శాంతిభద్రతల సమస్యగా మారుతుందని ఇంత నిర్లక్ష్యం వహించడం పోలీసు వారికి తగదని అన్నారు. ముసలయ్యకి ఆయన కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) పాల్వంచ పట్టణ కార్యదర్శి తులసీరామ్, సీపీఐ నాయకులు నిమ్మల రాంబాబు మద్దతు తెలిపారు. భూ మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా, మండల నాయకులు నంద్యాల వెంకటేశ్వర్లు, యాదగిరి, నాగయ్య, పోతురాజు, కంచర్ల శ్రీనివాస్, సాలికోల శివకుమారి, రోజా రాణి, రామ తులసి, సక్కుబాయి, సుధాకర్ పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్

**నవతెలంగాణ పాల్వంచ**

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 29 నుండి ఫిబ్రవరి 22 వరకు జరిగే ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుంచి 25 వరకు జరిగే పరీక్షలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 10173 మంది రెండవ సంవత్సరం 10,062 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో 65 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12 వరకు మరియు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు రెండు సెక్షన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, మెడికల్ శిబిరాలు, ఆర్టీసీ బస్ సౌకర్యాలు కల్పించాలని అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో 144 సెక్షన్ అమలు తప్పక ఉండాలని, కేంద్రాల దగ్గరలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని సూచించారు. ఏ ఒక్క కేంద్రంలో సెల్ ఫోన్ అనుమతించ వద్దని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థులకు మానసిక వికాస తరగతులను నిర్వహించి వారిలో పరీక్షల పట్ల ఉన్న భయాందోళన తొలగించాలని అన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించి నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్. వెంకటేశ్వరరావు, కొత్తగూడెం ఏఆర్‌డి ఎస్‌పి సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ అరవింద్ బాబు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కొందరు సీపీఐ పార్టీ నాయకులు డబుల్ గేములు ఆపాలి

- అర్హులందరికీ ఆత్మీయ, రైతు భరోసా తొలి విడతలోనే ఇవ్వాలి
- ఆళ్ళపల్లి మాజీ ఉప సర్పంచ్ మొహమ్మద్ ఖయ్యుం

**నవతెలంగాణ-ఆళ్ళపల్లి**



కొందరు సీపీఐ పార్టీ నాయకులు డబుల్ గేములు ఆడటం మానుకోవాలని ఆళ్ళపల్లి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ మొహమ్మద్ ఖయ్యుం ఘాటుగా దుయ్యబట్టారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు.. వాళ్లు ఆరు గ్యారంటీలు ఇవ్వలేరని తెలిసి కూడా సీపీఐ పార్టీ కేవలం ఒక ఎమ్మెల్యే సీటు కోసం కాంగ్రెస్ పార్టీతో కలసి పోటీ చేసిందన్నారు. సీపీఐ కృషి వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని కొందరు నాయకులు జనాల్లో చెప్పుకొచ్చారని తెలిపారు. ఎన్నికలు ముగిశాక కాంగ్రెస్‌ను మేమే(సీపీఐ) గెలిపించామని జబ్బలు సరుసుకున్నారు. మీరు(సీపీఐ పార్టీ) ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని మీకు తెలిసి, మీ బుజస్కందాలపై వేసుకొని పేద ప్రజలకు కొందరు నాయకులు వారి మాయమాటలతో ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల ఓట్లతో గెలిచిన తర్వాత కాంగ్రెస్, సీపీఐ పార్టీలు కలసి 6 గ్యారంటీలను అటుకెక్కించారని విమర్శించారు. సర్వేలన్నీ బోగస్.. లిస్టులన్ని బోగస్ లిస్టులు.. అయితే ఇందిరమ్మ కమిటీలో కాంగ్రెస్ సభ్యులతో పాటు కొందరు సీపీఐ పార్టీ సభ్యులు సైతం ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దానిపై రీ సర్వే చేయాలని సీపీఐ పార్టీ కొందరు నాయకులు తిరిగి ఎందుకు డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. మండలంలో సర్వే జరిగే టైంలో ఇందిరమ్మ కమిటీలు అధికారులతో పాటు ప్రతి ఇల్లు తిరిగి సర్వే చేయించిన సంగతి ప్రజలకు తెలిసిందేనని చెప్పారు. మండలంలో అర్హులు ఎక్కువమంది ఉండేసరికి ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హులందరికి ఇవ్వలేమని తెలిసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు కలిసి సీపీఐ పార్టీతో పాటు ఆ పార్టీ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆళ్ళపల్లిలో జరిగిన గ్రామసభలో నిలదీస్తారనే ముందు జాగ్రత్తగా కాంగ్రెస్ సీపీఐ రెండు పార్టీల నాయకులు కలిసి గ్రామసభలో ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని గందరగోళం సృష్టించారని విమర్శించారు. గ్రామ సభలో నిలదీస్తే అర్హుల లిస్టు బయటికి రాకుండా సీపీఐ పార్టీ నాయకులు ఎందుకు అడ్డుపడ్డారని ఎదురు ప్రశ్నించారు? కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ఇవ్వలేదని మీకు తెలిసి, ఆ అర్హుల లిస్టు బయటకు రాకుండా కావాలనే అడ్డు పడుతున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక సర్పంచ్ ఎన్నికల కోసం కావాలని సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న డ్రామా అని ఆళ్ళపల్లి ప్రజలకు అర్థమైందన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు మీకు తగిన విధంగా బుద్ధి చెప్తారని అన్నారు. ఏది ఏమైనా మండలంలో అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలు వర్తించేలా పాలకులు, అధికారులు చూడాలన్నారు.

## కార్మిక సమస్యలు పరిష్కరించాలి

- జీఎం కార్యాలయం ముందు ధర్నా

**నవతెలంగాణ-మణుగూరు**



సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం మణుగూరు జీఎం ఆఫీస్ నందు గేట్ మీటింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ కార్మిక సమస్యలపై మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా నిలిచిపోయిన స్ట్రక్చర్ సమావేశాలను పునరుద్ధరించామని చెప్పారు. ఈ సమావేశాలలో డిస్మిస్ అయిన జెఎంఈటిలను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందని అన్నారు. సింగరేణి కార్మికుల పిల్లలకు వర్తింపజేస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్‌ను 2000నుండి 8000ల ర్యాంకు పెంచడానికి, కొత్త ఇన్సెంటివ్ విధానం అమలు, వేజ్ బోర్డులో లేని 11 రకాల అలవెన్స్ పెంచడానికి, క్యాడర్ స్కీమ్ అమలు తదితర అంశాలపై అంగీకారం కుదిరిందని తెలిపారు. స్థానికంగా మణుగూరులో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో మహిళా కార్మికులకు సంబంధించి అన్ని మైన్స్ డిపార్ట్మెంట్‌ల వద్ద రెస్ట్ షెల్టర్లు వాష్‌రూమ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పివి కాలనీలో అంతర్గత రోడ్లను నిర్మించాలని, మణుగూరులో ఖాళీగా ఉన్న వేకెన్సీలను భర్తీ చేయాలని, వీధిలైట్లు సరి చేయాలని, ఏరియా హాస్పిటల్ గైనకాలజిస్ట్ సమస్య పరిష్కరించాలని కోరామని తెలిపారు. ఏఐటియుసి యూనియన్ బలోపేతానికి ఆర్థికంగా చందా రాసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు మల్లెల రామ నరసయ్య, ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఆడేపు రాజశేఖర్, నరసింహారావు, శరత్, జావేద్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య
- వాసవి క్లబ్ ఇల్లందు అధ్యక్షుడిగా బోనగిరి రవికిరణ్
- కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

**నవతెలంగాణ-ఇల్లందు**




ఆర్యవైశ్యులు అంటేనే సేవ, ఈ సారి యువకులు సేవ చేయుటకు ముందుకొచ్చిన సందర్భం అభినందనీయమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. స్థానిక కళాస్ బస్తీ లోగల ఆర్యవైశ్య సత్రం నందు వాసవి క్లబ్ 2025వ సంవత్సర అధ్యక్షుడిగా బోనగిరి రవికిరణ్, ప్రధాన కార్యదర్శిగా కటకం సత్యేంద్ర కుమార్, కోశాధికారిగా తీర్ధాల నాగరాజు మరియు మిగతా కార్యవర్గ సభ్యులతో గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త క్లబ్ సభ్యులు ప్రతి ఒక్కరూ కూడా ఈ సంవత్సరం మంచి సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు కోరం కనకయ్య మాట్లాడుతూ సంఘం ద్వారా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

**ఆర్యవైశ్యులందరికి రుణపడి ఉంటా : అధ్యక్షుడు బోనగిరి రవికిరణ్**

నూతన అధ్యక్షుడు రవి కిరణ్ మాట్లాడుతూ గొప్ప అవకాశాన్ని కల్పించిన ఇల్లెందు ఆర్యవైశ్యులందరికీ రుణపడి ఉంటానని ఈ 2025వ సంవత్సరం బెస్ట్ క్లబ్‌గా ఇంటర్నేషనల్ లెవెల్‌లో ఇల్లందును తీర్చిదిద్దుతానన్నారు. కుల, మత బేధాలు లేకుండా క్లబ్ సేవలను అందరికీ అందేలా చేస్తానని తెలిపారు.

**మాజీ మున్సిపల్ చైర్మన్ డీవికి సన్మానం**

ప్రమాణ స్వీకారానంతరం మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు వాసవి క్లబ్, ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ డిఈ రవికుమార్, హరిహర క్షేత్రం చైర్మన్ సదానందం , వాసవి క్లబ్ పెద్దలు అర్వేపల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎలక్ట్రిషన్ డే

**నవతెలంగాణ-చర్ల**

మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎలక్ట్రిషన్ డే వేడుకను మండల ప్రయివేట్ ఎలక్ట్రిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిషన్ బల్బును కనుగొన్న థామస్ అల్వా ఎడిషన్, అలాగే ఎలక్ట్రిషన్స్ దైవంగా కొలిచే అమ్మవారు చిత్ర పటాలకు పూలమాలలు వేసి, కొబ్బరి కాయలు కొట్టి, జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు సీనియర్ ఎలక్ట్రీషన్లు మాట్లాడుతూ విద్యుత్తు మన జీవితాలలో చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఇది మన ఇళ్లను వెలుగులో ఉంచడానికి, ఎలక్ట్రానిక్ పరికరాలను నడపడానికి, అనేక ఇతర పనులకు ఉపయోగపడుతుందని, అటువంటి విద్యుత్ వినియోగంలో ఏమైనా అంతరాయం కలిగినా, విద్యుత్ ఉపకరణాలు రిపేర్‌కు వచ్చిన వాటిని మనం రిపేర్ చేస్తుంటామని అన్నారు. ఎలక్ట్రిషన్స్‌ను ఆదుకోవాలని, అలాగే నిరుపేద కార్మికులను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవి చారి, వాసు, గోసంగి సంతోష్, అశోక్, రాజేష్ విజయ్ తోపాటు పెద్ద ఎత్తున విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వ పథకాలకు పేర్లు డిసైడ్ చేసే హక్కు బండి సంజయ్‌కు లేదు

- జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న

**నవతెలంగాణ -కొత్తగూడెం**

ఇద్దరు కేంద్ర మంత్రులు తెలంగాణకు ఉన్నప్పటికీ కూడా ప్రత్యేక నిధులు తెచ్చి రాష్ట్రాన్ని ఉదరించేది లేదుగానీ ప్రజా ప్రభుత్వం ఇస్తున్నటువంటి పథకాల పేర్ల గురించి మాట్లాడేటువంటి హక్కు మీకు ఎక్కడిదని జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న అన్నారు. సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఇంద్రమ్మ పేరు పెట్టొద్దు అనడానికి మీరు ఎవరు...? మీకేం రైట్స్ ఉన్నాయి అన్నారు. ఈ దేశ ప్రధానిగా ప్రపంచ దేశాల సైతం ఉక్కు మహిళ అని కీర్తించినటువంటి ఇందిరా గాంధీ ఈ దేశ ప్రజలకు ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, వేసుకోవడానికి బట్ట కనీసం కలిగి ఉండాలి అనేటువంటి ఆకాంక్షతోనే పనిచేసినటువంటి ఒక మహనీయురాలు అని తెలిపారు. ఈ దేశం కోసం ప్రాణం కోల్పోయినటువంటి ఒక ధీరవనిత ఇందిరా గాంధీ అన్నారు. అలాంటి ఒక మహిళ గురించి మాట్లాడుతూ పథకాలకు ఇంద్రమ్మ పేరు పెడితే కేంద్రం నుంచి ఒక రూపాయి కూడా రాదు అనడానికి మీరు ఎవరు జీఎస్టీ పేరుతోనే ఈ సంవత్సరము అక్షరాల రూ.42 వేల కోట్లను కేంద్రానికి చెల్లిస్తే అప్పుడు మాటలు రాలేదు. కేవలం తెలంగాణలో మీ ఉనికిని కాపాడుకోవడం కోసం, చూపు మీ వైపు మల్లడం కోసం ఏదో ఒక మాట మాట్లాడాలి అనేటువంటి చౌకబారు మాటలు మాట్లాడకండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బోడదివ్య, శ్రీ లక్ష్మీ నాగూరు, విజయలక్ష్మి, సులోచన, జమున శ్రీ, సుశీల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
9
మంగళవారం | జనవరి 28, 2025 | www.navatelangana.com

## భారీ మెజార్టీతో ఐఎన్‌టీయూసీ విజయం తథ్యం

- నేడు పెద్ద ఎత్తున జనరల్ బాడీ సమావేశం
- యూనియన్ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి




**నవతెలంగాణ-బూర్గంపాడు**

ఈ నెల 31న జరగునున్న ఐటీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ భారీ మెజారిటీ విజయం సాధించటం తథ్యమని ఐటీసీ ఐఎన్టీయూసి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చి రెడ్డి అన్నారు. సారపాకలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ భారీ మెజార్టీ పై కన్నేసిందని ఆయన అన్నారు. ఇప్పటికే కొన్ని ప్రధాన కార్మిక సంఘాల మద్దతుతో పాటు మరి కొన్ని వర్గాల మద్దతు సంపాదించిన ఐఎన్టిటియుసికి 13వ వేతన ఒప్పందంలోని టీఎన్‌టీయూసీ కార్యవర్గంలో పని చేసిన కొందరు ముఖ్య నాయకులు కూడా మద్దతు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఐటీసీ కర్మాగారంలో ఇప్పటివరకు ఐఎన్‌టీయూసీ ఏడు వేతన ఒప్పందాలను చేసిందని ఆయన అన్నారు. మెడికల్ విషయంలో ఐఎన్టీయూసీ చేసిన వేతన ఒప్పందాలే మెరుగైనవని కార్మికులు గుర్తు తెచ్చుకుంటున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా మంగళవారం ఐఎన్‌టీయూసీ జనరల్ బాడీసమావేశం భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు గోనే రామారావు, చైర్మెన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వర రెడ్డి, నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల దాడి హేయమైన చర్య

- బీఆర్ఎస్ నేతల తీవ్ర ఆగ్రహం



**నవతెలంగాణ-అశ్వారావుపేట**

చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు చేసిన దాడి అత్యంత హేయమైన చర్యగా మండల పరిషత్ మాజీ అధ్యక్షులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌లు అభిప్రాయపడ్డారు. అసలైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందలేదని అధికారుల దృష్టికి తీసుకురావటం తప్పా అంటూ వారు ప్రశ్నించారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నాయకుల దాడిని సోమవారం వారు తీవ్రంగా ఖండించారు. గడిచిన 10 ఏళ్ళ కేసీఆర్ సర్కార్‌లో ఇటువంటి దాడులు, ప్రతి దాడులు ఎన్నడూ జరగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రాజకీయ ఒరవడిని తీసుకొస్తుందని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తక్షణమే బీఆర్ఎస్ నాయకుడి పై దాడి చేసి కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆయా మండలాల పార్టీ నాయకులు సత్యవరపు సంపూర్ణ, జుజ్జూరపు శ్రీరామమూర్తి, తాళం సూరి, చిప్పనపల్లి బజారయ్య, మోటూరి మోహన్‌లు పాల్గొన్నారు.

**దమ్మపేట** చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామ సభలో ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు మోహనరావు, కోడెం రవి మీద కాంగ్రెస్ గుండాల దాడి సిగ్గుమాలిన చర్య అని బీఆర్ఎస్ మండల కార్యదర్శి దొడ్డా రమేష్ పేర్కొన్నారు. సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాక్షేత్రంలో ప్రజల తరుపున అడిగే అధికారం ఉంది కాబట్టి మా నాయకులు గ్రామ సభలో ప్రశ్నిస్తే భయపడి ఇలా దాడులు చేయటం హేయమైన చర్య అని ఆరోపించారు. దాడులకు బయపడమని ప్రజల పక్షాన పోరడుతూనే ఉంటామని పేర్కొన్నారు. మా పార్టీ నాయకులు జోలికి వస్తె ఊరుకోమని హెచ్చరించారు. దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## వెంకన్నకు ఐఎఫ్‌టీయూ నివాళి




**నవతెలంగాణ-టేకులపల్లి**

గ్రామపంచాయతీ కార్మికుల హక్కులు, సౌకర్యాల కోసం నిరంతరం పోరాడిన జటంగి వెంకన్న చిత్రపటానికి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం నివాళు లర్పించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి, రాష్ట్ర నాయకులు ఎండి రాశుద్దీన్, డి.ప్రసాద్‌లు, తెలంగాణ ప్రగశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు మూడు బిచ్చు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో మాట్లాడారు. జేకే గ్రామ పంచాయతీ కార్మికుడిగా కొనసాగుతూ..ఆ సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారని, నిరంతరం కార్మికుల సమస్యలపై, తను కార్మికులను చైతన్యవంతం చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు మండల అధ్యక్ష, కార్యదర్శులు మూడు బిచ్చు, ఈసం మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మహారాజ్ జయంతిని జాతీయ పండుగగా గుర్తించాలి

**నవతెలంగాణ-టేకులపల్లి**

సేవాలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు వి.హాథిరామ్ నాయక్ అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రులు గంగపురం కిషన్ రెడ్డి, కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జతీయ నాయకులు చంద్రశేఖర్‌లకు హాథిరామ్ నాయక్ బృందం సోమవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, గరిక పాటి రామ్మోహన్ రావు, గిరిజన మార్చ రాష్ట్ర అధ్యక్షులు జారుపుల కళ్యాణ్ నాయక్, వినోద్ రావు, లాలు నాయక్, భూక్యా సీతారాం నాయక్, తదితరులకు పాల్గొన్నారు.

## అమృత్ 2.0 పథకం పనులను ప్రారంభించిన దయానంద్



**నవతెలంగాణ-సత్తుపల్లి**

సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీలో అమృత్ 2.0 పథకం అభివృద్ధి పనులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దయానంద్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి సరఫరాతో ఆయా ప్రాంతాల ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారాన్ని తొలగిస్తూ పచ్చదనం-పరిశుభ్రతను అభివృద్ధి పర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంద రవిబాబు, ఏఎంసీ చైర్మెన్ దోమ ఆనంద్‌బాబు, కాంగ్రెస్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, రామిశెట్టి సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ వినుకొండ కృష్ణ, పింగుల సామేలు, కంటె అప్పారావు, కంభంపాటి కాంతారావు, జొన్నలగడ్డ కృష్ణయ్య, విజయసారధిరెడ్డి పాల్గొన్నారు.

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

**నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్**

ఖమ్మం జిల్లా కూరగాయల మార్కెట్ కమిషన్ వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎర్రగడ్డ హనుమంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, డైరెక్టర్లను జిల్లా కూరగాయల మార్కెట్ కమిషన్ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు తోట రామారావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ గౌరవ అధ్యక్షులు గోపిశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి గోళ్ళ అవినాష్, కోశాధికారి జక్కుల రామకృష్ణ, వైస్ చైర్మన్ నల్లగట్ల వెంకటేశ్వర్లు, పత్తి రవి కుమార్, నాళ్ళ సతీష్, కార్యవర్గ సభ్యులు వెంపటి వెంకన్న, మునగాల వెంకన్న ఆర్. రాజేంద్ర, నరసింహారావు తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## అశ్వారావుపేట మున్సిపాలిటీ అధికారుల కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్
- పూర్తి స్థాయి కమిషనర్‌గా సుజాతకు బాధ్యతలు
- ప్రత్యేక అధికారిగా షాహిద్ మసూద్


సుజాత


మసూద్

**నవతెలంగాణ- అశ్వారావుపేట**

నూతనంగా ఏర్పాటు అయిన నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట మున్సిపాలిటీకి అధికారులను కేటాయిస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీదేవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాల్వంచ మున్సిపాలిటీ కమిషనర్ సుజాతకు అశ్వారావుపేట కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఇన్‌చార్జి కమిషనర్‌గా కేటాయించారు. అలాగే వరంగల్ ఆర్‌డీఎంఏ మున్సిపల్ కమిషనర్ షాహిద్ మసూద్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు తక్షణమే బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అతి త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ సుజాత నవతెలంగాణకు తెలిపారు.

# ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

- జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తాం
- సాధించిన విజయాలను మహాసభకు నివేదించిన జిల్లా నేతలు





**నవతెలంగాణ-కొత్తగూడెం**

జిల్లాలో ప్రజాసమస్యలపై సమరశీల పోరాటాల నిర్వహించటం ద్వారా పార్టీని బలోపేతం చేస్తామని జిల్లా నుండి సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ప్రతినిధులు ప్రకటించారు. జిల్లాలో పార్టీ నిర్మాణ స్థితి, జిల్లాలో పార్టీ చేసిన ఆందోళన పోరాటాలు, సాధించిన విజయాలను జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి, లిక్కిబాలరాజు రాష్ట్ర మహాసభలో వివరించారు. జిల్లాలో పార్టీని గ్రామ స్థాయిలో పటిష్ట పరచటంకోసం చేసిన కృషిని మహాసభకు వివరించారు. జిల్లాలో వివిధ రంగాల కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటలు చేశామని వివరించారు. ఇంటి స్థలాల సాధనకు, కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, చర్ల కేంద్రాలలో ఇంటి స్థలాల ఉద్యమాలు సాధించిన విజయాలను మహాసభకు వివరించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదిరించి జిల్లాలో వేలాది మంది ఆదివాసి రైతులకు పోడు పట్టాలను సాధించిన చరిత్ర సీపీఐ(ఎం)కు మాత్రేమే వుందని వివరించారు. రాష్ట్ర మహాసభలు చేసిన తీర్మానాల వెలుగులో రానున్న కాలంలో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు చేస్తామని మహాసభకు వివరించారు. జిల్లా నుండి రాష్ట్ర మహాసభలకు 37 మంది ప్రతినిధులు మహాసకు హాజరయ్యారు. పోరాల స్పూర్తిని రగిలించేవిధంగా ఉత్సాహ పూరితంగా సాగుతున్న మహాసభకు జిల్లా ప్రతినిధుల బృందానికి పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకత్వం వహిస్తున్నారు.



## హామీలను బొంద పెట్టిన రేవంత్ ప్రభుత్వం

- అనుభవం లేని ముఖ్యమంత్రితోనే ఇబ్బందులు
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేగా

**నవతెలంగాణ-అశ్వాపురం**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బొంద పెట్టిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దోసపాటి రంగారావు, భారతి, వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు లంకె బిందెలను కనుక్కొనేందుకు విస్తతంగా ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు. గడచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలుసు అని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మాటిస్తే మరిచిపోని వ్యక్తిగా పనిచేయడంలో నాకున్న వ్యక్తిగత భావం వేరన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధిని చేయడం కంటే తన వ్యక్తిగత స్వలాభాల కోసం పాటుపడడం కోసమే పని చేస్తున్నాడని విమర్శించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు 10 పేర్లతో లారీలను కొనుక్కొని ఇసుక రవాణా చేయడంలో ముందున్నారని, ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 60 సంవత్సరాల చరిత్రలో ఉమ్మడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పరిష్కారం గాని పలు సమస్యలను బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ పరిష్కరించాలని ఆయన తెలిపారు. అలిమి గాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన తెలిపారు. అనుభవం లేని ముఖ్యమంత్రితో రాష్ట్రం అధోగతి పాలవుతుందని ఆయన అన్నారు.

రానున్న ఐదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధించి మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను చూస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు అందరూ ప్రతి రోజు గ్రామాల్లో సంచరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, సీనియర్ నాయకులు కొల్లు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, కంచుకట్ల వీరభద్రం, కందుల కృష్ణార్జున రావు, సుదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, ఈదర సత్యనారాయణ, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, వెన్న అశోక్ కుమార్, గద్దల రామకృష్ణ, తాటి పూజిత తదితరులు పాల్గొన్నారు.

## కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదు

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు
- ఎస్పీ రోహిత్ రాజు




**నవతెలంగాణ-కొత్తగూడెం**

కేసుల విచారణలో జాప్యం వహిస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవా లన్నారు. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల్లో నగదును కోల్పోయి, బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేసినప్పుడు తక్షణమే స్పందించి వారికి అండగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ చంద్ర భాను, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**నవతెలంగాణ-కొత్తగూడెం**

మహిళలు ఆర్థికాభివృద్ధివైపు అడుగులు వేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా కోరారు. చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్‌లో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన వెలుగు కిరణం గ్రామా సమాఖ్య కార్యాలయాన్ని సోమవారం అయన ప్రారంభించి మాట్లాడారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి మురళి, నాయకులు, దాతలు వర్ధన్ రావు, శ్యామ్, కృష్ణ, కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- భయంతో పురుగుల మందు తాగిన బెల్టు షాప్ యజమాని
- ఫిర్యాదు ఆధారంగానే తనిఖీ చేశాం: టాస్క్ ఫోర్స్ సీఐ



**నవతెలంగాణ - బోనకల్**

ఓ బెల్ట్ షాప్ యజమానిపై టాస్క్ ఫోర్స్ అధికారులు సోమవారం రాత్రి ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ దాడుల భయంతో ఆ బెల్ట్ షాపు యజమాని పురుగుమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు టాస్క్ ఫోర్స్ అధికారులపై మండిపడ్డారు. ఎన్నో బెల్ట్ షాపులు ఉండగా ఆ ఒక్క బెల్ట్ షాపు పైనే ఎందుకు పదే పదే దాడులు చేస్తున్నారని గ్రామస్తులు టాస్క్‌ఫోర్స్ అధికారులను నిలదీసిన సంఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన నల్లమోతు నాగేశ్వరరావు గత కొన్ని సంవత్సరాలుగా కిరాణా షాప్‌తో పాటు బెల్టు షాపును కూడా నిర్వహిస్తున్నాడు. నల్లమోతు నాగేశ్వరరావుతో పాటు మరో పదికి పైగా బెల్టు షాపులు ఉన్నాయి. కానీ కేవలం నల్లమోతు నాగేశ్వరరావుపైనే మధిర ఎక్సైజ్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు పదేపదే దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సిఐ కరుణశ్రీ ఆధ్వర్యంలో నల్లమోతు నాగేశ్వరరావు బెల్ట్స్ షాపుపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడులలో కొన్ని బీరు సీసాలు లభించాయి. కరుణశ్రీ ఆధ్వర్యంలో నల్లమోతు నాగేశ్వరరావు ఇంట్లోనే వంటగదితో సహా ఇంటి మొత్తాన్ని తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు కరుణ శ్రీతో వాదనకు దిగారు. ఇంట్లో ఇష్టం వచ్చినట్లు తనిఖీలు చేస్తున్నారని, గ్రామంలో ఇంకా అనేక బెల్ట్స్ షాపులు ఉన్న తమపైనే కక్ష సాధింపు చర్యలకు ఎందుకు దిగుతున్నారని నిలదీశారు. ఒకవైపు టాస్క్ ఫోర్స్ అధికారులు ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా భయంతో నల్లమోతు నాగేశ్వరరావు ఇంట్లో గల గడ్డి మందు తాగాడు. ఆ వెంటనే ఇట్టి సమీపంలో నల్లమోతు నాగేశ్వరరావు కుప్పకూలి పడిపోయాడు. ఆ వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు కరుణ శ్రీ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై కక్షతోనే పదేపదే తన బెల్ట్ షాపుపై దాడులు చేస్తున్నారని నల్లమోతు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు తెలిపారు. వారంలో రెండు మూడుసార్లు మధిర ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నారని, కేవలం తమపైనే వేధింపులకు పాల్పడుతున్నారని కుటుంబ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు.

నాగేశ్వరరావు పురుగుమందు తాగటంతో దాదాపు గంట పాటు టాస్క్ ఫోర్స్ అధికారులకు, గ్రామస్తులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. నాగేశ్వరరావుని 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.

గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందితేనే తాము జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నల్లమోతు నాగేశ్వరరావు బెల్ట్ షాపుపై దాడులు చేసినట్లు టాస్క్ ఫోర్స్ సిఐ కరుణశ్రీ తెలిపారు. గ్రామంలో అనేక బెల్ట్ షాపులు ఉన్న కేవలం నల్లమోతు నాగేశ్వరరావు మీదనే తమకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. తమకు ఎవరి మీద వ్యక్తిగత కక్ష లేదని తెలిపారు. తాము తనిఖీ చేస్తుండగా కుటుంబ సభ్యులు, స్థానికులు తమ విధులకు ఆటంకం కలిగించారని తెలిపారు. బెల్ట్ షాపు యజమాని నల్లమోతు నాగేశ్వరరావు పురుగుమందు తాగిన మాట వాస్తవమే అన్నారు.

## మదూరి ప్రసాద్‌ను పరామర్శించిన మంత్రి తుమ్మల



**నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్**

ఖమ్మం పట్టణ 39వ డివిజన్ కార్పొరేటర్ మదూరి ప్రసాద్ ఇంటిలో కాలుజారి కింద పడటంతో విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. మంత్రి వెంట నగర మేయర్ పూనుకులు నీరజ, బత్తుల మురళి, బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- 29న మండల కేంద్రాలలో ధర్నాలను జయప్రదం చేయండి
- సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర రావు

**నవతెలంగాణ-ఖమ్మం**

సంక్షేమ పథకాలను అర్హులకు ఎంపిక చేసి అమలు చేయడంలో జరిగినటువంటి అవకతవకలను సరిచేసి, అర్హులైనటువంటి లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజమైనటువంటి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందకుండా సమగ్రమైనటువంటి సర్వే చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరాలు వెల్లడించడంలో కానీ, రేషన్ కార్డు లబ్ధిదారుల వివరాలు వెల్లడించడంలో ప్రభుత్వం నిజమైనటువంటి లబ్ధిదారులను విస్మరించిందన్నారు. కేవలం కొద్దిమంది పేర్లను మాత్రమే ప్రకటించి వారికి అందిస్తామని చెప్పడం సరైనటువంటిది కాదు అన్నారు. గత ప్రభుత్వం చేసినటువంటి తప్పులను ఈ ప్రభుత్వం పునరావృతం కాకుండా చూసుకోవాల్సింది పోయి వారు చేసినటువంటి విధంగానే వీరు కూడా అమలు చేసేటువంటి దుస్థితి నెలకొంది అన్నారు. తక్షణమే నిజమైనటువంటి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ ఈనెల 29వ తేదీన అన్ని మండల కేంద్రాలలో సిపిఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు సివై పుల్లయ్య, ఆవుల అశోక్, జి.రామయ్య, బందెల వెంకయ్య, జిల్లా నాయకులు టీ.ఝాన్సీ, ఆవుల మంగతాయి, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు - మన బడి బిల్లులు ఇప్పించండి

- అప్పులు చేసి పాఠశాలను అభివృద్ధి చేశా
- బిల్లులు రాకపోతే ఆత్మహత్యే శరణ్యం

**నవతెలంగాణ-బోనకల్**

'మన ఊరు - మనబడి కింద అప్పులు చేసి అప్పులు చేసి పాఠశాలను అభివృద్ధి చేశా. మూడు సంవత్సరాలైనా బిల్లులు రావడం లేదు. అప్పుల వారి నుంచి ఒత్తిడి ఎక్కువైతుంది. తనకు బిల్లులు రాకపోతే ఆత్మహత్య శరణ్యం' అంటూ ఓ వ్యక్తి మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బొబ్బిళ్ళపాటి రాజు తెలిపిన వివరాల ప్రకారం..
గత మూడు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమం చేపట్టి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా బోనకల్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను ఆయా పాఠశాలల చైర్మన్లు పాఠశాల అభివృద్ధి పనులు చేపట్టారు. అందులో భాగంగా పాఠశాల చైర్మన్‌గా బొబ్బిళ్ళపాటి రాజు అప్పులు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేశాడు. అభివృద్ధి పనులు పూర్తిచేసి మూడు సంవత్సరాలైనా బిల్లులు నేటికీ రాలేదు. అప్పుల వారి నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. అప్పులు తీసుకొచ్చి అభివద్ధి పనులు చేయటంతో వడ్డీని కూడా బాగా విపరీతంగా పెరిగిపోతున్నాయి. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేస్తే నాటి ప్రభుత్వం నేటికీ బిల్లులు ఇవ్వకపోతే నా పరిస్థితి ఏమిటంటే ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. తనకు బిల్లులు ఇప్పించకపోతే ఆత్మహత్య శరణ్యమని ప్రజావాణి అధికారుల దగ్గర వాపోయాడు. తాను పడుతున్న ఆర్థిక ఇబ్బందులను వినతిపత్రంపై రాసి సోమవారం ప్రజావాణి అధికారులకు సిపిఎం నాయకుడు తెల్లాకుల శ్రీనివాసరావుతో కలిసి అందజేశారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరిస్తామని మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య భరోసా ఇచ్చారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా కేలోత్ రాములు

**నవతెలంగాణ-కారేపల్లి**

కారేపల్లి మండలం లావుడ్యాతండా గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కేలోత్ రాములు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. భద్రాచలంలో జరిగిన గణతంత్రదినోత్సవంలో ఐటీడీఏ పీవో బీ.రాహుల్ చేతుల మీదిగా అవార్డును అందుకున్నారు. పాఠశాల వాతావరణం, విద్యార్థులకు క్రమశిక్షణ, నాణ్యమైన విద్య, ఐటీడీఏ పంపిణి చేసిన ఉద్దీపకము పుస్తకంను విద్యార్థులు చదవటం, రాయటంలో ముందుటం వంటి అంశాలపై ఆయనకు అవార్డు వరించింది. బెస్ట్ టీచర్‌గా ఎంపికైన రాములును వివిధ ఉపాధ్యాయ సంఘాలన నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

## గుండెపోటుతో సీపీఐ నేత మృతి

**నవతెలంగాణ-కారేపల్లి**

సీపీఐ నాయకులు కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండాకు చెందిన గుగులోత్ శంకర్‌నాయక్(56) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా బాబు సందర్శించి పార్టీ పతాకాన్ని ఉంచి నివాళ్లు అర్పించారు. సీపీఐ అభివృద్ధిలో చురుక ఉండి ప్రజాసమస్యలపై చైతన్యం చేసిన శంకర్‌నాయక్ మృతి తీరని లోటన్నారు. నివాళ్లు అర్పించిన వారిలో సీపీఐ నాయకులు ఇస్లావత్ బావ్‌సింగ్, గుగులోత్ మంగు, కేల్యా, వాంకుడోత్ హరిసింగ్, రావూజీ, ఏఐటీయుసీ నాయకులు ఇస్లావత్ దళ్‌సింగ్, గుగులోత్ చందా, రాంబాబు, మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ పాల్గొన్నారు.

## అమ్మపాలెంలో పారిశుధ్యం అస్తవ్యస్తం

పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి



**నవతెలంగాణ-వేంసూరు**

మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామపంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మురికి నీరు నిల్వ ఉండి కొన్ని రోజులుగా కంపు కొడుతున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి పక్కనే అంగన్వాడి సెంటర్‌లో చిన్న పిల్లలు ఉండటంతో అనారోగ్యాలకు గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ సిబ్బంది కనీసం మురికి నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదని ఆరోపిస్తున్నారు. నిత్యం ప్రజల వచ్చే పంచాయతీ కార్యాలయం ఎదుట ఈ విధంగా ఉన్నదంటే వీధులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ప్రతి చిన్నపనికి మండల కేంద్రానికి రావాల్సి వస్తుందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శిని అడిగేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

## నేర రహిత సమాజం కోసం కృషి : సీఐ

**నవతెలంగాణ-ముదిగొండ**

నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిఐ ఓ మురళి అన్నారు. ముదిగొండ పోలీస్ స్టేషన్లో మండల దుకాణదారుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేరాలు లేని సమాజం కోసం సిసి కెమెరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. గ్రామాల్లో నేరాలు నియంత్రణ,ప్రజలకు భద్రత కల్పించేందుకు సిసి కెమెరాలు ఎంతో అవసరమన్నారు.సమాజ భద్రత,రక్షణకు సిసి కెమెరాలతో 90% నేరాలు తగ్గించొచ్చున్నారు. సిసి కెమెరాల వల్ల నేరస్తుల్ని తొందరగా గుర్తించొచ్చున్నారు. ప్రతి దుకాణం ముందు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. సిసి కెమెరాల వల్ల జరిగే ప్రయోజనాలపై ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎస్సై డి అనంతరాములు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం ఆటోను అడ్డుకున్న గ్రామస్తులు

**నవతెలంగాణ-కారేపల్లి**

బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తున్న ఆటోను కారేపల్లి మండలం ఎర్రబోడు గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. ఎంఆర్పీ ధరకు మించి అమ్మకాలు చేస్తూ బెల్ట్ షాపులకు విచ్చవిడిగా మద్యం సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ ఎర్రబోడు గ్రామస్తులు తమ గ్రామంలోని బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేయటానికి వచ్చిన ఆటోను నిలిపివేసి నిరసన తెలిపారు. ఎక్సైజ్ అధికారులు రావాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఇండ్లలో వేడుకలు జరిగితే 10 సీసాలు మద్యం తీసుకవెళ్తితేనే పట్టుకోని కేసులు రాసే పోలీసు, ఎక్సైజ్ వారు ఎలాంటి అనుమతులు లేకుండా ఆటోలో వందలాది మద్యం సీసాలు తరలిస్తున్న పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సంఘటన స్థలానికి ఎస్సై ఎన్.రాజారాం చేరుకోని గ్రామస్తులతో చర్చించి ఆటోను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# నవచిత్రం

## 'కానిస్టేబుల్'గా వరుణ్ సందేశ్




వరుణ్ సందేశ్ హీరోగా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న చిత్రం 'కానిస్టేబుల్'. వరుణ్ సందేశ్‌కి జోడీగా మధులిక వారణాసి ఈ సినిమాతో పరిచయం కానున్నారు. ఈచిత్రంలోని 'కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా సమాజమే నీ సేవకు సలాం అంటుందన్న..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ రిలీజ్ చేశారు. శ్రీనివాస్ తేజ సాహిత్యాన్ని అందించగా, సుభాష్ ఆనంద్ సంగీతాన్ని సమకూర్చారు. నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ, 'నేను ఆవిష్కరించిన ఈ టైటిల్ సాంగ్ చాలా బావుంది. మా కానిస్టేబుల్స్ అంటే నాకు చాలా ఇష్టం. వాళ్ళ మీద ఈ సాంగ్ రావడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ప్రతీ పోలీస్ ఈ పాట వింటారు' అని అన్నారు.

'నాకు మంచి కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అని హీరో వరుణ్ సందేశ్ చెప్పారు. నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ, "కానిస్టేబుల్ కావడం నా చిన్ననాటి కల అది నెరవేరకపోవడంతో ఆ టైటిల్‌తో ఈ సినిమాను నిర్మించాను. కానిస్టేబుల్స్ మీద నాకున్న గౌరవంతో ఈ పాటను నేనే దగ్గర ఉండి రాయించి, నల్గొండ గద్దర్ నరసన్నతో పాడించాను' అని తెలిపారు.

దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె.మాట్లాడుతూ, 'మంచి కథ, కథనాలు, పాత్రలో వరుణ్ ఒదిగిపోయిన విధానం, నిర్మాత అభిరుచి ఈ చిత్రం అద్భుతంగా రావడానికి దోహదం చేసింది' అని అన్నారు.

## రవితేజ 'మాస్ జాతర'




రవితేజ హీరోగా నటిస్తున్న తన 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా రవితేజ పుట్టినరోజు సందర్భంగా ఈచిత్ర గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న మునుపటి అసలు సిసలైన మాస్ మహారాజా రవితేజను గుర్తు చేసేలా ఈ గ్లింప్స్ ఉంది. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనం లాంటి మాస్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోందని గ్లింప్స్‌ను చెప్పకనే చెప్పిందని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ-శ్రీలీల జోడి గతంలో 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. వీరి కలయికలో 'మాస్ జాతర' రూపంలో మరో బ్లాక్ బస్టర్ అందుకోవడం ఖాయమని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు.

ఈ చిత్రానికి రచన: భాను బోగవరపు, నందు సవిరిగాన, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కూర్పు: నవీన్ నూలి, ఛాయాగ్రహణం: విధు అయ్యన్న, కళా దర్శకత్వం: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె.వర్మ

## 'రాచరికం' రిలీజ్‌కి రెడీ



అప్సరా రాణి, విజయ్ శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'రాచరికం'. ఈశ్వర్ నిర్మాతగా చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై ఈ మూవీని నిర్మించారు. సురేశ్ లంకలపల్లి దర్శకుడు. ఈ మూవీని ఈనెల 31న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో విజయ్ శంకర్ మాట్లాడుతూ,'రాయలసీమ అంటే ఏంటో ఈ సినిమా చూపిస్తుంది. మ్యూజిక్ డైరెక్టర్ వెంగి ఇచ్చిన పాటలు, ఆర్ఆర్ ఇంకా మైండ్‌లోనే తిరుగుతున్నాయి. రామ్ ప్రసాద్ రాసిన డైలాగ్స్ గూస్ బంప్స్ తెప్పిస్తాయి' అని తెలిపారు.

'ఈ సినిమాలో నెగెటివ్ పాత్ర చేశాను. 'మైఖేల్' తరువాత మళ్లీ ఈ పాత్ర నన్ను ఎగ్జైట్ చేసింది. అందుకే ఈ సినిమాలో నటించాను. మ్యూజిక్ బాగుంది. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి' అని వరుణ్ సందేశ్ చెప్పారు.

దర్శకుడు సురేశ్ లంకలపల్లి మాట్లాడుతూ,'ఈ సినిమాకు నా టీమ్ ఎంతో సహకరించింది. మ్యూజిక్ డైరెక్టర్ వెంగి, డీఓపీ ఆర్య సాయి, రైటర్ రాం ప్రసాద్, వీఎఫ్ఎక్స్ చందు, ఎడిటర్ జేపీలకు ప్రత్యేకంగా థ్యాంక్స్. కెమెరా వర్క్ చాలా రిచ్‌గా ఉంటుంది. వంద కోట్లతో తీసిన సినిమాలా కనిపిస్తుంది. కథ రాసినప్పటి నుంచి ఈశ్వర్ నాతోపాటున్నారు. ఎవరి కోసమో ఎదురుచూడటం ఎందుకు మనమే నిర్మిద్దామని ఈశ్వర్ ముందుకు వచ్చారు' అని తెలిపారు.

'డైరెక్టర్ మారుతి ట్రైలర్ లాంచ్ చేయడంతో మా సినిమా ఎక్కువగా రీచ్ అయింది. శ్రీ విష్ణు 'మౌలా' పాటను, 'టిక్కు టిక్కు' పాటను రాహుల్ సంకృత్యాన్ రిలీజ్ చేశారు. నేను, సురేష్, చాణక్య కలిసి చేసిన ఈ సినిమాకు నా ఫ్రెండ్స్ అండగా నిలిచారు. ఈనెల 31న ఈ చిత్రం రాబోతోంది' అని నిర్మాత ఈశ్వర్ చెప్పారు.

# ఇక్కడే ముగిస్తారా?

- సిరీస్ విజయంపై సూర్యసేన గురి
- భారత్, ఇంగ్లాండ్ మూడో టీ20 నేడు

**రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**

**భయమెరుగని క్రికెట్‌తో దడ పుట్టిస్తోన్న టీమ్ ఇండియా సిరీస్ విజయంపై కన్నేసింది. స్పిన్ ఫోబియాలో విలవిల్లాడుతున్న ఇంగ్లాండ్ రాజ్‌కోట్‌లోనైనా మాయకు చెక్ పెట్టాలని భావిస్తోంది. బ్యాట్‌తో, బంతితో టీమ్ ఇండియా సూపర్ ఫామ్‌లో ఉండటంతో నేడు విజయమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. భారత్, ఇంగ్లాండ్ మూడో టీ20 నేడు.**

నవతెలంగాణ-రాజ్‌కోట్



17 మ్యాచులు. 15 విజయాలు, రెండే పరాజయాలు. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌లో టీమ్ ఇండియా జోరు ఇది. టీ20ల్లో అజేయ జట్టుగా ఎదుగుతున్న టీమ్ ఇండియా..వైవిధ్యభరిత మేళవింపుతో శత్రు దుర్భేద్యంగా మారుతోంది. జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్‌లు సైతం జట్టులోకి వస్తే... భారత టీ20 జట్టును ఎదుర్కొనే ఆలోచన సైతం ప్రత్యర్థుల గుండెల్లో గుబులు పుట్టించటం ఖాయం. భయమెరుగని ధనాధన్ క్రికెట్ ఆడుతున్న టీమ్ ఇండియా నేడు రాజ్‌కోట్‌లోనూ అదే ఫార్ములాతో బరిలోకి దిగుతోంది. 0-2తో సిరీస్‌ను చేజార్చుకునే ప్రమాదంలో పడిన ఇంగ్లాండ్.. సిరీస్‌లో ఆశలు సజీవంగా నిలుపుకునేందుకు అన్ని అస్త్రాలు సంధించేందుకు సిద్ధమవుతోంది.

**అదిరే బ్యాటింగ్ లైనప్**

టీమ్ ఇండియా బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ నిలకడగా భారీ స్కోర్లు సాధిస్తున్నారు. పవర్‌ప్లేలో అభిషేక్ శర్మ ఊచకోత నిలువరించటం ఇంగ్లాండ్‌కు తలనొప్పిగా మారింది. తొలి రెండు మ్యాచుల్లో కాస్త వెనకడుగు వేసిన సంజు శాంసన్.. రాజ్‌కోట్‌లో మెరుపు ఇన్నింగ్స్‌పై కన్నేశాడు. హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మ చెపాక్‌లో అసమాన ఇన్నింగ్స్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. సహచర బ్యాటర్లు అందరూ డగౌట్‌కు చేరుకున్నా.. టెయిలెండర్ల సాయంతో భారత్‌కు అలవోక విజయాన్ని అందించాడు. స్పిన్, పేస్‌ను తిలక్ వర్మ సునాయాసంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ప్రస్తుత జట్టులో సీనియర్లు. ఈ ఇద్దరు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. బంతితో హార్దిక్ మెరిసినా.. బ్యాట్‌తో తనదైన మెరుపులు బాకీ పడ్డాడు. ధ్రువ్ జురెల్ స్థానంలో నేడు రమణ్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వచ్చే అవకాశం లేకపోలేదు. తుది జట్టులో స్పిన్నర్లకు మరోసారి ప్రాధాన్యత దక్కనుంది. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ సహా రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తిలు ఆడనున్నారు. దీంతో ఇంగ్లాండ్ ఏకంగా 14-16 ఓవర్ల మాయజాలాన్ని ఎదురొడ్డి నిలవాల్సి ఉంటుంది. అర్షదీప్ సింగ్‌తో కలిసి హార్దిక్ పాండ్య పేస్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

**తుది జట్లు (అంచనా) :**

**భారత్ :** సంజు శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి.

**ఇంగ్లాండ్ :** ఫిల్ సాల్ట్, బెన్ డకెట్, బట్లర్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జేమీ స్మిత్, జెమీ ఓవర్టన్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్‌వుడ్.

## టీడీసీఏ క్రికెట్ టోర్నమెంట్ షురూ



**హైదరాబాద్ :** గ్రామీణ తెలంగాణలో ప్రతిభాంతులైన క్రీడాకారులకు కొదవ లేదని, సత్తా చాటేందుకు సరైన వేదిక కల్పిస్తే పల్లెల నుంచి ప్రపంచ చాంపియన్లను తయారు చేయగలమని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మెన్ కె. శివసేనా రెడ్డి అన్నారు. మాజీ మంత్రి సి. లక్ష్మారెడ్డి,మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి సోమవారం దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ గ్రౌండ్‌లో తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 క్రికెట్ టోర్నమెంట్‌ను శివసేనా రెడ్డి ప్రారంభించారు. అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణలో గ్రామీణ క్రికెటర్లకు సరైన అవకాశాలు లభించటం లేదు. తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివద్ధి కోసం బీసీసీఐ నుంచి గుర్తింపు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. మార్చిలో అమెరికా క్రికెట్ అకాడమీ జట్టు మన తెలంగాణ గ్రామీణ క్రికెటర్లతో పోటీపడేందుకు హైదరాబాద్‌కు రానుంది. గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు దక్కేందుకు టీడీసీఏ పోరాటం సాగుతుంది' అని అన్నారు. తొలి మ్యాచ్‌లో ఖమ్మంపై వరంగల్ గెలుపొందగా, రెండో మ్యాచ్‌లో కరీంనగర్‌పై నల్లగొండ విజయం సాధించింది.

## దేవరాజ్‌కు మేయర్ సన్మానం



**హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యదర్శి ఆర్. దేవరాజ్‌ను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి సోమవారం సన్మానించారు. 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టుకు దేవరాజ్ మేనేజర్‌గా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. ప్రతిష్టాత్మక ఐసీసీ ఈవెంట్‌లో టీమ్ ఇండియా జట్టు బాధ్యతలు చేపట్టనున్న దేవరాజ్‌ను విజయలక్ష్మి అభినందించారు. భారత జట్టు మేనేజర్‌గా హైదరాబాద్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## నాగోబా జాతర భక్తులకు సీఎం శుభాకాంక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగోబా జాతర సందర్భంగా భక్తులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మెస్రం వంశస్థుల ఆధ్వర్యంలో జరిగే జాతర అయిదు రోజుల పాటు వేడుకగా సాగుతుందనీ, భక్తులు నాగోబాను దర్శించుకొని ఆశీస్సులు అందుకోవాలని సీఎం ఆకాంక్షించారు. దేశంలోనే రెండో అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందిందని సీఎం గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## తెలంగాణ నీటి వాటాలను కాపాడండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం అవుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడంతో తెలంగాణ సాగునీటి ప్రయోజనాలు హరించబడతాయని అన్నారు. విభజన చట్టం ప్రకారం గోదావరి-కృష్ణా బోర్డుల అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, ఏపీ ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపట్టడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని లేఖలో వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు ఇప్పించడంతో పాటు రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరారు.


## పద్మ అవార్డుల్లో రాష్ట్రానికి అన్యాయం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పద్మ అవార్డుల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై వివక్ష చూపిస్తూనే ఉందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సిఫారసులను లెక్కచేయకుండా అవార్డులను ప్రకటించారని చెప్పారు. అన్ని రాష్ట్రాలకు ప్రాధాన్యతనిచ్చి తెలంగాణను విస్మరించారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా ఏం ప్రయోజనం? అని ప్రశ్నించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తు చేశారు.

## హాజరు నిబంధన ఎత్తేయాలి
## ఎంజీయూ విద్యార్థుల నిరసన



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అర్హత అన్న నిబంధనను ఎత్తేయాలంటూ సోమవారం నల్లగొండ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. 75శాతం హాజరు లేకపోవడంతో 105 మంది విద్యార్థులను పరీక్షలకు డిటెన్షన్ విధించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. డిటెన్షన్‌కు గురైన విద్యార్థులు పరీక్ష రాయడానికి అనుమతించాలని, ఫిబ్రవరి 8 నుంచి జరిగే పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని నిబంధన ఎంజి యూనివర్సిటీలో ఉందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పోస్టుల సంఖ్య పెంచాల్సిందే..

- రెండో ఏఎన్ఎంలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలి : సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి
- వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరేట్ ఎదుట రెండో ఏఎన్ఎంల ధర్నా

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి పోస్టులు పెంచాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోస్టులను పెంచడంతోపాటు పరీక్షకు అర్హత లేని రెండో ఏఎన్ఎంలకు రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కోరుతూ సోమవారం రెండో ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ కోఠిలోని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా వీరితో పని చేయించుకున్న ప్రభుత్వాలు చివరకు రిటైర్మెంట్ సమయంలో ఒట్టి చేతులతో ఇంటికి పంపించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. నూతన ఆర్థిక విధానాలతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వంటి పేర్లతో ఉద్యోగాలను సృష్టించి అరకోరా వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉద్యోగాన్ని వదులుకోలేక.. మరొకవైపు చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోలేక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2021లో పీఆర్సీ అమలులోకి వస్తే ఇప్పటివరకు బకాయిలు చెల్లించకపోవడం అధికారుల లోపమేనన్నారు. గత ప్రభుత్వ కాలంలో రెండో ఏఎన్ఎంలు తమను బేషరతుగా రెగ్యులర్ చేయాలని పోరాటం చేశారని, అది సాధ్యం కాదని అప్పటి ప్రభుత్వం తేల్చి చెప్పిన కారణంగా కనీసం 100 శాతం గ్రాస్ శాలరీనైనా ఇవ్వాలని తాము కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు గుర్తు చేశారు. ఆ తర్వాత కార్మిక నాయకులతో జరిగిన చర్చల్లో భాగంగా గ్రాస్ శాలరీ అమలు తీరు కోసం త్రిసభ్య కమిటీ వేశారని, కానీ ఇంతవరకు దాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి వీలైనంత త్వరగా సెకండ్ ఏఎన్ఎంలకు 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సాగే ఏ పోరాటానికైనా సీపీఐ మద్దతిస్తుందని తెలిపారు. పోస్టులు పెంచితే వీరు రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందని, ఎక్కడెక్కడ ఖాళీలున్నాయో గుర్తించి పోస్టులను పెంచి నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు పి.జయమ్మ, శీలం నాగ శేషమ్మ, సుమతి, గోపక్క, రాణి, సంధ్యారాణి, సరోజిని, సహాయ కార్యదర్శులు తస్నీరు సుల్తానా, రత్నకుమారి, రజిత, రాజేశ్వరి, స్కైలాబ్ రాణి పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

- మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం క్షేత్రంలో ఈ ఏడాది మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాలకు రూ. 25 కోట్లు మంజూరు చేసినందుగాను దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలకు లక్షలాదిగా భక్తులు వచ్చే పరిస్థితుల నేపథ్యంలో భక్తులకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు, స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం తదితర పనులను పకడ్బందీగా చేపట్టాలని మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్‌లను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనులు చేపట్టి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం 2013లో వచ్చిన సరస్వతీ నది పుష్కరాలను కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్వహించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో గతంలో కంటే మిన్నగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా, అత్యంత వైభవోపేతంగా సరస్వతీ నది పుష్కరాలను నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## పదకొండు జిల్లాలకు విస్తరణ

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్ మహానగరం అభివృద్ధి దృష్ట్యా మహానగర విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ మహానగర మాస్టర్ ప్లాన్ ఉండాలని భావించిన ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం 2030 వరకు ఉన్న మాస్టర్ ప్లాన్ నగర అభివృద్ధికి ఆటంకాలు కలిగిస్తున్నదని, అయితే భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలకు తావు ఇవ్వకుండా ఈ మాస్టర్ ప్లాన్ ఉండాలని 2050 వరకు నగర అభివృద్ధి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయనున్నట్టు అధికారులు తెలుపుతున్నారు. ఈ ఏడాది చివరాఖరిలో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయనున్నట్టు అధికారులు తెలుపుతున్నారు.

హెచ్ఎండీఏ ప్రస్తుతం 7,257 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. అయితే ప్రస్తుతం నగర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని దీన్ని విస్తరించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేటతో పాటు కొత్తగా నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్ పలు మండలాలను చేర్చనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 74 మండలాలు ఉండగా వాటి సంఖ్య వంద దాటనుంది. ఇలా మరో 4 జిల్లాలు, 32 మండలాలు హెచ్ఎండీఏలో చేరనున్నట్టు తెలుస్తోంది. విస్తరణతో పాటు పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం ఆరు జోన్లుగా ఉన్న హెచ్ఎండీఏను 10 జోన్లకు పెంచనున్నట్టు అధికారులు తెలుపుతున్నారు.




మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న నేటి దేశ పాలకులకు శ్రమన్నా, శ్రమ చేసే మహిళన్నా గౌరవం లేదు. మహిళా హక్కులు మానవ హక్కుల్లో భాగమనే విషయం మర్చిపోతున్నారు. కాదు మర్చిపోయినట్టు నటిస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులను హరిస్తుంది. దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై లైంగిక దాడులు, హింస బాగా పెరిగిపోయింది. మహిళలకు సమాన హక్కులు, శ్రమకు తగ్గ గుర్తింపు, సమాన పనికి సమాన వేతనం, చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలు... ఇవేవీ ప్రభుత్వాలకు పట్టడం లేదు. మహిళా కార్మికులు ఇటువంటి ఎన్నో సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. సీఐటీయూ జెండా నీడలో అనేక ఉద్యమాలు చేస్తున్నారు. వీరు చేస్తున్న పోరాటాలన్నింటికీ సీపీఐ(ఎం) అండగా నిలబడుతోంది. సంగారెడ్డిలో సీపీఐ(ఎం) నాల్గవ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో మహిళా కార్మికులు చేస్తున్న పోరాటాల గురించి శ్రామిక మహిళా కన్వీనర్ రమ మానవితో పంచుకున్నారు.



# ఆమె శ్రమకు విలువేది..?

మన దేశ జనాభాలో సగం మంది మహిళలలో అత్యధిక మంది సంరక్షణ, సేవా పనులు చేస్తున్నారు. ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీ, ఆషా, మధ్యాహ్న భోజన కార్మికులుగా సేవలు అందిస్తున్నారు. వీరంతా స్కీం వర్కర్లుగా ఉన్నారు. అయితే వీరందరినీ ప్రభుత్వం కార్మికులుగా గుర్తించడం లేదు. ఈ పథకాలను వ్యవస్థీకృతం చేసి విస్తృత అసంఘటిత రంగ మహిళలు, పిల్లలకు ఆరోగ్య, శిశు రక్షణా సౌక ర్యాలు కల్పించాల్సిందిపోయి కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంలకు నిధులను తగ్గించి, ప్రైవేటు వారికి అప్ప గించి క్రమంగా మూసేయాలని చూస్తోంది. ప్రస్తు తం కార్మిక వర్గం పరిస్థితే అధ్వాన్నంగా ఉంది. ఇక మహిళల స్థితి మరింత దారుణంగా వుంది.

## హక్కులను హరిస్తున్నారు

వేతనాలు, ప్రమోషన్లు, మెటర్నటీ బెనిఫిట్స్ మొదలైన వాటిల్లో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఇలా వాళ్ళకు రావల్సిన చట్టపరమైన హక్కులు ఏవీ అమలు కావడం లేదు. ఈ సమాజం ఎలాగైతే మహిళలను రెండవ తరగతి పౌరురాలిగా చూస్తుందో, ఎలాంటి సమస్యలైతే ఎదుర్కొంటున్నారో అవి పని చేసే చోట కూడా భరించాల్సి వస్తుంది. లైంగిక వేధింపులు, మౌళిక వసతుల లేమీతో ఇబ్బందులు పడుతున్నారు. దేశ వ్యాప్తంగా అనేక కుటుంబాలు మహిళలపై ఆధారపడి ఉన్నట్టు అనేక లెక్కలు చెబుతున్నాయి. అంటే మహిళలు ఒంటరిగా కుటుంబాల భారాన్ని మోయాల్సి వస్తుంది. గతంలోనూ మహిళా కార్మికులకు ఒరిగిందేమీ లేదు. అయితే మొన్నటి వరకు గుడ్డికంటే మెల్ల నయం అన్నట్టు ఉండేది. అయితే ఇప్పుడు బీజేపీ వచ్చిన తర్వాత కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొస్తూ ఉన్నపాటి హక్కులు కూడా లేకుండా చేస్తోంది. దీని ప్రభావం మహిళా కార్మికులపై తీవ్రంగా పడుతుంది.

## మహిళా కార్మికుల డిమాండ్స్

- మహిళల శ్రమకు తగిన గుర్తింపునివ్వాలి.
- మహిళలందరికీ పురుషులతో సమానంగా కనీస వేతనం చెల్లించాలి.
- మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, హింసను అరికట్టాలి.
- చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అసెంబ్లీ, పార్లమెంట్‌లో తక్షణమే అమలుచేయాలి.
- మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- పనిప్రదేశాల్లో అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలి.
- గృహహింస, కులదురంహాకర హత్యలకు వ్యతిరేకంగా చట్టం చేయాలి.
- 4 లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ చట్టం-2022ను వెంటనే ఉపసంహరించాలి.

## నిరంతర పోరాటాలు

కేంద్రం 29 కార్మిక చట్టాలను మార్పులు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తెస్తామంటుంది. వీటిని రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా ఉద్యమాలు జరుగు తున్నాయి. గత పదేండ్లుగా స్కీం వర్కర్లుగా ఉన్న శ్రామిక మహిళలను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. అలాగే పని ప్రదేశాల్లో అంతర్గ త ఫిర్యాదు కమిటీలు వేయాలని అడుగుతు న్నారు. వీటన్నింటిపై మహిళా కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటనపై ఉవ్వెత్తున ఎగిసిపడ్డారు. అలాగే కులదురహంకార హత్యలు, సామాజికంగా మహిళలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

## సీపీఐ(ఎం) అండతో...

కాంట్రాక్ట్ కార్మికుల్లో కూడా ప్రస్తుతం మహిళ సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. స్థిరంగా ఒక దగ్గర ఉంటారు, పని బాగా చేస్తారు, తక్కువ వేతనం ఇచ్చినా సరిపోతుంది అనే ఉద్దేశంతో మహిళలను ఎక్కువగా నియమించుకుంటున్నారు. దీని వల్ల మహిళలు తీవ్రమైన శ్రమదోపిడికి గురవుతున్నారు. వీరిని పర్మినెంట్ చేయాలని కూడా నిరంతరం ఉద్యమాలు చేస్తున్నారు. భవననిర్మాణ కార్మికుల్లో మగవారికి ఒక కూలీ, ఆడవాళ్లకు ఒక కూలీ ఉంటుంది. చివరకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ప్రమోషన్ల విషయంలో మహిళలకు అన్యాయం జరుగుతుంది. ఆశాలు, అంగన్‌వాడీలు ఇలా అందరూ తమ సమస్యలపై ఉద్యమాలు చేస్తున్నారు. వీటన్నింటిలో సీపీఐ(ఎం) అండగా నిలబడుతోంది. ఐకేపీ వీఏఓలు 84 రోజులు సమ్మె చేస్తే పార్టీ అండగా నిలబడి ఉద్యోగాలు వచ్చేలా చేసింది. రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ కోసం అంగన్‌వాడీ 20 రోజులు సమ్మె చేశారు, మధ్యాహ్న భోజన పథకం వారు 15 రోజులు సమ్మె చేశారు. దాదాపు అందరూ విజయం సాధించారు.ప్రభుత్వ నిర్భందాలు వచ్చినప్పుడు, సామాజిక అణచివేత జరిగినప్పుడు, ఆర్థిక ఉద్యమాలు జరిగినప్పుడు కార్మికులకు పార్టీ అండగా నిలబడింది. ■



## మా శ్రమను గౌరవించాలి



12 ఏండ్ల నుండి నేను ఆషా వర్కర్‌గా చేస్తున్నా. మాకు టార్గెట్లు ఉంటాయి. అవి చేస్తేనే పారితోషికం ఇస్తారు. నెలకు ఐదుగురు గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావాలి. ముగ్గు రిని తెచ్చినా డబ్బులు ఇవ్వారు. ముగ్గురు ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీ అవ్వాలి. ఇలా కేసును బట్టి మాకు డబ్బులు ఇస్తారు. కానీ నర్సుల మాదిరిగానే మేమూ ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు డ్యూటీ చేయాలి. ఉదయం ఏరియాలకు వెళ్ళాలి. మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్ళాలి. వారాంతపు సెలవులు ఉండవు. పండగలైనా పనిలో ఉండాల్సిందే. అంతేకాదు ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు పెట్టినా మాకు ప్రత్యేక డ్యూటీలు వేస్తారు. ఇలా మా శ్రమను దోచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్ళినా చార్జీలు మావే. మా శ్రమను గౌరవించాలి. ఫిక్సడ్ జీతం ఇవ్వాలి. దీనికి ఓ జీఓ ఇవ్వాలి. **- టి.యాదమ్మ,** దోమలగూడ

## శ్రమకు తగ్గ ఫలితం లేదు



గత 20 ఏండ్ల నుండి పేద, నిరుపేద మహిళలను సంఘటితం చేసి వాళ్ళను పొదుపు చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నాము. ఒక్కో గ్రూపులో పది నుండి 15 మంది సభ్యులు ఉంటారు. వాళ్ళకు నెలకు రెండు సమావేశాలు పెడతాము. బ్యాంకుల్లో లోన్లు తీసుకుని తిరిగి కట్టే విధంగా అవగాహన కల్పిస్తాం. ఇటీవల గ్రూపుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో జత చేయాలని చెప్పారు. కానీ దానికి సంబంధించిన సౌకర్యాలు మాత్రం ఇవ్వడం లేదు. ట్యాబ్ కొనే పరిస్థితి లేక చిన్న మొబైల్‌లోనే ఈ పనులన్నీ చేసుకుంటున్నాం. దీని వల్ల అనారోగ్య సమస్యలు వస్తు న్నాయి. ఇంత శ్రమ చేస్తున్నా వీఓఏలు చనిపోతే ఎలాంటి నష్టపరిహారం లేదు. ఈ మధ్య గ్రూపు పెట్టుకున్నప్పటి నుండి ఇప్పటి వరకు అన్నీ లెక్కలు ఇవ్వమంటున్నారు. అది కరెక్టుగా ఇవ్వక పోతే జీతం ఇవ్వరు. వాళ్ల టార్గెట్ల కోసం రాత్రీ పగలు లేకుండా ఫోన్లు చేసి పై అధికా రులు ఒత్తిడి చేస్తున్నారు. నోటికొచ్చిన బూతులు తిడుతుంటారు. ఇవన్నీ భరిస్తూ పని చేయాల్సి వస్తుంది. **- సుమలత,** నాగర్‌కర్నూల్ అధ్యక్షురాలు, ఐకేపీ వీఓఏ

---

# మెరుపులేని 'మిరప'

(మొదటిపేజి తరువాయి)

పెరుగుతున్నాయి. ప్రతి సీజన్‌లో కొత్త కొత్త తెగుళ్లు విస్తృతంగా సోకుతున్నాయి. గత రెండు, మూడేండ్లుగా తామర నల్లి వ్యాప్తి ఎక్కువగా ఉంటోంది. ఈ కారణంగా పెట్టుబడుల్లో గణనీయమైన పెరుగుదల ఉంది. దీనికితోడు కోత కూళ్లు కూడా అధికమవుతున్నాయి. ఎకరం మిర్చి సాగుకు దున్నుడు, కలుపుతీత, ఎరువులు, క్రిమిసంహారక మందులు, రైతు, కుటుంబసభ్యులు, పాలేర్ల శ్రమకాకుండా రూ.1.50 లక్షల వ్యయం అవుతుంది. ఒక్కో ఎకరానికి పంట బాగా వస్తే 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మిర్చి కోతకు కేజీకి రూ.10 చొప్పున కూలి చెల్లిస్తున్నారు. ఏరిన మిర్చిని ఆరబోస్తే మూడు కేజీలకు ఒక్క కేజీ మాత్రమే బరువు తూగుతుంది. మిర్చిలో తాలు కాయలు ఏరినందుకు క్వింటాకు రూ.వెయ్యి ఖర్చు వస్తుంది. మొత్తంగా ఎకరానికి కోత కూళ్లు రూ.1లక్ష వరకు వస్తున్నాయి. ఇలా చూస్తే అటు పంట పెట్టుబడులు, ఇటు కోత కూళ్లు కలిపి ఎకరానికి రూ.2.50 లక్షల ఖర్చు వస్తుంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వేసుకుంటే క్వింటాకు రూ.10వేల చొప్పున పంట పెట్టుబడులకే పోతాయి. మనుషుల శ్రమ, పాలేర్ల జీతం ఇవన్నీ కలిపితే ప్రస్తుత ధరల్లో రైతుకు ఒక్క రూపాయి కూడా లాభం ఉండే పరిస్థితి లేదు.

### పెట్టుబడులూ వచ్చేలా లేవు

**గంట్ల శ్రీధర్‌రెడ్డి, రైతు, గుండెపూడి, మహబూబాబాద్ జిల్లా**

ఈ ఏడాది మిర్చి పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా పూడేలా లేవు. ఎకరానికి రూ.2.50 లక్షల ఖర్చు వస్తుంది. రూ.20వేలకు పైన ధర ఉంటే ఎంతోకొంత మిగులుతుంది. కానీ ప్రస్తుతం రూ.15వేలలోపు మాత్రమే ధరలున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ఏడాది మిర్చి రైతులు భారీ నష్టాలను చవిచూడక తప్పదు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం. ఎకరానికి రూ.20వేల కౌలు చెల్లిస్తే మిగిలేది ఏమీ ఉండదు. మిర్చికి సరైన మద్దతు ధరలు కల్పించి రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

# హలో ట్రంప్‌జీ..

**న్యూఢిల్లీ:** అమెరికా నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోడీ ఫోన్ కాల్‌లో మాట్లాడారు. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరునేతల మధ్య ఇదే తొలి ఫోన్ సంభాషణ. ట్రంప్- మోడీ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించినట్టు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధించిన సందర్భంగా గతంలో ఆయనకు ప్రధాని మోడీ ఫోన్ కాల్‌లో అభినందనలు తెలియజేశారు. ఆ తర్వాత ఆయన అధ్యక్ష బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు.

వీటిలో అమెరికాలో జన్మత్ణ పౌరసత్వం లభించే హక్కును రద్దు చేస్తూ సంబంధిత పత్రాలపై సంతకాలు చేశారు. "అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే జన్మత్ణ పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదు" అని ట్రంప్ స్పష్టం చేశారు. దీంతో అక్కడ నివసిస్తున్న భారతీయులకు జన్మించే సంతానంపై దీని ప్రభావం ఉంటుందని నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అయితే.. న్యాయపరమైన వలసలకే తాము పూర్తి మద్దతు ఇస్తామని ఇటీవల భారత విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది. సరైన పత్రాలు లేకుండా వలస వెళ్లే భారతీయులను చట్టబద్ధంగా తిరిగి స్వదేశానికి రప్పించేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొంది. మరోవైపు, వీసా తీసుకునేందుకు 400 రోజులు ఎదురుచూడటం అనేది కీలకమైనదే. ఇది ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపడంతో పాటు.. వీసా ఆలస్యాల వల్ల వాణిజ్యం, పర్యటక రంగం, ద్వైపాక్షిక ప్రయోజనాలూ దెబ్బతింటాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇరుదేశాధినేతలు మాట్లాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## 4.41 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా

(మొదటిపేజి తరువాయి)

కుటుంబ సభ్యులను నమోదు చేసింది. వచ్చే నెల నుంచి వీరికి రేషన్ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయనుంది. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 72 వేల మంది పేదలకు ఇండ్ల పత్రాలను అందించిందని ప్రభుత్వం ప్రకటించింది. ఇదే విషయాన్ని మంత్రి సీతక్క మరో ప్రకటనలో తెలిపారు.

# రూ.9 లక్షల కోట్ల సంపద ఫట్

**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్లపై క్రమంగా విశ్వాసం సన్నగిల్లుతోంది. ఇటీవలి కాలంలో ఇన్వెస్టర్లు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారు. సోమవారం సెషన్‌లో కుప్పకూలిన మార్కెట్లతో ఒక్క పూటలోనే మదుపర్ల సంపద రూ.9 లక్షల కోట్లు పైగా హరించుకుపోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 900 పాయింట్లు పైగా కోల్పోగా.. నిఫ్టీ 23వేల దిగువకు పడిపోయింది. బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 824 పాయింట్లు లేదా 1.08 శాతం పతనంతో 75,366కు దిగజారింది. అదే బాటలో ఎన్ఎస్ఇ నిఫ్టీ 263 పాయింట్లు లేదా 1.14 శాతం నష్టంతో 22,829 వద్ద ముగిసింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.9.43 లక్షల కోట్లు తుడుచుకు పెట్టుకుపోయి రూ.410.08 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. దీంతో అమ్మకాల ఒత్తిడితో వరుసగా రెండో సెషన్‌లోనూ దలాల్ స్ట్రీట్ పతనాన్ని చవి చూసినట్లయ్యింది. దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టాల్లో ముగిశాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 3 శాతం, స్మాల్ క్యాప్ 4 శాతం చొప్పున నష్టపోయాయి.

### ప్రతికూలాంశాలు..

అమెరికా వాణిజ్య విధానంపై అనిశ్చితి వంటి కారణాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థలో బలహీన సంకేతాలు మదుపర్లను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో జిడిపి 5.4 శాతానికి పరిమితమై.. దాదాపు రెండేండ్ల కనిష్టానికి పడిపోయింది. డిసెంబర్ త్రైమాసికంలో అదే పరిస్థితి చోటు చేసుకోవచ్చనే భయాలు ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. ఇదే సమయంలో కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు అంచనాలను చేరకపోవడం వృద్ధి ప్రతికూలతలపై మరింత బలాన్ని చేకూర్చుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు తమ భారత ఈక్విటీలను వరుసగా విక్రయిస్తున్నారు. జనవరి 24 నాటికి రూ.64,156 కోట్లు విలువ చేసే షేర్లను ఉపసంహరించుకున్నారు.

# డాలర్ దెబ్బ..రూపాయి విలవిల

## 11 పైసలు కోల్పోయి రూ.86.33 కనిష్టానికి

**ముంబయి :** ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువ వెలవెల పోతోంది. భారత స్టాక్ మార్కెట్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడికి తోడు విదేశీ మారకం నిల్వలు కరిగిపోవడంతో సోమవారం అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలర్‌తో రూపాయి విలువ 11 పైసలు పతనమై డాలర్‌తో 86.33 కనిష్ఠ స్థాయికి దిగజారింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య టారీఫ్ భయాలు రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో 86.35 వద్ద తెరుచుకున్న రూపాయి విలువ.. ఇంట్రాడేలో ఏకంగా 86.45 కనిష్ఠ స్థాయిని తాకింది. శుక్రవారం సెషన్‌లోనూ రూపాయి విలువ 22 పైసలు పతనమయ్యింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఇతర దేశీయ బలహీన సూక్ష్మ ఆర్థికాంశాలు రూపాయి విలువను ఒత్తిడికి గురి చేస్తున్నాయి. గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 0.19 శాతం పెరిగి 78.65 డాలర్లకు చేరింది. ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడానికి తోడు భారత విదేశీ మారకం నిల్వలు జనవరి 17తో ముగిసిన వారంలో 1.88 బిలియన్ డాలర్లు తరిగి 623.983 బిలియన్ డాలర్లకు పడిపోవడం భారత కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపింది. రూపాయి పతన పరిస్థితి ఇలాగే కొనసాగితే దిగుమతి ఉత్పత్తులు మరింత ప్రియం కావడంతో పాటు విదేశీ అప్పు చెల్లింపులు భారం కానున్నాయి. దీంతో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడనుంది.

# వేరుశనగ రైతుల ఆగ్రహం

**నవతెలంగాణ -అచ్చంపేట**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ రైతుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కలిసి దోచుకుంటున్నారని, తక్కువ ధరకు పంట కొనుగోలు చేస్తున్నారంటూ ఆందోళన చేశారు. మార్కెట్ చైర్మెన్, అధికారులు వ్యాపారులకు సహకరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయంలోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ నర్సింహులు, చైర్‌పర్సన్ భర్త మల్లేష్‌తో వాగ్వాదం.. తోపులాట జరిగింది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ రజిత భర్త చొక్కా చినిగిపోయింది. క్వింటాల్ వేరుశనగ పంటకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7200 ధర ఉండగా.. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై రూ.4500 నుంచి 6500 మాత్రమే ధర పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టం చేసి పంట పండిస్తే దోచుకుంటున్నారని, వేరుశనగ పంట విత్తనాలు క్వింటాకు రూ.14వేలు కొని సాగు చేస్తే.. పంటకు రూ.4 వేలు, 5వేలు ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్, సిబ్బందితో కలిసి మార్కెట్‌కు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులను కార్యాలయం నుంచి బయటకు పంపించి తాళం వేశారు. రైతులు ఆవేశాలకు పోయి నష్టపోవద్దని సూచించారు. దాంతో రైతులు అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించారు.

# సరిహద్దుల వద్ద జనసంద్రం

(మొదటిపేజి తరువాయి)

పంపివేయడం ద్వారా గాజాను ప్రక్షాళన చేయాలన్న ట్రంప్ ప్రతిపాదనను పాలస్తీనియన్లు తీవ్రంగా ఖండించారు. యుఎన్ఆర్‌డబ్ల్యుఎ కార్యకలాపాలపై విధించిన నిషేధాన్ని ఇజ్రాయిల్ అమలు చేసినట్లైతే గాజాలో సహాయక చర్యలు పూర్తి స్థాయిలో చేపట్టడం కష్టమని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ డైరెక్టర్ రోస్ వ్యాఖ్యానించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని నూర్ షామస్ శిబిరంపై జరిగిన దాడిలో ఇద్దరు మరణించగా ముగ్గురు గాయపడ్డారు. దక్షిణ లెబనాన్‌పై ఆదివారం ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. 12మంది చిన్నారులతో సహా 134మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

# ఉపాధికి నిధుల కొరత

**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీవ్రమైన నిధుల కొరత వెంటాడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి ఎలాంటి అదనపు కేటాయింపులు జరపలేదు. ఫలితంగా కార్మికులకు వేతనాల చెల్లింపులో అసాధారణ జాప్యం జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఈ పథకం కింద వేతనాల కోసం రూ.4,315 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అందుకోసం నిధుల బదిలీ ఆదేశాలు (ఎఫ్‌టీఓ) జారీ చేశారు. ఉపాధి హామీ చట్టంలోని సెక్షన్ 3 (3) ప్రకారం దినసరి వేతనాలను వారానికి ఒకసారి చొప్పున అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఆలస్యమైనా పని పూర్తయిన తర్వాత పక్షం రోజులు దాటకూడదు. ఉపాధి పథకానికి మెటీరియల్ రూపంలో కేంద్రం తన వాటాగా రూ.5,715 కోట్లు బకాయి పడింది. పథకం పనుల కోసం ఉపయోగించే సామగ్రి కొనుగోలుకు అయ్యే వ్యయంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించాల్సి ఉంటుంది. కేంద్రం తన వాటాను విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా భవిష్యత్ ప్రాజెక్టులపై ప్రభావం పడుతోంది. మెటీరియల్ ఖర్చును చెల్లించడంలో జరుగుతున్న నిరంతర జాప్యం ఫలితంగా ముడి సరుకును సరఫరా చేసే స్థానిక వ్యాపారులు విముఖత చూపుతున్నారు. దీంతో పనులకు అంతరాయం ఏర్పడుతోంది. 2024 మధ్యంతర బడ్జెట్‌లో ఉపాధి పథకానికి ప్రభుత్వం రూ.86,000 కోట్లు కేటాయించింది. లోటు కన్పిస్తున్నప్పటికీ ఆర్థిక మంత్రిత్వ శాఖ బడ్జెట్‌ను సవరించలేదు. గ్రామీణాభివృద్ధి శాఖ నుండి పలు విజ్ఞాపనలు వచ్చినప్పటికీ ఆర్థిక శాఖ పట్టించుకోలేదు. పథకానికి తక్కువ నిధులు కేటాయించడంపై గత సంవత్సరం విమర్శలు చెలరేగడంతో ప్రభుత్వం స్పందిస్తూ ఇది డిమాండ్‌ను బట్టి నడిచే పథకమని, అవసరమైనప్పుడు అదనపు కేటాయింపులు జరుపుతామని తెలిపింది. ఉదాహరణకు 2020-21 ఆర్థిక సంవత్సరంలో...అంటే కోవిడ్ సమయంలో కార్మికులు పెద్ద సంఖ్యలో నగరాల నుండి స్వస్థలాల బాట పట్టారు. ఆ సమయంలో ప్రభుత్వం పథకానికి కేటాయింపును రూ.61,500 కోట్ల నుండి రూ.1,11,500 కోట్లకు పెంచింది. ఇప్పటి వరకూ ఉపాధి పథకానికి ఇంత పెద్ద ఎత్తున నిధుల కేటాయింపును పెంచిన దాఖలాలు లేవు.బడ్జెటరీ కేటాయింపులు తక్కువగా ఉండడంతో కృత్రిమంగా డిమాండ్ తగ్గుతోందని పథకాన్ని నిశితంగా పరిశీలిస్తున్న నిపుణులు, హక్కుల కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

# సూర్యాపేటలో కులదురహంకార హత్య ?

(మొదటిపేజి తరువాయి)


ఫైల్

నవీన్ ఇంటికి వస్తూ పోతుండేవాడు. ఈ క్రమంలో నవీన్ సోదరి భార్గవిని కృష్ణ ప్రేమించాడు. తమ ప్రేమ విషయాన్ని ఇంట్లో చెప్పగా.. కులాలు వేరు కావడంతో వీరి ప్రేమను భార్గవి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఆరు నెలల కిందట వివాహం చేసుకున్న భార్గవి, కృష్ణ మామిళ్లగడ్డలో కాపురం పెట్టారు. ప్రేమ పెండ్లిని నిరాకరించిన భార్గవి తల్లిదండ్రులు వారిని విడదీసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కృష్ణ(బంటి)పై భార్గవి సోదరుడు నవీన్ కక్ష పెంచుకున్నాడు. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో మహేష్ అనే మిత్రుడి నుంచి కృష్ణకు ఫోన్ కాల్ వచ్చింది. భార్యకు ఫోన్ ఇచ్చి కృష్ణ బయటకు వెళ్లాడు. రాత్రి ఆలస్యం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో భార్గవి మహేష్‌కు పలుమార్లు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికి చూశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. రాత్రి అంతా తెలిసిన వారికి ఫోన్లు చేసి విష యం చెప్పింది. కాగా సోమవారం ఉదయం జనగాం క్రాస్ రోడ్ నుంచి పిల్లల మర్రికి వెళ్లే మూసీ కెనాల్ కట్టపై కృష్ణ మృతదేహాన్ని స్థానికులు చూసి అతని బంధువులకు చెప్పారు. వారు పోలీసులకు తెలియజేయగా.. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మెడకు ఉరి బిగించి చంపినట్టు ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. కృష్ణ ముఖంపై, శరీరంపై గాయాలున్నాయి. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఘటనా స్థలానికి డీఎస్పీ రవి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. భార్గవి సోదరుడు కోట్ల నవీన్‌ను పోలీసులు అనుమాని స్తున్నా రు. మరోవైపు మృతుడు కృష్ణ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా, భర్త హత్యకు తన అన్నతోపాటు మహేష్ కారణమై ఉంటాడని భార్గవి ఆరోపించింది. ఇందులో తన కుటుంబం పాత్ర కూడా ఉండి ఉంటుందని కన్నీరు పెట్టుకుంది. ఈ క్రమంలో ఇప్పటికే నవీన్ పోలీసు ల ఎదుట లొంగిపోయినట్టు తెలిసింది. అయితే, ఈ హత్యకు ప్రేమ వివాహ మే కారణమా? పాతకక్షలు కారణమా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి డేవిడ్ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ బాలనాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కాళేశ్వరంపై బీఆర్ఎస్‌వి తప్పుడు వాదనలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసిందని విద్యుత్ జేఏసీ నేత కే రఘు అన్నారు. సోమవారం కాళేశ్వరం కమిషన్ చైర్మెన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సెంట్రల్ వాటర్ కమిషన్ ఎప్పుడూ చెప్పలేదు. గోదావరి వాటర్ డిస్ట్రిబ్యూట్ ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పు ప్రకారం పైరాష్ట్రాలు నీటిని వాడుకున్న తర్వాత 165 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని స్పష్టంగా చెప్పింది. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన ఐదేండ్లలో ఏ సంవత్సరం కూడా 50 టీఎంసీలకు మించి నీరు ఎత్తిపోయలేదు. మహారాష్ట్ర ఒప్పుకున్న 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి నీటిని తరలించవచ్చు. తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 4 మీటర్లు అదనంగా నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. కాని కాళేశ్వరం నుంచి మూడు దశల్లో 123 మీటర్లు ఎత్తి పోస్తున్నారు. ఫలితంగా రూ.100 కోట్లు కావాల్సిన విద్యుత్ బిల్లులు వేల కోట్లకు చేరుకున్నాయి" అని రఘు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు లిఖిత పూర్వకంగా ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన నేపథ్యంలో దాన్ని తక్కువ ఖర్చుతో మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నించాలని అన్నారు. అదే సందర్భంలో తుమ్మిడి హెట్టి వద్ద ప్రత్యామ్నాయ ప్రాజెక్ట్ నిర్మించాలని సూచించారు.

# ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పరిష్కరించాలని డిమాండ్ : సీపీఐ(ఎం) మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదం

సంగారెడ్డి నుంచి అచ్చిన ప్రశాంత్




రాష్ట్రంలోని పేదలు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, కార్మికులు, కర్షకుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. వాటిపట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టింది. కార్పొరేట్లు, బడాబాబుల ప్రయోజనాలను కాపాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోని బీజేపీ, కాంగ్రెస్ విధానాలను తూర్పారబట్టింది. ఈ మేరకు సంగారెడ్డిలోని సీతారాంఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో కొనసాగుతున్న పార్టీ ప్రతినిధుల సభలో నేతలు పలు తీర్మానాలను ప్రతిపాదించారు. వాటిని బలపరుస్తూ నాయకులు మాట్లాడారు. అనంతరం మహాసభ వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తీర్మానాలు ఇవే..

### ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు

రాష్ట్రంలో ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలనీ, కూలీలకు రోజువారీ కూలిని రూ.600కి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఉపాధికూలీలకు ఆధార్ బేస్డ్ పేమెంట్ విధానం రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రతినిధుల సభలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. రాష్ట్ర నాయకులు పెద్ది వెంకట్రాములు బలపర్చారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ..వామపక్షాల ఒత్తిడితో యూపీఏ-1 ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అలాంటి చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేస్తున్నదనీ, ఏటేటా నిధులు తగ్గిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనులను 150 రోజులకు పెంచుతామనీ, రూ.400కు వేతనాన్ని పెంచుతామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా అమల్లోకి తేలేదని విమర్శించారు. మున్సిపాల్టీల్లో చుట్టుపక్కల గ్రామాలను విలీనం చేయడం వల్ల పేదలు ఉపాధి పనులకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ పనులను విస్తరించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని రద్దు చేయాలనీ, ఆధార్ ఆధారంగా వేతనాలు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు పెంచాలని కోరారు.

### మూసీలో గోదావరి నీళ్లను పారించాలి..పేదల ఇండ్ల జోలికెళ్లొద్దు : సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ.జహంగీర్

మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చొద్దనీ, మూసీ నదిలో గోదావరి నీళ్లను పారించాలని సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎమ్‌డీ జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానాన్ని ప్రతిపాదించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్ బలపరిచారు. జహంగీర్ మాట్లాడుతూ..'మూసీ సుందరీకరణ పేరుతో ఇప్పటికే 300 ఇండ్లను తీసేశారు. వారి ఇండ్ల వల్ల మూసీ ప్రవాహానికి ఎలాంటి అడ్డంకి లేదు. పేదల జోలికి వెళ్లొద్దు. హైదరాబాద్‌లో పేదలకు అన్యాయం జరుగకుండా..ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు మూసీ మురికి నీళ్లను దూరం చేసేలా ప్రణాళికలు రూపొందించాలి. కంపెనీల రసాయన వ్యర్థాలను మూసీలో కలుపకుండా చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి. గోదావరి నీళ్లను మూసీలో పారించాలి. దాని వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులకు మేలు చేసినట్టు అవుతుంది...' అని ప్రతిపాదించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛమైన మూసీని కోరుకుంటున్నామన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో రియల్టర్లకు భూములను కట్టబెట్టే యత్నాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. వేలాది ఇండ్లను తొలగించాలనే నిర్ణయాన్ని తప్పుబట్టారు. మూసీ ప్రవాహానికి అడ్డంగా ఉన్న ఇండ్లను తొలగించడానికి తమకు అభ్యంతరం లేదన్నారు. అయితే, నిర్వాసితులకు కోరుకున్న పద్ధతిలో పరిహారమిచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ.సాగర్

పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నాలుగో మహాసభలో ఆయన ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీన్ని రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బలపరిచారు. ఈ సందర్భంగా టి.సాగర్ మాట్లాడుతూ...పంటలకు కనీస మద్దతు ధరల నిర్ణయం రాష్ట్రాల జాబితాలో ఉందని గుర్తుచేశారు. ఆ మేరకు ధరల నిర్ణయాక సంఘాన్ని ఏర్పాటు చేసి ఉత్పత్తి ఖర్చుల వివరాలను సేకరించి దానికి 50 శాతం కలిపి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల చట్టాన్ని శాస్త్రీయంగా రూపొందించాలంటూ 2020 నుంచి దేశవ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నారని చెప్పారు. దీనిపై మోడీ హామీనిచ్చి ఏడాది గడుస్తున్నా ఆ చట్టాన్ని ఆమోదించకపోవగా పరోక్షంగా అశాస్త్రీయ పద్ధతిలో ధరలను నిర్ణయించి రైతులకు ఏటా రూ.5 లక్షల కోట్ల మేర నష్టాన్ని కలిగిస్తున్నారని వాపోయారు. తద్వారా కార్పొరేట్లకు లాభాలు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మూడో వంతు వ్యవసాయాన్ని 20 లక్షల మంది కౌలు రైతులు సాగు చేస్తున్నారని గుర్తుచేశారు. వారిని పాలకులు సాగుదారులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. కేంద్రం నిటి అయోగ్ ద్వారా రాష్ట్రాలకు కౌలు చట్టాలు చేయాలని నమూనా చట్టాన్ని పంపిందని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఆ ప్రకారం కౌలుదారుల పేర్లు నమోదు చేస్తున్నప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో కౌలు రైతులను గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా కౌలుదారీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### పేదలకు ఇంటిస్థలాలు కేటాయించాలి.. నిర్మాణానికి రూ.15 లక్షలివ్వాలి : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

పేదలకు ఇండ్ల స్థలాలను కేటాయించాలనీ, ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానాన్ని ప్రతిపాదించారు. పార్టీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి బలపరిచారు. ఈ సందర్భంగా జి.నాగయ్య మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని ప్రజలకు మోసం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని చెప్పి ఏడాది దాటిపోయిందన్నారు. ఇప్పటివరకూ మూడు సార్లు దరఖాస్తులు స్వీకరించి నేటికీ ఇవ్వలేదన్నారు. మొదట ఇంటి స్థలం ఉన్నవారి ప్రాధాన్యత ఇస్తామని చెప్పగా అది ఆచరణలో పట్టాలెక్కలేదన్నారు. రాష్ట్రంలో 2.24 లక్షల ఇండ్లను ప్రధానమంత్రి ఆవాసయోజన పథకం కింద ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదనీ, క్షేత్రస్థాయిలో ఎక్కడ పంపిణీ చేసిందనేది స్పష్టత లేదని చెప్పారు. మధ్యదళారులు, బ్రోకర్ల వల్ల లబ్దిదారులు నష్టపోతున్నారన్నారు. ఇంటిస్థలం లేనివారికి 120 గజాల జాగా ఇవ్వాలనీ, ఇంటినిర్మాణానికి రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల కేటాయింపులో మంత్రులు, ఎమ్మెల్యేల జోక్యాన్ని తొలగించి.. అఖిలపక్షం కమిటీల ఆధ్వర్యంలో లబ్దిదారులను ఎంపికచేయాలని సూచించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నవారిపై కేసులు ఎత్తివేయాలనీ, అర్హులకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇండ్ల నిర్మాణ పథకాలను ఒకే గొడుగు కిందకు తేవాలని కోరారు.

### కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నిర్ణయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మల్లికార్జున్ బలపరిచారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు సెక్టార్‌లో సుమారు 2 కోట్ల మంది పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు లేక వారందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గత కాలంలో సగటున ఏడాదికి ద్రవ్యోల్బణం ఆరు శాతంగా ఉందనీ, ఆహార ద్రవ్యోల్బణం 8.3 శాతంగా ఉందనీ, ధరలు 200 శాతం పెరిగాయని గుర్తుచేశారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడం వల్ల ఆహార ఖర్చు భారీగా పెరిగిందని వివరించారు. అయితే, ధరల పెరుగుదలకు వేతనాలు పెరగకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు అర్ధాకలితో జీవిస్తున్నాయని వాపోయారు. రాష్ట్రంలో కనీస వేతనాలు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకే ఉన్నాయని తెలిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం 2018లో ఫ్లోర్‌లెవల్ మినిమమ్ వేజ్ రూ.178 చొప్పున నెలకు రూ.4,628 ఉంటే సరిపోతుందని కంపెనీలకు ఆయుధాన్ని ఇచ్చిందన్నారు. రాష్ట్రంలోని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాల జీవోలను విడుదల చేయాలనీ, పెరిగిన ధరలు, ఖర్చులకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### మహిళలపై దాడులు, నేరాలను అరికట్టాలి
**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.జ్యోతి**

దేశంలో, రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను, నేరాలను అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రతినిధుల సభలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని సీనియర్ నాయకులు పి.సోమయ్య బలపర్చారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ..2014లో మహిళలపై 14,417 నేరాలు జరగ్గా..బీఆర్ఎస్ పాలనలో 20 వేలకు పెరిగాయనీ, 2022లో అయితే 22066 దాడులు జరిగాయని ప్రభుత్వ నివేదికలే చెప్పాయని ఆందోళన వెలిబుచ్చారు. హైదరాబాద్‌లో ఏటా 3,500 మంది మహిళలు, అమ్మాయిల విక్రయాలు జరుగుతున్నాయంటే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చునన్నారు. కేంద్రస్థాయిలో 1023 మహిళా కోర్టులు ఏర్పాటు చేయగా అందులో 754 మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. 2023 నాటికి 52 శాతం కేసులే పరిష్కారం అయ్యాయన్నారు. రిజిస్టర్డ్ కేసులు పరిష్కారం కావాలంటే మరో ఐదేండ్లు పడుతుందని ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ సంస్థ తెలిపిందని గుర్తుచేశారు. మహిళలపై దాడులు అరికట్టడానికి మహిళాసంఘాలు, అన్ని పార్టీలతో అఖిల సమావేశాలు నిర్వహించాలనీ, అందులో వచ్చిన సూచనల ఆధారంగా భవిష్యత్‌లో నేరాలు జరుగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న నేరాలను నిర్ణీత కాలవ్యవధిలో విచారించాలనీ, పనిప్రదేశాలు, కాలేజీలలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. సినిమాలు, సీరియళ్లలో మహిళలపై అశ్లీల చిత్రీకరణ ఆపాలనీ, పోర్న్‌సైట్లను నిషేధించాలని డిమాండ్ చేశారు. బెల్టు షాపులను మూసేయించాలనీ, గుడుంబా విక్రయాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. అన్నిచోట్లా వీధిలైట్లను ఏర్పాటు చేయించి విస్తృతంగా పెట్రోలింగ్ చేయించాలని డిమాండ్ చేశారు.

---



## ఎర్రజెండా...

**ఎర్రజెండా ఎక్కడిప్పుడు**
**కాషాయ కసాయి మూకల**
**వెక్కిరింపు ఇది**

ఎర్రజెండే లేకపాయే
కమ్యూనిజం కలేనాయే
కాలం చెల్లిన సిద్ధాంతమేనాయే
మరి, ఎందుకా ఉలికిపాటు
ఎందుకా ముప్పేట దాడి

**అఖరికి,**
**అమ్మవారి మెడలో**
**ఎర్ర వస్త్రం**
**నీ ఒంట్లోని**
**రక్తం**
**ఏది చూసినా**
**ఎందుకా హైరానా**

ఓరి పిచ్చోడా..
ఎర్రజెండా
ఎక్కడో లేదురా
పేదోడి కంచంలో
ప్రతి అన్నం మెతుకూ
ఎర్రజెండే

**పాలకులు అమలు చేస్తున్న**
**ప్రతి సంక్షేమ పథకం**
**ఆ జెండా పుణ్యమే**

అధికారం పీఠంపై
తైతక్కలాడుతూ
భూ స్వాముల,
పెట్టుబడిదారుల
సేవలో తరిస్తూ
ప్రజలను ఓట్లుగా చూసిన
పాలకుల పీచమణిచి
పేదోడి పాదాల వద్దకు తెచ్చిన
ఘనత ఆ ఎర్రజెండాదే

**అన్నార్తులు**
**అభాగ్యులుండని**
**సమసమాజమే**
**లక్ష్యంగా సాగుతుంది**

ఆ బాటలో
ఎన్ని పోరాటాలు
ఎన్ని త్యాగాలు
ఎన్ని బలిదానాలు

**ఈ భూ మండలంలో**
**అనంతకోటి విశ్వంలో**
**కమ్యూనిస్టును మించిన**
**యోధుడెవడు**
**మార్క్సిస్టును మించిన**
**మహనీయుడెవడు**

ఒళ్లంతా ఛిద్రమై
రక్తం ఏరులై
రుధిర వర్ణంగా మారిన
చొక్కానే
ఎర్రజెండాగా ఎగురవేసి
విప్లవం అజేయమని నినదించే
గుండె ధైర్యం ఎవడితరం

**శరీరాన్ని చీల్చుతున్నా**
**తూటాలు దిగుతున్నా**
**నిప్పులు వాన కురుస్తున్నా**
**ఎదురెళ్లడం, ఎదిరించడం**
**ఎవడి తరం**

ఒక్క కమ్యూనిస్టుకే సాధ్యం
మార్క్సిస్టుతోనే సుసాధ్యం

**అందుకే**
**మేం హ్యూమనిస్టులం**
**మేం కమ్యూనిస్టులం**
**సమ సమాజ స్థాపనకు**
**కంకణబద్ధులై**
**మరో ప్రపంచంకై**
**సాగుతున్న**
**మార్క్సిస్టులం**
**మార్క్సిస్టులం**
**మార్క్సిస్టులం**

విప్లవం వర్ధిల్లాలి
విప్లవం వర్ధిల్లాలి

- ఎం.విష్ణు ప్రసాద్

---

ఇంటర్వ్యూలు

## ధరణిపై పోరాడాం రైతులకు భూములు ఇప్పించాం

**కె.రాజయ్య, సీపీఐ(ఎం) కొండాపూర్ మండల కార్యదర్శి**



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి రైతులకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతులమీదుగా అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. పట్టాలను కూడా అందజేసింది. అయితే గత కేసీఆర్ సర్కారు ధరణి పోర్టల్‌లో ఆ భూములను చూపలేదు. వాటిని పారిశ్రామిక అవసరాలకు కేటాయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం యత్నించింది. స్థానిక నాయకులూ ప్రభుత్వానికి వత్తాసు పలికారు. మేం దీన్ని చూస్తూ ఊరుకోలేదు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులందర్నీ సమీకరించాం. ఎమ్ఆర్ఓ కార్యాలయాన్ని ముట్టడించాం. ఆ తర్వాత పోరాటంలో భాగంగా 12 కిలోమీటర్లు పాదయాత్రగా కలెక్టరేట్‌కు వెళ్లి ధర్నా చేశాం. ఆర్డీఓ, కలెక్టర్‌తో మాట్లాడి రైతుల పేరిట భూములను ఎక్కించి పట్టాలివ్వాలని వాదించాం. పోరాటాలు చేశాం. 97 మందికి పట్టాలిప్పించడంలో విజయం సాధించాం. ధరణిలో ఆ రైతుల పేరిట ఆ భూములను ఎక్కించడంలో సక్సెస్ అయ్యాం. దీంతో రైతులకు, ప్రజలకు సీపీఐ(ఎం)గా మరింత దగ్గరయ్యాం. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అదే మండలంలోని మాందాపూర్‌లోనూ 327 ఎకరాలకు సంబంధించి 310 మంది రైతులతో భూపోరాటం ప్రారంభించాం. గ్రామసభ పెట్టినట్టు..రైతులు వ్యవసాయానికి ఆ భూములు పనికిరావన్నట్టు రాసినట్టు అధికారులు రికార్డుల్లో రాసి వాటిని పరిశ్రమలకు కేటాయించాలని చూస్తున్నారు. ఇది అన్యాయం. ఏ రైతులు రాసిచ్చారో చూపండి అంటే అధికారులు చూపించట్లేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పేదలకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. ఇప్పుడు మాట మార్చారు. భూములు కోల్పోతున్న రైతులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. కొండాపూర్ ప్రాంతంలో దాదాపు 15 పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు సేకరించారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఆ కంపెనీల్లో స్థానికేతరులే పనిచేస్తున్నారు. ఆ 310 మంది రైతులకు న్యాయం దక్కే దాకా పోరాడుతాం.

## నిబంధనలను తుంగలో తొక్కి ట్రిపుల్‌ఆర్

### రూ.మూడు, నాలుగు కోట్ల విలువైన భూములకు రూ.25 లక్షలు ఇస్తామంటే ఎలా?

**దివీస్ కంపెనీ భూముల కోసం రైతుల భూముల్లోకి మళ్లించడం దుర్మార్గం : బూర్గు కృష్ణారెడ్డి, సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు**



యాదాద్రి భువనగిరి జిల్లాలో నిబంధనలను తుంగలో తొక్కి రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) వేసేందుకు కుట్ర జరుగు తున్నది. ఓఆర్ఆర్ నుంచి కనీసం 40 కిలోమీటర్ల తర్వాతనే ఆర్ఆర్ఆర్ వెళ్లాలి. ఇప్పుడు దివీస్ కంపెనీ కోసం ఆ అలైన్‌మెంట్‌ను 28 కిలోమీటర్లకు కుదించారు. ఆ కంపెనీలో నుంచి ఆర్ఆర్ఆర్ వెళ్లకుండా చూసేందుకు అలైన్‌మెంట్ మార్చారు. ఆ కంపెనీ కోసం చౌటుప్పల్ పట్టణాన్ని రెండు భాగాలుగా చీల్చే ప్రతిపాదనలు దుర్మార్గం. ఎట్టిపరిస్థితుల్లోనూ దీన్ని అంగీకరించం. దీనివల్ల ఎంతో మంది రైతులు భూముల్ని కోల్పోతున్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో 181 ఎకరాలు పోతున్నది. భూములనే నమ్ముకున్న యాదవ కుటుంబాలకు చెందిన 68 ఎకరాలు, 120కిపైగా ప్లాట్లను కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. గజం ప్లాటు 25 వేలకుపైగా ఉన్నది. ఒక్కో ఎకరం రూ.3 నుంచి రూ.4 కోట్లు పలుకుతున్నది. పరిహారం కింద రైతులకు ఒక ఎకరానికి రూ.34 లక్షల మాత్రమే ఇస్తానని ప్రభుత్వం చెబుతున్నది. అంటే ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో చౌటుప్పల్‌లో బాధిత కుటుంబాలకు 100 గజాల జాగా కూడా రాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాం నుంచి కొట్లాడుతున్నాం. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం ఇప్పిస్తామనీ, 60 కిలోమీటర్ల అవుతలికి మారుస్తామని చెప్పారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టించుకోవడంలేదు. ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలిచ్చాం.

మొదట్లో సానుకూలంగా మాట్లాడిన వారు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. రైతులకు, ఇండ్లు కోల్పోతున్నవారికి మార్కెట్ వాల్యూ ప్రకారం పరిహారం ఇవ్వాల్సిందే. ఓఆర్ఆర్ నుంచి 60 కిలోమీటర్ల అవతలికి మార్చాల్సిందే. బాధితులకు న్యాయం దక్కేదాకా పోరాటం చేస్తాం. జేఏసీని కూడా ఏర్పాటు చేశాం. పోరాట తీవ్రతను పెంచుతున్నాం.

## మిర్చి రైతుల పక్షాన కొట్లాడుతున్నాం

**ఎమ్‌డీ గఫూర్, సీపీఐ(ఎం) ములుగు జిల్లా నాయకులు**



వాజేడు వెంకటాపురం ప్రాంతంలో మిర్చివ్యాపారి 2 కోట్ల సరుకుని కొని డబ్బులివ్వకుండా రైతుల్ని మోసం చేసే ప్రయత్నం చేశాడు. దీనిపై పోరాటం చేశాం. ఎస్పీ గౌస్ ఆలంకు దీనిపై ఫిర్యాదు చేసి వ్యాపారిని అరెస్టు చేయించాం. ఎస్పీ సమక్షంలో రైతులకు డబ్బులిప్పిం చేందుకు వ్యాపారితో ఒప్పంద పత్రం రాయించాం. ములుగు మండలంలోని ఏడు గ్రామాల్లో 300 మంది రైతుల నుంచి ఖాసీందేవిపేటకు చెందిన వ్యాపారి ఎమ్‌డీ. ఇబ్రహీం 10 కోట్ల విలువైన మిర్చిని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. వ్యాపారి మోసంతో ఇప్పటికే ఓ మిర్చి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడు గ్రామాల రైతులు ఆర్థిక నష్టాల్లోకి కూరుకు పోయారు. ఏడేండ్ల తర్వాత కాలం మంచిగా అయ్యి పంట మంచిగా చేతి కొచ్చిందనీ, రేటు కూడా బాగా ఉందని రైతులు సంబరపడ్డారు. కానీ, ఇంతలోనే వ్యాపారి ఇలా మోసం చేయడంతో వారు తట్టుకోలేక పోతున్నారు. దీనిపై సీపీఐ(ఎం)గా రైతులతో కలిసి ధర్నాలు నిర్వహించాం. ఎస్పీ, కలెక్టర్, డీజీపీలకు ఫిర్యాదు చేశాం. జాతీయ రహదారిపై పెద్దఎత్తున ఆందోళన చేపట్టాం. మరోవైపు అతనిపై నిఘాపెట్టి పోలీసులు అరెస్టు చేశారు. కేసు నడుస్తున్నది. రైతులకు న్యాయం జరిగేదాకా కొట్లాడుతాం. ప్రభుత్వం సరైన మార్కెటింగ్ వ్యవస్థను కల్పించకపోవడం, మద్దతు ధర కల్పించకపోవడం వంటి వాటి వల్లనే ఇలాంటివి చోటుచేసు కుంటున్నారు. మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధర కోసం కూడా నికరంగా పోరాడుతాం. ఇలాంటి సమస్యలపై పోరాడు తున్నది ఎర్రజెండా పార్టీలే. రైతుల సమ స్యలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు పట్టవు. అవి అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో లేప్పుడు మరోలా వ్యవహరిస్తున్నాయి.

## ఉల్లాసంగా..ఉత్సాహంగా...

సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల్లో సోమవారం మధ్యాహ్నం భోజన విరామంలో డెలిగేట్స్ సందడి చేశారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలకు స్టెప్పులేశారు. చిన్నా పెద్ద...ఆడ, మగ తేడా లేకుండా ఆడి పాడారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఐద్వా నేత మల్లు లక్ష్మి ప్రోత్సాహంతో మహిళా డెలిగేట్స్ ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. సీనియర్ నాయకులు సైతం చిన్నపిల్లల్లా కలిసి ఆడారు. 'పల్లె పల్లె ఎగరాలే ఎర్ర జెండా... మా గల్లి గల్లి ఎగరాలే ఎర్ర జెండా', 'ఎర్రజెండెర్రజెండ ఎన్నీయల్లో ఎర్రెర్రనదీ జెండెన్నీయల్లో ', అమర జీవి మల్లు స్వరాజ్యం రాసిన 'ఎర్రపూల వనములోన పువ్వే రాలిందో నగా దారిలో...' ఆజాదీ హిందీ సాంగ్ ...'సంగారెడ్డి గడ్డపై సీపీఐ(ఎం) సభలంటా..' పాటలకు ఉత్సాహంగా డెలిగేట్స్ ఎర్ర జెండా చేత పట్టి సందడి చేశారు. ఒకవైపు మహిళా ప్రతినిధులు. మరోపక్క మేల్ డెలిగేట్స్ ఆటపాటలతో మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళా నేతలు మల్లు లక్ష్మి, ఎస్ రమ , జయలక్ష్మి, మాచర్ల భారతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య, జాన్‌వెస్లీ, చుక్క రాములు, పోతినేని సుదర్శన్, టి.సాగర్, పాలడుగు భాస్కర్‌తో పాటు స్కైలాబ్ బాబు, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజు ఇతర నాయకులు ఉత్సాహంగా స్టెప్పులేశారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

# సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల దృశ్యమాలిక


ప్రతినిధుల్లో జోష్


కట్ట నర్సింహ


మూడ్ శోభన్




ఆడుతూ.. పాడుతూ
ఎస్. వీరయ్య, జాన్‌వెస్లీ


ప్రతినిధుల ఆటాపాటా




బి. మల్లేష్







ఆటాడుతున్న మహిళా ప్రతినిధులు


కోట రమేశ్


ఎస్ఎఫ్ఐ మాజీ, ప్రస్తుత ప్రతినిధుల బృందం


చర్చల్లో దయాకర్ రెడ్డి


నవతెలంగాణ పత్రికను వీక్షిస్తున్న ప్రతినిధులు


నవతెలంగాణ పత్రికను సీట్లపై అమరుస్తున్న సిబ్బంది




పూసం సచిన్


ఆర్. వెంకటేశ్


హాజరైన ప్రతినిధులు

